


# మనసులో మాట

KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక




ప్రచురణ:-విశాఖపట్నం:- పబ్లిషర్ కంచర్ల ఉపేంద్ర :- సంపుటి:1 సంచిక:90:- శుక్రవారం 14 నవంబర్ 2025:- ఎడిటర్ కంచర్ల అచ్యుతరావు:-పేజీలు25:- వెలరూ/ 7-

శ్రీకాకుళం : విజయనగరం : విశాఖపట్నం: తూర్పుగోదావరి : పశ్చిమగోదావరి : కృష్ణా: గుంటూరు : ప్రకాశం : నెల్లూరు : కర్నూలు: కడప: హైదరాబాద్

# డిసెంబర్ 6 టార్గెట్







- 32 కార్లతో దిల్లీలో పేలుళ్లకు ఉగ్రవాదుల పథకం
- బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రతీకార కుట్ర
- అల్-ఫలాహ్ యూనివర్సిటీలోనే పథక రచన
- దిల్లీ పేలుడు కేసులో దిగ్భ్రాంతి కొల్పే వాస్తవాలు
- దర్యాప్తులో వెల్లడవుతున్న కుట్ర కోణాలు

**న్యూఢిల్లీ, నవంబర్ 13:** దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పేలుడు కేవలం ఒక చిన్న సంఘటన కాదని, దీని వెనుక దేశ వ్యాప్తంగా భారీ ఉగ్ర దాడులకు ప్రణాళిక వేసినట్లు భద్రతా ఏజెన్సీలు గుర్తించాయి. ఈ కుట్రలో వైట్‌కాలర్ ఉగ్రవాదులు పాల్గొన్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. భారీ ఉగ్రదాడి చేసేందుకు.. పేలుడు పదార్థాలు నింపిన 32 కార్లను సిద్ధం చేసేందుకు అనుమానిత ఉగ్రవాదులు ప్లాన్ చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 6న దాడులకు పాల్పడాలని ఉగ్రవాదులు భావించారని విచారణలు తేలింది. అందుకోసమే ఈ 32 కార్లను కూడా సిద్ధం చేసుకున్నారని దర్యాప్తులో తేలింది. ఈ 32 కార్లతో ఢిల్లీతో సహా దేశంలోని పలు నగరాల్లో ఏకకాలంలో దాడుల కోసం ఉపయోగించాలని అనుమానిత ఉగ్రవాదులు భావించినట్లు అధికారులు గుర్తించారు.

వివరాలు 3లో..



## ఆర్టీసీకి రూ. 400 కోట్లు

.. వివరాలు 2లో




## నేడు బీహార్ ఫలితాలు

పలు రాష్ట్రాల్లో ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు నేడే

.. వివరాలు 3లో

## ఢిల్లీలో మరోమారు పేలుడు శబ్దం

ఉలిక్కిపడ్డ మహిపాల్‌పూర్ ప్రాంత ప్రజలు

.. వివరాలు 3లో



# మోస్ట్ లివబుల్ సిటీగా విశాఖను మారుస్తాం

### 2047కి ప్రపంచంలోనే అగ్రస్థానంలో భారతదేశం

- గ్రీన్ ఎనర్జీయే ప్రపంచానికి కీలకమని స్పష్టం చేసిన చంద్రబాబు
- ఏపీని గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా తీర్చిదిద్దుతామని సీఎం ప్రకటన
- నౌకా నిర్మాణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపు
- ప్రకృతి విపత్తులకు భూతాపమే కారణమని ఆందోళన
- విశాఖ ఎకనామిక్ రీజియన్ సదస్సులో చంద్రబాబు

**విశాఖపట్నం :** విశాఖను మోస్ట్ లివబుల్ సిటీగా తీర్చిదిద్దుతున్నామని.. ప్రధాని మోదీ కూడా ఏపీ అభివృద్ధికి సహకరిస్తున్నారని ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. 2038 నాటికి భారత్ రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందన్నారు. భారతదేశం 2047కి ప్రపంచంలోనే అగ్రస్థానంలోకి రావటాన్ని ఎవరూ ఆపలేరని కూడా చంద్రబాబు తెలిపారు. అభివృద్ధి కోసమే ఓ విజన్ తయారు చేసుకుని అమలు చేస్తున్నామని, దేశంలోని నాలుగు నగరాలకు విజన్ తయారు చేయాలని కేంద్రం నిర్దేశించిందని చంద్రబాబు

మిగతా 2 లో

## సీఐఐ సదస్సుకు సర్వం సిద్ధం




- 14,15 తేదీల్లో సదస్సు
- తైవాన్ కంపెనీలతో కీలక ఒప్పందాలు
- ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు వెల్లడి

2

## వేలాదిమందికి ఉద్యోగావకాశాలు

గూగుల్‌తోపాటు టీసీఎస్ కూడా వస్తోంది
విశాఖలో మంత్రి లోకేశ్ వెల్లడి
విశాఖలో ట్రేడ్ సెంటర్‌కు శంకుస్థాపన

2



## క్రెడిట్ చోరీ స్కీం అద్భుతం

### చంద్రబాబుపై జగన్ సెటైర్లు

- వైసీపీ హయాంలో కట్టిన ఇళ్ల క్రెడిట్ కొట్టేస్తున్నారని విమర్శ
- పచ్చి అబద్ధాలతో ప్రచారం చేసుకోవడం హేయమన్న జగన్



ఆంధ్రప్రదేశ్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య 'క్రెడిట్' వార్ తీవ్రస్థాయికి చేరింది. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇరు పక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు విజయవంతంగా "క్రెడిట్ చోరీ స్కీం" నడుపుతున్నారంటూ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

2

## అటవీశాఖ భూముల ఆక్రమణ



- పెద్దిరెడ్డిపై పవన్ ఆరోపణలతో హాట్ టాపిక్
- సర్వత్రా ఇదే అంశంపై చర్చ

2

## రుజువు చేయండి



ఎంపీ మిథున్ రెడ్డి సవాల్
చట్టబద్ధంగా కొనుగోలు చేశామని వెల్లడి

2





## మంత్రి కొండా సురేఖ క్షమాపణలు

పరువునష్టం కేసు ఉపసహరించుకున్న నాగార్జున

03

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు

రూ.3వేలకు పైగా పెరిగిన గోల్డ్

16

# క్రెడిట్ చోరీ స్కీం అద్భుతం



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య 'క్రెడిట్' వార్ తీవ్రస్థాయికి చేరింది. రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇరు పక్షాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు విజయవంతంగా "క్రెడిట్ చోరీ స్కీం" నడుపుతున్నారంటూ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పేదల ఇళ్ల నిర్మాణం విషయంలో ప్రభుత్వం వాస్తవాలను పక్కనపెట్టి, తమ ఘనతగా ప్రచారం చేసుకుంటోందని జగన్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. "చంద్రబాబు గారూ.. మీ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో విజయవంతంగా నడుస్తున్న 'క్రెడిట్ చోరీ స్కీం' చాలా బాగుంది. ఇతరుల కష్టాన్ని తన గొప్పతనంగా చెప్పుకునేవాడు నాయకుడు కాదు. నాటకాల రాయుడు అంటారు" అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసి, నిర్మాణం ప్రారంభించిన ఇళ్లనే ఇప్పుడు తామే కట్టేశామంటూ కూటమి ప్రభుత్వం ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని జగన్ విమర్శించారు. "గత 18 నెలల్లో పేదలకు ఒక్క గజం స్థలం సేకరించలేదు, ఒక్క సెంటు స్థలం ఇవ్వలేదు, ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. గత ప్రభుత్వంలో ఇచ్చిన స్థలాల్లో, మేం శాంక్షన్ చేయించిన ఇళ్లనే పట్టుకుని 'అన్నీ మేమే కట్టేశాం' అని పచ్చి అబద్ధాలు చెప్తున్నారు. ఈ క్రెడిట్ చోరీ హేయంగా ఉంది" అని జగన్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రారంభించామని చెబుతున్న 3,00,092 ఇళ్లలో ఒక్క ఇంటి పట్టా కూడా ప్రస్తుత ప్రభుత్వం ఇవ్వలేదని జగన్ స్పష్టం చేశారు. "ఆ ఇళ్లలో 1,40,010 ఇళ్లు మా హయాంలోనే పూర్తయ్యే దశలో ఉన్నాయి. మరో 87,380 ఇళ్లు స్లాబ్ లెవల్ వరకు, 66,845 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నవి కూడా మా హయాంలో మొదలైనవే. ఇవి కాకుండా అక్టోబర్ 12, 2023న ఒకేరోజు 7,43,396 ఇళ్ల గృహప్రవేశాలతో మా ప్రభుత్వం చరిత్ర సృష్టించింది" అని జగన్ గుర్తుచేశారు. తమ హయాంలో 31.19 లక్షల ఇళ్ల పట్టాలిచ్చి, 21.75 లక్షల ఇళ్లు శాంక్షన్ చేశామని జగన్ తెలిపారు. మిగిలిన 10 లక్షల ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు చేపట్టాల్సింది పోయి, ఆ ఖాళీ స్థలాలను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. "ఒకరి కష్టాన్ని, ఒకరి ఐడియాను మీదిగా చెప్పుకోవడంలో, చివరికి పేదల ఇళ్ల స్థలాలను లాక్కోవడంలో మీకు మీరే సాటి" అంటూ విమర్శించారు. తన పోస్టుకు చ%జతీవస-ఱజష్ట్రశీతీదీఱఎబ% అనే హ్యాష్‌ట్యాగ్‌ను జోడించి చంద్రబాబుపై తన పోరాటాన్ని సోషల్ మీడియాలో ఉద్ధృతం చేశారు.

# రుజువు చేయండి

## ఎంపీ మిథున్ సవాల్



**చిత్తూరు :** అటవీభూముల ఆరోపణలపై ఎంపి మిథున్ రెడ్డి స్పందించారు. విషయమై ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీ మిథున్ రెడ్డి కౌంటర్ అటాక్ ఇచ్చారు. తాజాగా ఆయన పలు విషయాలలో పవన్ కళ్యాణ్ ను పేర్కొంటూ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. పవన్ కళ్యాణ్ ఆరోపణలపై ఆయన తీవ్రంగా స్పందించారు. మిథున్ రెడ్డి ఈ పోస్టులో పవన్ కళ్యాణ్‌ను నేరుగా సవాల్ విసిరారు. ఆయన చేసిన పోస్ట్ లో.. పవన్ కళ్యాణ్ ను పేర్కొంటూ.. మీరు ఆరోపణలు చేసి తర్వాత వెనక్కి తగ్గడంలో నిపుణులు. ఇదే పని మీరు ఎర్రచందనం విషయంలో కూడా చేశారు. ఇప్పుడు మీరు హెలికాప్టర్ నుంచి చూపించిన భూమి మా చట్టబద్ధమైన సొత్తు. మేము ఆ భూమిని 2000 సంవత్సరంలో చట్టబద్ధంగా కొనుగోలు చేశాం అని మిథున్ రెడ్డి తెలిపారు. అలాగే, మీరు చేసిన ఆరోపణలు నిరూపించండి. ఆధారాలు ఉంటే బయటపెట్టండి. లేకపోతే ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయవద్దని ఆయన హెచ్చరించారు.

# వేలాదిమందికి ఉద్యోగావకాశాలు

**విశాఖపట్నం :** విశాఖ ఐటీ హిల్స్‌లో ఐటీ సహా పలు కంపెనీలకు మంత్రి లోకేశ్ భూమి పూజ చేశారు. సెయిల్స్ సాఫ్ట్‌వేర్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, టెక్ తమ్మిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫినోమ్ పీపుల్స్ లిమిటెడ్, రహేజా ఐటీ స్పేస్, రెసిడెన్షియల్ ప్రాజెక్ట్, వరల్డ్ ట్రేడ్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమల ద్వారా రూ.వేల కోట్లు పెట్టుబడులు, వేలాది మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. మంత్రితో పాటు సెయిల్స్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో, ఎండీ కిరణ్, ఫినోమ్ పీపుల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కో ఫౌండర్ హరి బైర్రెడ్డి, ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో రమేష్‌లు కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.21 కోట్లతో సెయిల్ సంస్థ ఏర్పాటు చేసే ఏఐ ఎక్సలెన్స్ సెంటర్ ద్వారా 430మందికి ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఎండీ కిరణ్ వెల్లడించారు. డిజిటల్ ఆంధ్రప్రదేశ్, ఇండియా ఏఐ మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ, క్లౌడ్ టెక్నాలజీలను ఉపయోగించి అత్యాధునిక ఎంటర్ ప్రైజ్ సొల్యూషన్స్‌పై సెయిల్స్ సాఫ్ట్ వేర్ సంస్థ దృష్టిసారించనుంది. విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, ప్రభుత్వ ఉన్నతాధికారులు కార్యక్రమానికి హాజరయ్యారు. విశాఖ యూనిట్‌పై రెండుదశల్లో రూ.207.5 కోట్లు పెట్టుబడి పెట్టి.. 2,500 మందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు హరి బైర్రెడ్డి వెల్లడించారు. అడ్వాన్స్ ప్రొడక్ట్ డెవలప్‌మె, ఏఐ రీసెర్చి, కస్టమర్ డెలివరీ ఎక్సలెన్స్‌పై ఫినోమ్ దృష్టి సారించనుంది. 3 దశల్లో రూ.119.18 కోట్లు పెట్టుబడి పెట్టి, 2వేలమందికి ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో రమేష్ తెలిపారు. రాష్ట్రంలో ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, మెయింటెనెన్స్ సర్వీసెస్, ఐటీ సొల్యూషన్స్, ఐటీఓ సేవల డెలివరీ కార్యకలాపాలను ఐ స్పేస్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సంస్థ చేపట్టనుంది.

# ఆర్టీసీకి రూ.400 కోట్లు

## బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

**అమరావతి :** సూపర్ సిక్స్‌లో భాగంగా స్త్రీ శక్తి పథకాన్ని గత ఆగస్టు నెల నుంచి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి మహిళకూ ఉచిత ఆర్టీసీ ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. ఈ మేరకు ఆగస్టు 15 నుంచి అక్టోబర్ వరకూ ఈ పథకానికైన ఖర్చును ఏపీఎస్ ఆర్టీసీకి చెల్లిస్తూ కూటమి సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. మహిళల జీరో ఫేర్ టికెట్ల ఖర్చుకు సంబంధించిన రూ.400 కోట్ల అదనపు నిధులు విడుదల చేసింది చంద్రబాబు సర్కార్. రెండున్నర నెలల్లో మహిళలకు టికెట్లు జారీ చేసిన మొత్తాన్ని ఆర్టీసీకి చెల్లించింది. తదుపరి చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. మేరకు రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు ఉత్తర్వులు జారీ చేశారు. స్త్రీశక్తి పథకం కోసం ఆర్టీసీకి నిధులు విడుదల చేయడంపై ఆర్టీసీ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు సీఎం చంద్రబా బుకు ఆర్టీసీ ఎన్ఎంయూఏ, అలాగే ఆర్టీసీ కార్మిక పరిషత్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

# మోస్ట్ లివబుల్ సిటీగా విశాఖను మారుస్తాం

మొదటి పేజీ తరువాయి

చెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ వ్యాఖ్యలు చేశారు. ముంబై, వారణాసి, సూరత్, విశాఖల అభివృద్ధికి ఈ సరికొత్త విజన్ అమలు చేయాలని కేంద్రం నిర్ణయించిందని చంద్రబాబు అన్నారు.అక్షర క్రమంలో, అభివృద్ధి పోటీలో ఏపీనే ఎప్పుడూ ముందుంటుందని చంద్రబాబు ఈ సందర్భంగా అన్నారు. 'సాగర తీరాన ఉన్న విశాఖ నగరం దేశంలోనే అత్యంత సుందరమైన ప్రాంతం. గత పాలకులు రాష్ట్రాన్ని.. దాని అభివృద్ధిని సర్వనాశనం చేశారు. అందుకే కూటమిగా ప్రజల మద్దతుతో పునర్నిర్మాణం చేస్తున్నాం. రూ.2.66 లక్షల కోట్ల ఎంఓయూలు సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ కంటే ముందే చేశాం. 17 నెలల్లోనే రాష్ట్రానికికి 20 లక్షల కోట్ల పెట్టుబడులు తేగలుగుతున్నాం.' అని చంద్రబాబు అన్నారు. 'గూగుల్ డేటా సెంటర్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో వస్తోంది. అనకాపల్లిలో దాదాపు రూ.1 లక్ష కోట్లతో స్టీల్ లాంట్ రాబోతోంది. 9 జిల్లాలతో ఏర్పాటు చేస్తున్న విశాఖ ఎకనామిక్ రీజియన్ భవిష్యత్ ఆర్థిక శక్తిగా ఏపీని నిర్దేశిరచే ఓ మోడల్. ఈ ఎకనామిక్ రీజన్ సీఈఓ గా.. ఇండస్ట్రీ సెక్రెటరీ యువరాజు వ్యవహరిస్తారు. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్, సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నాం. విశాఖ ఎకనామిక్ రీజియన్ అథారిటీకి ఛైర్మన్ హోదాలో నేనే స్వయంగా అభివృద్ధిని పర్యవేక్షిస్తాను.' అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో రూ. 2.66 లక్షల కోట్ల ఎంఓయూలు సీఐఐ భాగస్వామ్య సదస్సు కంటే ముందే చేశామని ముఖ్యమంత్రి చంద్రబాబు (వెల్లడించారు. 9 జిల్లాలతో ఏర్పాటు చేస్తున్న విశాఖ ఎకనామిక్ రీజియన్ నిర్దేశిరచే ఓ మోడల్ కానుందన్నారు.విశాఖ ఎకనామిక్ రీజియన్ డెవలప్‌మెంట్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి , నీతిఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం విడుదల చేశారు. 17 నెలల్లోనే రాష్ట్రానికి రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు తేగలుగుతున్నామని పేర్కొన్నారు. విశాఖను గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ డెస్టినేషన్, సుస్థిర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. విశాఖపట్నం ఇండస్ట్రియల్ రీజియన్ మాస్టర్ ఎ÷-లాన్- 2040కు రూపకల్పన చేశామని, తూర్పుతీరంలో వీఈఆర్ దేశ ఆర్థిక ప్రగతికి గేట్వగా పనిచేస్తుందని తేల్చిచెప్పారు. విశాఖ ఎకనామిక్ రీజియన్ అథారిటీకి ఛైర్మన్ హోదాలో తానే స్వయంగా నెలకోసారి అభివృద్ధిని సమీక్షిస్తానని తెలిపారు.



# సీఐఐ సదస్సుకు సర్వం సిద్ధం

## 14,15 తేదీల్లో రెండ్రోజులు పాటు సదస్సు




విశాఖపట్నం : విశాఖలో రెండురోజుల పాటు జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం సముద్రతీర నగరం విశాఖపట్టణం అందంగా ముస్తాబయ్యింది.14,15 తేదీల్లో సిఐఐ సదస్సు జరుగనుండగా... ఇందు కోసం ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సదస్సును రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే విశాఖకు చేరుకుని పలు కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు. సీఐఐ సదస్సుకు ముందే వివిధ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలను కుదుర్చుకుంటోంది. ఈ ఒప్పందాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. విశాఖపట్నం సీఐఐ పార్టనర్ షిప్ కన్నా ముందే సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తైవాన్ కంపెనీలతో రెండు కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనుందని సీఎం తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్ర పారిశ్రామికవృద్ధి మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 400 కోట్ల రూపాయిలతో కుప్పంలో 470 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు చేస్తుందని.. దీని వలన 50 వేలమందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. మిజోలి ఇండియా జెవి, మిజోలి యూఎస్ఏ, క్రియేటివ్ సెన్సార్ (తైవాన్), సినేస్టి టెక్నాలజీలు 23 జిడబ్ల్యూహెచ్ ఫ్రికర్సర్ ఫ్రి సింగిల్ క్రిస్టర్ క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్, సాలిడ్ స్టేట్ ఎలక్ట్రోలైట్ మ్యానిఫ్యాక్చరింగ్ ఫేసిలిటిని ఓర్వకల్లు, కర్నూలులో రూ.18 వేల కోట్లతో ఏర్పాటు చేయనుంది. వీటివల్ల 2 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు రానున్నాయన్నారు. ఈ అవగాహన ఒప్పందాలు స్వర్ణాంధ్రా విజన్ 2047 సాధించడంలో కీలక భూమిక పోషిస్తాయని... వికాసిత్ భారత్ వైపు నడిపిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు. తైవాన్ కంపెనీల పెట్టుబడులకు ఏపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూలంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా విశాఖకు వచ్చిన తైవాన్ బృందం సీఎంతో భేటీ అయింది. తైపీ ఎకనామిక్ అండ్ కల్చర్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్ చెన్ నేతృత్వంలోని బృందం చంద్రబాబును కలిసింది. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్టులకు అనుకూలంగా ఏపీలో పారిశ్రామిక కారిడార్లను తీర్చిదిద్దుతున్నామని తైవాన్ బృందానికి సీఎం తెలిపారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు. తైవాన్ కంపెనీలు ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, ఈవీ బ్యాటరీ తదితర రంగాల్లో ఏపీతో కలిసి పని చేయాలని సీఎం తైవాన్ కంపెనీలను ఆహ్వానించారు. ఇండో-తైవాన్ ఇండస్ట్రియల్ పార్కును కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్టు తైవాన్ ప్రతినిధి బృందం తెలిపింది. అలీజియన్స్ గ్రూప్ రూ.400 కోట్ల వ్యయంతో ఈ పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేసేందుకు సిద్ధమని సీఎంకు వెల్లడించింది.

### రెన్యూ పవర్ రూ. 82 వేల కోట్లు పెట్టుబడులు

### సీఎం చంద్రబాబు సమక్షంలో ఒప్పందం

భాగస్వామ్య సదస్సు కంటే ముందుగానే రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున ఎంఓయూలు కుదుర్చుకుంటోంది. గత ప్రభుత్వంలో రాష్ట్రం నుంచి వెళ్లిపోయిన పరిశ్రమలు తిరిగి ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి. మంత్రి లోకేష్ ప్రకటించినట్లు ఇంధన రంగంలో రీన్యూ పవర్ సంస్థ భారీ పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా విశాఖలో ఏపీ ప్రభుత్వంతో రీన్యూ పవర్ గురువారం ఒప్పందం చేసుకుంది. రూ. 82 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ సమక్షంలో రీన్యూ పవర్ సంస్థ ఎంఓయూలు కుదుర్చుకుంది. ఈడీబీతో రూ.60 వేల కోట్ల విలువైన నాలుగు ఎంఓయూలను రీన్యూ పవర్ సంస్థ ప్రతినిధులు కుదుర్చుకున్నారు. ఇవి కాకుండా గతంలోనే రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు రీన్యూ పవర్ ముందుకు వచ్చింది. పునరుత్పాదక శక్తి, సోలార్ తయారీ, బ్యాటరీ స్టోరేజ్, పంప్డ్ హైడ్రో, గ్రీన్ అమ్మోనియా రంగాల్లో రీన్యూ పవర్ సంస్థ పెట్టుబడులు పెడుతోంది. ఒప్పందంలో భాగంగా 6 జీడబ్ల్యూ పీవీ ఇంగోట్-వేఫర్ ఎ÷-లాంట్, 2 జీడబ్ల్యూ పంప్డ్ హైడ్రో ప్రాజెక్ట్, 300 కేటీపీఏ గ్రీన్ అమ్మోనియా సౌకర్యం, విండ్, సోలార్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ వంటి వాటిల్లో 5 జీడబ్ల్యూ హైబ్రిడ్ ప్రాజెక్టులను రీన్యూ పవర్ ఏర్పాటు చేయనుంది. తాజా ఎంఓయూల ద్వారా 10 వేలకు పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగ, ఉపాధికి అవకాశం లభించనుంది. ఇప్పటికే దేశంలోని అతిపెద్ద హైబ్రిడ్ పునరుత్పాదక శక్తి ప్రాజెక్టును అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసేందుకు రీన్యూ పవర్ అంగీకారం తెలిపింది. గత ప్రభుత్వంలో రాష్ట్రం వీడి వెళ్లిన కంపెనీలు తిరిగి భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నాయని మంత్రి లోకేష్ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. లోకేష్ ట్వీట్ చేసిన ప్రకటనపై విశాఖలో సీఐఐ సమ్మిట్‌కు ముందు రీన్యూ పవర్‌తో రాష్ట్ర ప్రభుత్వానికి ఒప్పందం కుదిరింది.

# అటవీశాఖ భూముల ఆక్రమణ



**అమరావతి :** అటవీశాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై డిప్యూటి సిఎ పవన్ కళ్యాణ్ చేసిన అటవీ భూ ఆక్రమణ ఇప్పుడు సంచలనంగా మారింది. సర్వత్రా ఇప్పుడు ఇదే అంశంపై చర్చిస్తున్నారు. ముఖ్యంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గామారింది. అలాగే దీనిపై పెద్ది రెడ్డి తనయుడు, ఎంపి మిథున్ రెడ్డి ఘాటుగా స్పందించారు. దీనిని రుజువు చేయాలన్నారు. శేషాచల అటవీ ప్రాంతంలో భూకబ్జాలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన బహిరంగ ఆరోపణలు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. జనసేన పార్టీ 'బిగ్ ఎక్స్‌పోజ్'గా ప్రచారం చేసిన ఈ విషయం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. పవన్ కళ్యాణ్ ఇటీవల తిరుపతి పర్యటన సందర్భంగా.. మంగళంపేట అటవీ ప్రాంతంలోని అక్రమ ఆక్రమణలపై స్వయంగా పరిశీలన చేశారు. ఆయన ఏరియల్ వ్యూ వీడియోలు, మ్యాపింగ్‌లు, ఉపగ్రహ చిత్రాలతో కూడిన ఆధారాలను విడుదల చేశారు. ఈస్ట్ ఘాట్స్ పరిధిలోని రక్షిత అటవీ భూముల్లో సుమారు 76.74 ఎకరాల భూకబ్జా జరిగినట్లు అందులో పేర్కొన్నారు. ఈ భూములు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి సంబంధించినవని పవన్ కళ్యాణ్ తన 'ఎక్స్' ఖాతా పోస్టులో తెలిపారు. ఈ ఘటనపై పవన్ కళ్యాణ్ సమగ్ర నివేదికను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సమర్పించారు. రక్షిత అటవీ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు జరగడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ దానిపై దర్యాప్తు అవసరమని సూచించారు. ఇకపోతే అడవి మధ్యలో ఉన్న భూమి అటవీశాఖ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి వారసత్వంగా ఎలా వచ్చిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రశ్నించారు. భూమి ఎప్పుడు చేతులు మారిందో తెలుసుకోవాలని, దీనిలో ఎవరి పాత్ర ఎంతనే దానిపై నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. పుంగనూరు నియోజకవర్గం మంగళంపేటలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల చేతిలోని 104 ఎకరాల అటవీ భూములపై పవన్‌కళ్యాణ్ అటవీశాఖ ఉన్నతాధికారులతో చర్చించారు. మంగళంపేటలో సర్వే నంబర్లు 295, 296లో అసలు భూమి విస్తీర్ణం ఎంత, అది కాలానుగుణంగా ఎలా పెరిగిందనేది కీలకమైన అంశం. సర్వే నంబర్లు సబ్ డివిజన్ చేసి అటవీ భూములను ప్రణాళిక ప్రకారం కలిపేసుకున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇదంతా ఎలా జరిగిందనే అంశంపై దృష్టి పెట్టాలన్నారు. రక్షిత అటవీ భూముల్లో ఆస్తులు కబ్జా చేసి ఎస్టేట్‌లు నిర్మించిన వాళ్లు ఎంతటి వారైనా ఉపేక్షించకుండా చట్ట ప్రకారం ముందుకెళ్లాలి. భూములు ఆక్రమించిన వారి వివరాలు అటవీశాఖ వెబ్‌సైట్‌లో పెట్టాలి. వారిపై కేసులు ఏ స్థితిలో ఉన్నాయనే వివరాలు ప్రజలకు తెలియాలన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు ఆయన కుమారుడు మిథున్‌రెడ్డి 2024 ఎన్నికల్లో అటవీ భూములపై అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం అందించారన్న విషయం నా దృష్టికి వచ్చింది. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోండి. భూ రిజిస్ట్రేషన్ రికార్డుల ప్రకారం 40.80 ఎకరాలు వారి ఆధీనంలో ఉంటే.. వెబ్‌ల్యాండ్‌లోకి వచ్చే సరికి 77.54 ఎకరాలుగా చూపారు. ఒకేసారి ఎందుకు ఇంత పెరిగిందన్నది పరిశీలించాలన్నారు. మంగళంపేట అటవీ భూముల ఆక్రమణపై విజిలెన్స్ నివేదిక ఎంతో కీలకం. పెద్దిరెడ్డి కుటుంబం ఆక్రమించిన భూముల పూర్తి వివరాలు అందులో ఉన్నాయి. వాటిని ప్రాతిపదికగా తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.

### ఏనుగుల సంచారంపై ముందస్తు హెచ్చరికలు

### అటవీ అధికారులకు డిప్యూటి సీఎం సూచన

ఏనుగుల సంచారంపై ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. అటవీ ప్రాంతాలను ఆనుకొని ఉన్న గ్రామాలలోకి ఏనుగులు ప్రవేశించే పరిస్థితులు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నప్పుడు ముందస్తు హెచ్చరికలు చేయాలన్నారు. ఈ ప్రక్రియను మరింత పెంచాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. కుప్పం మండలంలోని వెంకటేశ్వరపురం గ్రామంలో కిట్టయ్య అనే వ్యక్తి ఏనుగు దాడిలో మరణించిన ఘటనపై పవన్ కళ్యాణ్ స్పందించారు. ఈ ఘటనపై పీసీసీఎఫ్, సంబంధిత అధికారులతో గురువారం ఉదయం డిప్యూటీ సీఎం చర్చించారు. కిట్టయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆ కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని సత్వరమే అందించాలని ఆదేశాలు జారీ చేశారు. తమిళనాడు అటవీ ప్రాంతం వైపు నుంచి వచ్చిన ఏనుగు మూలంగా ఈ ఘటన చోటు చేసుకుందని, అక్కడ కూడా సదరు ఏనుగు మూలంగా మరణాలు సంభవించాయని పవన్‌కు అటవీ శాఖ అధికారులు వివరించారు. మన రాష్ట్ర అటవీ ప్రాంతంలోకి వస్తోందని ట్రాక్ చేసిన వెంటనే సమీప గ్రామాల వారికి ముందుగానే తెలియచేశామని చెప్పారు. దీనిపై పవన్ కళ్యాణ్ స్పందిస్తూ.. ముందస్తు హెచ్చరికలను మరింత విస్తృతం చేయాలన్నారు. గ్రామాలవారీగా నూ, రైతులతోనూ సోషల్ మీడియా గ్రూప్స్ ఏర్పాటు చేసి వాటికి టెక్స్ట్ మెసేజ్‌లతో పాటు, వాయిస్ మెసేజ్‌లు కూడా పంపిస్తే సమాచారం తొందరగా చేరుతుందని అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనలు చేశారు.

# ఐదు రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాలు

**అల్‌ఖైదాతో సంబంధం ఉన్న బంగ్లాదేశీయుల గుర్తింపు**

**న్యూఢిల్లీ, నవంబర్ 13:** జాతీయ దర్యాప్తు సంస్థ గురువారం ఐదు రాష్ట్రాల్లో దాడులు నిర్వహించింది. అల్ ఖైదా గుజరాత్ ఉగ్రవాద కుట్రలో అక్రమ బంగ్లాదేశ్ వలసదారుల ప్రమేయం ఉన్నట్లుగా అనుమానిస్తున్నారు. ఐదు రాష్ట్రాల్లోని దాదాపు పది చోట్ల ఎన్ఐఏ తనిఖీలు నిర్వహించింది. పశ్చిమ బెంగాల్, త్రిపుర, మేఘాలయ, హర్యానా, గుజరాత్‌లలో అనుమానితులు, వారి సహచరులకు సంబంధించిన స్థలాల్లో ఎన్ఐఏ బృందాలు సోదాలు చేసినట్లుగా ఎన్ఐఏ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఈ కేసు 2023లో నమోదైంది. నలుగురు బంగ్లాదేశ్ జాతీయులు మొహమ్మద్ సోజిబ్ మియాన్, మున్నా ఖలీద్ అన్సారీ, అజ్రుల్ ఇస్లాం, అబ్దుల్ లతీఫ్ పేర్లు ఇందులో ఉన్నాయి. నిందితులు ఫేక్ ఐడీలను ఉపయోగించి బంగ్లాదేశ్ నుంచి అక్రమంగా భారత్‌లోకి ప్రవేశించారు. వారికి నిషేధిత అల్ ఖైదా ఉగ్రవాద సంస్థతో సంబంధం కలిగి ఉన్నట్లుగా గుర్తించారు. బంగ్లాదేశ్‌లోని అల్-ఖైదా కార్యకర్తలకు నిధులు సేకరించడం, బదిలీ చేసినట్లుగా తేలింది. ముస్లిం యువతను ఉగ్రవాదం వైపు ప్రోత్సహిస్తున్నట్లు గుర్తించారు. ఎన్ఐఏ నవంబర్ 10, 2023న అహ్మదాబాద్‌లోని ప్రత్యేక కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. గతంలో మహారాష్ట్ర యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ నిషేధిత ఉగ్రవాద సంస్థలు అల్-ఖైదా, భారత ఉపఖండంలోని అల్-ఖైదాతో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ పుణెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను అరెస్టు చేసింది. ఏటీఎస్ థానేకు చెందిన




ఓ ఉపాధ్యాయుడిని ప్రశ్నించింది. అక్టోబర్ 27న ఏటీఎస్ 37 ఏళ్ల జుబైర్ హంగర్గేకర్‌ను అరెస్టు చేసింది. అతను నిషేధిత సంస్థలతో సంబంధం కలిగి ఉన్నాడని, రాడికలైజేషన్ కార్యకలాపాల్లో పాల్గొన్నాడని ఆరోపణలున్నాయి. దర్యాప్తులో ఏటీఎస్ అతని పాత్రతో పాటు పాకిస్తానీ కాంటాక్ట్ నంబర్‌ను గుర్తించారు.

# పేలుడు ఘటనలో 13కు చేరిన మృతుల సంఖ్య

**చికిత్స పొందుతూ మరొకరు మృతి**



**న్యూఢిల్లీ, నవంబర్13 :** దేశ రాజధాని ఢిల్లీలో పేలుడు ఘటనలో మృతుల సంఖ్య పెరిగింది. లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరో వ్యక్తి మరణించారు. దీంతో పేలుడు ఘటనలో మరణించిన వారి సంఖ్య 13కి పెరిగింది. సోమవారం సాయంత్రం ఢిల్లీలోని చారిత్రక కట్టడం ఎర్రకోట సమీపంలో భారీ పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. సాయంత్రం 7 గంటల సమయంలో భారీ శబ్దంతో పేలుడు జరిగింది. ఈ ఘటనలో అక్కడికక్కడే తొమ్మిది మంది మరణించారు. మరో 20 మంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరుసటి రోజు ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. ఇప్పుడు మరో వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. మిగతావారికి ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది.

# ఢిల్లీలో మరోమారు పేలుడు శబ్దం

**ఉలిక్కిపడ్డ మహిపాల్‌పూర్ ప్రాంత ప్రజలు**

**బస్సు టైర్ పేలినట్లు అధికారుల గుర్తింపు**

**న్యూఢిల్లీ, నవంబర్ 13:** ఢిల్లీలో పేలుడు ఘటనతో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈ ఘటనతో ఢిల్లీ వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భారీ కుట్రకు ఉగ్రవాదులు ప్లాన్ చేశారని తేలడంతో నగర వాసులు భయంతో వణికిపోతున్నారు. ఈ క్రమంలో ఎలాంటి పేలుడు శబ్దం వినిపించినా ఉలిక్కి పడుతున్నారు. తాజాగా ఢిల్లీలో తాజాగా భారీ శబ్దం కలకలం రేపింది. గురువారం ఉదయం ఢిల్లీలోని మహిపాల్‌పూర్ ప్రాంతంలో రాడిసన్ హోటల్ సమీపంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. మరోసారి పేలుడు జరిగిందని ఆందోళన చెందారు. అయితే, అది పేలుడు కాదని అధికారులు తేల్చారు. ఆ శబ్దం బస్సు టైర్ పేలడం వల్ల వచ్చిందిగా తేల్చారు. ఢిల్లీ అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. 'మహిపాల్‌పూర్ ప్రాంతంలో రాడిసన్ హోటల్ సమీపంలో భారీ శబ్దం వచ్చిందంటూ అగ్నిమాపక శాఖకు ఉదయం 9:18 గంటలకు ఫోన్ కాల్ వచ్చింది. అప్రమత్తమైన అధికారులు, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. అయితే, ఆ శబ్దం టైరు పేలడం వల్ల వచ్చింది. పేలుడు కాదు' అని తెలిపారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



# మూడో కారు కోసం దర్యాప్తు ముమ్మరం

**ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు స్వాధీనం**

**కారు నడిపిన వ్యక్తి ఫహీమ్ అరెస్ట్**

**న్యూఢిల్లీ, నవంబర్ 13:** ఢిల్లీ పేలుడు కేసులో తాజాగా మరో అరెస్ట్ చోటు చేసుకుంది. పేలుడు కేసులో ప్రధాన అనుమానితుడైన డాక్టర్ ఉమర్ ఉన్ నబీకి సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న డీఎల్10సీకే0458 అనే ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. హర్యానాలోని ఖండవలి గ్రామంలో బుధవారం కనుగొన్నారు. అయితే, ఆ కారును అక్కడ పార్క్ చేసిన వ్యక్తిని ఫరీదాబాద్ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. అతడిని ఫహీమ్‌గా గుర్తించారు. ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు నిఘా వర్గాల ద్వారా తెలిసింది. మరోవైపు ఎర్రకోట వద్ద పేలుడుతో సంబంధం ఉన్న మూడో కారు కోసం దర్యాప్తు సంస్థలు వేట కొనసాగిస్తున్నాయి. సోమవారం సాయంత్రం తెలుపు రంగు హుందయ్ ఐ20 కారుతో డాక్టర్ ఉమర్ నబీ ఆత్మాహుతి దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. ఉగ్రకుట్ర కోసం మూడు కార్లు వాడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు ఎరుపు రంగు ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారును ఫరీదాబాద్‌లో గుర్తించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మూడో కారు మారుతీ బ్రీజా కోసం పోలీసులు అన్వేషిస్తున్నారు. ఆ కారు ఆచూకీ చిక్కడం లేదు. నిందితులు ఆ మూడో కారును తప్పించుకోవడం కోసం వాడాలని భావించి ఉంటారని అధికారులు అనుమానిస్తున్నారు. దర్యాప్తు సంస్థలకు చెందిన బృందాలు ఆ కారు కోసం వేట కొనసాగిస్తున్నాయి. మారుతీ బ్రీజా కారును గుర్తించేందుకు ఢిల్లీ, ఎన్సీఆర్ ప్రాంతంతో పాటు సమీప రాష్ట్రాల్లోనూ పోలీసులు వెతుకుతున్నారు.

# టార్గెట్ డిసెంబర్ 6

**32 కార్లతో వరుస పేలుళ్ల కోసం రెడీ అయిన ముష్కరులు**

**దర్యాప్తులో వెల్లడవుతున్న కుట్ర**

**న్యూఢిల్లీ, నవంబర్ 13:** దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పేలుడు కేవలం ఒక చిన్న సంఘటన కాదని, దీని వెనుక దేశ వ్యాప్తంగా భారీ ఉగ్ర దాడులకు ప్రణాళిక వేసినట్లు భద్రతా ఏజెన్సీలు గుర్తించాయి. ఈ కుట్రలో వైట్‌కాలర్ ఉగ్రవాదులు పాల్గొన్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. భారీ ఉగ్రదాడి చేసేందుకు.. పేలుడు పదార్థాలు నింపిన 32 కార్లను సిద్ధం చేసేందుకు అనుమానిత ఉగ్రవాదులు ప్లాన్ చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 6న దాడులకు పాల్పడాలని ఉగ్రవాదులు భావించారని విచారణలు తేలింది. అందుకోసమే ఈ 32 కార్లను కూడా సిద్ధం చేసుకున్నారని దర్యాప్తులో తేలింది. ఈ 32 కార్లతో ఢిల్లీతో సహా దేశంలోని పలు నగరాల్లో ఏకకాలంలో దాడుల కోసం ఉపయోగించాలని అనుమానిత ఉగ్రవాదులు భావించినట్లు అధికారులు గుర్తించారు. నిందితులు దాడుల కోసం ఐ20, ఎకోస్పోర్ట్ వంటి కార్లను ఎంపిక చేసుకుని.. వాటిని పేలుడు పదార్థాలను నింపేందుకు వీలుగా మాడిఫై చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సీరియల్ పేలుళ్లకు పాల్పడాలన్నదే వారి ప్రధాన ఉద్దేశమని భద్రతా ఏజెన్సీల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఇప్పటి వరకు నాలుగు కార్లను గుర్తించారు. ఇవన్నీ పాత కార్లుగా తేలాయి. దాడుల కోసం పాత కార్లను ఉగ్రవాదులు కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే బ్రెజ్జా, స్విఫ్ట్, ఎకోస్పోర్ట్ వంటి కార్లను పోలీసులు గుర్తించారు. బ్రెజ్జా కారు హర్యానాలోని ఫరీదాబాద్(




ఈజీసతిటజీశిజీట)లోని అల్-ఫలాహ్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ క్యాంపస్‌లో కనుగొనబడింది. అలానే ఎకోస్పోర్ట్ కారు బుధవారం రాత్రి హర్యానాలోని ఫరీదాబాద్‌లో కనుగొనబడింది. మరోవైపు ఈ 32 కార్ల ద్వారా నాలుగు వేర్వేరు లోకేషన్లలో దాడులకు వినియోగించాలని మె-ుత్తం ఎనిమిది మంది అనుమానిత ఉగ్రవాదులు ప్రణాళిక వేసినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు వెల్లడించారు. ఈ దాడుల కోసం అవసరం అయ్యే పేలుడు పదార్థాల కొనుగోలుకు వైట్‌కాలర్ డాక్టర్లు నిధులు సమకూర్చారని పేర్కొన్నారు. నిందితులు సుమారు రూ. 26 లక్షల నిధిని సేకరించినట్లు సమాచారం. ఈ నిధులను పోగు చేసిన అనుమానితుల్లో డాక్టర్ ముజమ్మిల్ గన్నై, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, డాక్టర్ షహీన్ సయ్యిద్, డాక్టర్ ఉమర్ నబీ ఉన్నారని అధికారులు గుర్తించారు. ఈ నిధులను ఉగ్ర కార్యకలాపాలను నిర్వహించేందుకు ప్రధానంగా డాక్టర్ ఉమర్ నబీ ఉపయోగించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఉన్నత విద్యావంతులు, వైట్‌కాలర్ ఉద్యోగులు ఉగ్ర కుట్రలో భాగం కావడాన్ని కేంద్ర ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి.

# నేడు బీహార్ ఎన్నికల ఫలితాలు

**పాట్నా :** దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న బిహార్ ఎన్నికల ఫలితాలు శుక్రవారం విడుదల కానున్నాయి. సీఎం నితీశ్ కుమార్ తన అధికారాన్ని నిలబెట్టుకుంటారా? లేదా? అనేది నేటితో తేలిపోతుంది. ఎగ్జిట్ పోల్ సర్వేల ప్రకారం మళ్లీ ఎన్‌డిఎ గెలుస్తుందని ప్రకటించారు. అయితే దీనిని తేజస్వియాదవ్ కొట్టి పారేశారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా చేసి రికార్డు నెలకొల్పిన నితీశ్ కుమార్ ఈసారి గెలిస్తే సరికొత్త చరిత్ర సృష్టించిన వారవుతారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల సంఘం ఇటీవల తెలిపింది. కౌంటింగ్ సెంటర్లలో రెండంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామని వెల్లడించింది. మొదటి భద్రతా వలయంలో కేంద్ర పారామిలిటరీ దళాలు, ఆ తరువాత రాష్ట్ర పోలీసు బలగాలతో పహారాను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. 24/7 సీసీటీవీ నిఘా కూడా ఉంటుందని వెల్లడించింది. ఇక ఓట్లు భద్రపరిచిన ప్రతి స్ట్రాంగ్ రూమ్ క్యాంపస్ వద్ద జిల్లా సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఓ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా ఎలక్షన్ ఆఫీసర్లు, రిటర్నింగ్ ఆఫీసర్లు స్ట్రాం÷-రగ్ రూమ్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఈసీ ఆదేశించింది. ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ భారీ స్థాయిలో నమోదైన విషయం తెలిసిందే. 243 అసెంబ్లీ నియోజకవర్గాలకు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఓటింగ్ నిర్వహించగా రికార్డు స్థాయిలో 67.13 శాతం మేర పోలింగ్ జరిగింది. దీంతో, ప్రజాతీర్పుపై ఉత్కంఠ పతాకస్థాయికి చేరుకుంది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే క్లీన్ స్వీప్ చేస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కూటమి నేత తేజస్వీ యాదవ్ మాత్రం ఈ అంచనాలను కొట్టిపారేశారు. తమ కూటమి మంచి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అన్నారు.సీఎం నితీశ్ సారథ్యంలోని జేడీ(యూ), బీజేపీతో సహా ఎన్డీయే (ఔఆం) కూటమిలోని ఐదు పార్టీలు బరిలో నిలిచాయి. జేడీ(యూ), బీజేపీలు 101 నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. ఇక ఆర్జేడీ, కాంగ్రెస్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, ఇతర లెఫ్ట్ పార్టీలు, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీలు మహాగఠ్‌బంధన్‌గా (మహాకూటమి) ఏర్పడి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి.

# విజయవాడ నడిబొడ్డున దారుణం

**సూర్యారావు పేటలో భార్యను హత్య చేసిన భర్త**

**విజయవాడ :** విజయవాడలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యను కత్తితో నరికి హత్య చేసిన భర్త స్థానికులను భయాందోళనలకు గురి చేశాడు. ఈ సంఘటన గురువారం ఉదయం సూర్యారావు పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. హత్యకు గురైన మహిళ సరస్వతీగా గుర్తించారు. ఆమె భర్త విజయ్ తో గత కొంతకాలంగా దాంపత్య జీవితం సజావుగా సాగడం లేదు. తరచూ చిన్నచిన్న విషయాలపై ఇద్దరి మధ్య వాగ్వాదాలు జరుగుతున్నాయని, ఇటీవల వీరిద్దరూ విడివిడిగా నివసిస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం విజయ్ కోపంతో భార్య ఉన్న చోటుకు వెళ్లి, కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఈ ఘటనలో సరస్వతీ అక్కడికక్కడే మృతిచెందింది. హత్య అనంతరం కూడా విజయ్ కత్తితో వీరంగం సృష్టించాడని, స్థానికులు భయంతో దగ్గరికి రాలేకపోయారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఎవరైనా దగ్గరికి వస్తే చంపేస్తా అంటూ విజయ్ కేకలు వేయడంతో ప్రాంతం మొత్తం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తరువాత సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సూర్యారావు పేట పోలీసులు నిందితుడు విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్యాభర్తల మధ్య కొనసాగుతున్న వ్యక్తిగత విభేదాలే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# మంత్రి కొండా సురేఖ క్షమాపణలు

**పరువునష్టం కేసు ఉపసహరించుకున్న నాగార్జున**

**హైదరాబాద్,నవంబర్13:** తెలంగాణ మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావా కేసును ప్రముఖ సినీ హీరో నాగార్జున వెనక్కి తీసుకున్నారు. తమ కుటుంబంపై సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వేసిన పరువు నష్టం దావా కేసును ఉపసంహరించుకున్నట్లు నాగార్జున వెల్లడించారు. గతంలో నాగచైతన్య- సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2 అక్టోబరు 2024న హైదరాబాద్ మీడియాతో మాట్లాడిన మంత్రి సురేఖ.. నాగచైతన్య-సమంత విడాకులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే కారణమంటూ సంచలన కామెంట్స్ చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. మంత్రి వ్యాఖ్యలపై సీరియస్ అయిన నటుడు నాగార్జున పరువు నష్టం దావా కేసు వేశారు. క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్ వేశారు. కేసుపై నాంపల్లి స్పెషల్ కోర్టు గురువారం విచారణ చేపట్టింది. అయితే, కొండా సురేఖ బహిరంగ క్షమాపణ చెప్పడంతో కేసును విత్ డ్రా చేసుకున్నారు నాగార్జున. కాగా, ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా అక్కినేని కుటుంబానికి రెండుసార్లు క్షమాపణ చెప్పారు మంత్రి కొండా సురేఖ.ఈ క్రమంలో మంత్రి కొండా సురేఖపై వేసిన క్రిమినల్ దావాను ప్రముఖ నటుడు నాగార్జున ఉపసంహరించుకున్నారు. నాగార్జున కుటుంబంపై తాను గతంలో చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నానని మంత్రి కొండా సురేఖ ఎక్స్‌లో పోస్టు చేశారు. నాగార్జున, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనే ఉద్దేశంతో నేను ఆ వ్యాఖ్యలు చేయలేదు. వారిని ఇబ్బందిపెట్టాలని కాని, వారి పరువు-ప్రతిష్టలకు భంగం కలిగించాలన్నది కాని నా ఉద్దేశం కాదు. నాగార్జున కుటుంబంపై నేను చేసిన వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా. నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంత్రిపై దాఖలు చేసిన పరువునష్టం కేసును ఉప సంహరించుకుంటున్నట్టు నాగార్జున తెలిపారు.

# ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొన్న కంటెయినర్



**ముంబై :** మహారాష్ట్రలో పుణె - బెంగళూరు జాతీయ రహదారిలోని నవలే వంతెనపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వస్తున్న కంటైనర్ ట్రక్.. ఎదురుగా వస్తున్న వాహనాలను వేగంగా ఢీ కొట్టింది. ఆ వెంటనే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మ-రణించారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. అదే రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే స్పందించి.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులతోపాటు అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. అనంతరం క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అత్యధిక వేగంతో వస్తున్న కంటైనర్ ట్రక్.. నియంత్రణ కోల్పోయిందని పోలీసులు తెలిపారు. అందువల్లే ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. ఈ ప్రమాదంలో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు.. రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక





సంపాదకీయం

## రాజకీయాలకు అతీతంగా కుట్రదారులను ఎదుర్కోవాలి

భారతదేశ విచ్ఛిన్నమే ఉగ్రవాదుల లక్ష్యంగా ఉంది. దేశాన్ని మతపరంగా మరోమారు విభజించే కుట్రలు సాగుతున్నాయి. ఈ ప్రమాదం పసిగట్టి మన పాలన సాగాలి. ఒకవైపు పాక్ ఉగ్రదాడులను ఎగదోస్తుండగా, ఇప్పుడు బంగ్లాదేశ్ కూడా ఇందుకు తోడయ్యింది. అక్రమ వలసలను నిరోధించే చర్యలను అడ్డకుకుంటున్న వారు దేశద్రోహ కుట్రలను గుర్తించడం లేదు. ఓటుబ్యాంక్ రాజకీయాల కోసం ఓట్ల సమీక్షను కూడా తప్పు పడుతున్నారు. ఓట్ల రాజకీయంలో దేశం ఎలా దెబ్బతింటున్నదో వీరికి అర్థం కావడం లేదు. సరిహద్దుల నుంచి అక్రమంగా వస్తున్న చొరబాటుదారులకు ఆధార్ కార్డులు వచ్చేస్తున్నాయి. ఓటర్లుగా నమోదు అవుతున్నారు. తరవాత రేషన్ కార్డులు కూడా వచ్చేస్తున్నాయి. ఇప్పుడు ఇలా లక్షల్లో మనదేశంలో తిష్టవేశారు. వీరందరిని గుర్తించి ఏరిపారేయాలి. వీరితో దేశంలో అస్థిరత ఏర్పడుతోంది. దీనిని సరిహద్దు రాష్ట్రాల పాలకులు అసలు సమస్యగా గుర్తించడం లేదు. దీనిని అడ్డుకోవాలని చూస్తే హిందుత్వవాదులుగా ముద్రవేసి విమర్శలు చేస్తున్నారు. దేశంలో రాజకీయ పార్టీలు అధికారమే లక్ష్యంగా రాజకీయ చదరంగం ఆడుతున్నాయి. ఎర్రకోట ఘటన నిఘా వైఫల్యమని, పార్లమెంటులో చర్చించాలని చెబుతున్న వారు గతంలో జరిగిన వాటికి సమాధానం చెప్పాలి. జాతి ఐక్యంగా ఉండాల్సిన సమయంలో రాజకీయ నేతల నీచ రాజకీయాలను ప్రతి ఒక్కరూ ఎండగట్టాల్సిందే. ఇకపోతే రాజధాని ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోట సమీపంలో బాంబుపేలుడు ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోవడం, అనేక మంది క్షతగాత్రులు కావడం అత్యంత విషాదకరం. ఈ ఘటనపై ఇప్పుడు అనేక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. కేవలం భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకుని ఉగ్రమూకలు ఇక్కడ మారణకాండకు తెగిస్తున్నాయన్నది సుస్పష్టం. వైద్యులుగా ప్రాణాలు పోయాల్సిన వారు దగుల్బాజీలుగా మారారు. అలాగే మహిళా వైద్యురాలు సహితం ఇందులో భాగస్వామ్యం అయ్యిందంటే వారు ఎంతటి దుర్మార్గులో అర్థం చేసుకోవాలి. ఇకపోతే ఆహార పదార్థాల్లో విషం కలిపి చంపాలని కూడా ప్రయత్నం చేసిన తీరు బయటపడింది. ఈ క్రమంలో దర్యాప్తు సంస్థలు కూపీ లాగుతున్నాకొద్ది అనేక విషయాలు బయటకు వస్తున్నాయి. ఇస్లామిక్ టెర్రరిస్టులు మరాణ కాండకు తెగబడితే సహించాలన్న ధోరణిలో ఉన్నారు. ఈ దేశాన్ని ఇప్పటికే ముక్కలు చేశారు. భారత్ నుంచి విడివడ్డ పాక్, బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేక కార్యకలాపాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇలాంటి వారిని మంచిచేసుకోవడం అన్నది అసాధ్యం. మతం ముసుగులో మారణహోమం చేయాలనుకున్న వారిని మార్చలేం. అలాంటి వారిని ఏరిపారుయడమే విధానం కావాలి. ఇక ఢిల్లీ పేలుళ్ల కుట్రలను శోధించిన కొద్దీ అనేక విషయాలు బయటకు వస్తున్నాయి. ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి, ఆత్మాహుతి బాంబర్లుగా తయారు చేసి, రక్తపాతం సృష్టించడమే వారి మతవిధానంగా, ఆచారంగా భావిస్తున్నారు. ఫరీదాబాద్ ఉగ్రపథకంలో కుట్రదారులకు విదేశీ సంబంధాలపై అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా తాజాగా కీలక విషయం వెలుగులోకి వచ్చింది. తుర్కియేలోని 'ఉకాసా' అనే హ్యాండ్లర్‌తో ఈ మాడ్యూల్ టచ్‌లో ఉన్నట్లు నిఘా వర్గాలు కనుగొన్నాయి. ఈ మేరకు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఉకాసా అంటే అరబిక్‌లో స్పైడర్. ఫరీదాబాద్ మాడ్యుల్, ఉగ్రసంస్థ జైషే మహ్మద్‌తో పాటు అన్సర్ ఘజ్వత్- ఉల్ హింద్ అనే సంస్థల నిర్వాహకులకు ఈ ఉకాసాతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లో డాక్టర్ ఉమర్‌తో పాటు అతడి సహచరులు ఈ ఉకాసా హ్యాండ్లర్‌తో సంభాషించి నట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. డాక్టర్ ఉమర్ తో సహా పలువురు 2022లో తుర్కియేలో పర్యటించినట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో అంకారాలో వారు రెండు వారాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ హ్యాండ్లర్ కూడా అంకారాలో ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. అక్కడి నుంచే ఈ గ్రూప్‌ను నడపడంతో పాటు వారికి నిధులు కూడా సమకూర్చినట్లు భావిస్తున్నారు. మాడ్యూల్ భారత్‌లో బహుళ పేలుళ్లకు రూపొందించిన ప్రణాళిక వెనుక ఈ ఉకాసా కీలక పాత్ర పోషించినట్లు గుర్తించారు. హ్యాండ్లర్లతో చర్చించేటప్పుడు నిఘా వర్గాలకు దొరకకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ మాడ్యూల్ వెనుక ఓ విదేశీ గ్రూప్ పనిచేస్తుందని స్పష్టంగా తెలుస్తోందని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఈ నెట్‌వర్క్ కార్యకలాపాల గురించి పూర్తిగా తెలుసుకునేందుకు నిందితులు చేసిన చాట్, కాల్ హిస్టరీలను అధికారులు పరిశీలిస్తున్నారు. ఉకాసా ను గుర్తించడంతో పాటు అతడికి పాక్ ఉగ్రవాద నిర్వాహకులతో ఉన్న సంబంధాల గురించి తెలుసు కునేందుకు విదేశీ నిఘా సంస్థల సహకారం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దేశవ్యాప్తంగా నాలుగు కీలక ప్రాంతాల్లో ఒకేసారి దాడులు జరపాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఐ20, ఎకోస్పోర్ట్‌తో పాటు మరో రెండు పాత కార్లను కూడా సిద్ధం చేయాలని వారు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఇందులో ఐ20 కారులోనే ఎర్రకోట వద్ద పేలుడు జరగ్గా.. ఎకోస్పోర్ట్ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగతా రెండు కార్ల కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఇకపోతే ఈ ప్లాన్‌ను అమలుచేసేందుకు 8 మందిని సిద్ధం చేసినట్లు ఆ డైరీల సమాచారంతో అధికారులు గుర్తించారు. ఒక్కో ప్రాంతానికి ఇద్దరు చొప్పున వెళ్లి పేలుళ్లు జరపాలని వీరు పన్నాగం పన్నినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ ఎనిమిది మందిలో ఉమర్, ముజమ్మిల్‌తో పాటు డాక్టర్ అదిల్, డాక్టర్ షాహీన్ కూడా ఉన్నట్లు తెలిపాయి. ఢిల్లీ పేలుడు ఘటన పై దర్యాప్తు చేపట్టిన అధికారులు హరియాణాలోని ఫరీదాబాద్‌లో గల అల్-ఫలా యూనివర్సిటీని జల్లెడ పడుతున్నారు. ఇక్కడి మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబరు భవనం వీరి ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. దీన్నిబట్టి చూస్తే వీరు దాడులకు పక్కా ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. ఇజ్రాయిల్ తదితర ప్రాంతాల్లో కూడా ఇప్పటికే పెద్ద ఎత్తున మారణహోమం జరిగింది. ఇప్పుడు భారత్‌లో వారు ఆడిన ఆటలు సాగకపోవడం వల్లనే ఈ దాడులకు తెగిస్తున్నారు. కాశ్మీర్‌లో ప్రశాంత వాతావరణం రాకుండా చేశారు. ఇప్పుడు దేశంలో కూడా అలాగే చేయాలనుకుంటున్నారు. ఇలాంటి కుట్రదారులను ముందుగా రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాలి.


డాక్టర్ కంచర్ల అచ్యుత రావు
ఎడిటర్, మనసులో మాట దినపత్రిక




## నవభారతాన్ని నిర్మించేలా విజ్ఞానాన్ని అందిద్దాం

### నేడు బాలల దినోత్సవం

ప్రతి సంవత్సరం నవంబర్ 14న దేశమంతా ఉల్లాసంగా, ఉత్సవ వాతావరణంలో బాలల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. ఈ రోజు భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి. పిల్లలంటే అమితమైన ప్రేమ ఉన్నందున, ఆయనను ముద్దుగా 'చాచా నెహ్రూ' అని పిలుచుకునేవారు. ఈ దినోత్సవం కేవలం సెలవు దినం కాదు, జాతి భవిష్యత్తు అయిన చిన్నారుల పాత్రను, వారి హక్కులను, వారి పట్ల మనందరి బాధ్యతను గుర్తుచేసే ఒక పవిత్రమైన సందర్భం.


#### బాలల కోసం చాచా నెహ్రూ

పండిట్ నెహ్రూ ఎప్పుడూ ఒక మాట అనేవారు: "నేటి బాలలే రేపటి పౌరులు. మనం వారిని పెంచే విధానమే దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుంది." ఆయన దృష్టిలో పిల్లలు కేవలం 'చిన్నవారు' కాదు, భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు నిజమైన వారసులు. అందుకే, స్వాతంత్ర్యానంతరం దేశ నిర్మాణంపై దృష్టి సారించినప్పుడు, పిల్లల విద్య, ఆరోగ్యం, రక్షణకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. బలమైన దేశ పునాదులు పిల్లల సంక్షేమంపైనే ఆధారపడి ఉంటాయని ఆయన బలంగా విశ్వసించారు. వారిని కేవలం పాఠశాలలకు పంపడం మాత్రమే కాదు, స్వేచ్ఛాయుత వాతావరణంలో వారి సృజనాత్మకతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు.

#### నేటి బాల్యం - భవిష్యత్తు ముందున్న సవాళ్లు

చాచా నెహ్రూ బాల్యాన్ని కలలు కన్నప్పటికీ, నేటి బాల్యం అనేక సంక్లిష్టమైన సవాళ్లను ఎదుర్కొంటోంది. సాంకేతికత కొత్త అవకాశాలను తెచ్చినప్పటికీ, అది కొత్త సమస్యలనూ సృష్టిస్తోంది.

విద్య నాణ్యత, డిజిటల్ విభజన: విద్య అందరికీ అందుబాటులో ఉన్నప్పటికీ, నాణ్యమైన విద్య, ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో అందడం లేదు. కరోనా తరువాత, పట్టణ, గ్రామీణ విద్యార్థుల మధ్య డిజిటల్ విభజన స్పష్టంగా కనిపిస్తోంది.



**బాల కార్మిక వ్యవస్థ, రక్షణ లేమి:** దేశం ఎంత అభివృద్ధి చెందినా, బాల కార్మిక వ్యవస్థ ఇంకా కొనసాగుతోంది. పేదరికం కారణంగా ఎందరో చిన్నారులు చదువుకు దూరమై, ప్రమాదకర పనులలో నిమగ్నమవుతున్నారు. లైంగిక వేధింపులు, ఆన్‌లైన్ బెదిరింపుల వంటి రక్షణ సమస్యలు పిల్లల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి.

### భవిష్యత్తుకు పెట్టుబడి

**బాలల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ పరిధిలో ఏదో ఒక మార్పు తేవాలని సంకల్పం తీసుకోవాలి. పిల్లల పట్ల మన బాధ్యత కేవలం వారి అవసరాలను తీర్చడం కాదుబీ వారిని బాధ్యతాయుతమైన, ఆలోచనాత్మకమైన మరియు దేశాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించే పౌరులుగా తీర్చిదిద్దడం. పిల్లలపై చేసే ప్రతి పెట్టుబడి %-% అది విద్య, ఆరోగ్యం లేదా ప్రేమ రూపంలో కావచ్చు %-% అది దేశ భవిష్యత్తుకు చేసే పెట్టుబడి. బాలల దినోత్సవాన్ని ఒక గొప్ప ఉత్సవంగా జరుపుకుంటూనే, మనం ప్రతిజ్ఞ చేద్దాం: ప్రతి చిన్నారి బాల్యం సురక్షితంగా, సంతోషంగా మరియు జ్ఞానంతో పరిపూర్ణంగా ఉండేలా మన వంతు కృషి చేద్దాం. వారే మన ఆశ, వారే మన భవిష్యత్తు!**

**మానసిక ఆరోగ్యం:** కేవలం శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు, నేటి బాలల్లో మానసిక ఒత్తిడి, ఆందోళన పెరుగుతున్నాయి. విద్యా ఒత్తిడి, తల్లిదండ్రుల అంచనాలు, సామాజిక పోలికల కారణంగా పిల్లలు ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతున్నారు. ఈ సున్నితమైన అంశంపై కుటుంబాలు, పాఠశాలలు మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉంది.

#### మన సామాజిక బాధ్యత: పిల్లల హక్కుల పరిరక్షణ

బాలల దినోత్సవం రోజున, మనం కేవలం నెహ్రూను గుర్తు చేసుకోవడం మాత్రమే కాకుండా, బాలల హక్కుల పట్ల మన నిబద్ధతను పునరుద్ధరించుకోవాలి. ప్రతి చిన్నారికి జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు మరియు భాగస్వామ్యం అయ్యే హక్కు ఉన్నాయి.

**సమ్మిళిత విద్య:** పిల్లలందరికీ, ముఖ్యంగా దివ్యాంగులకు మరియు వెనుకబడిన వర్గాల వారికి, సమానమైన మరియు సమ్మిళిత విద్యను అందించాలి.


**నైపుణ్యాల పెంపు:** సాంప్రదాయ విద్యతో పాటు, వృత్తి నైపుణ్యాలు మరియు సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి పెట్టాలి. రేపటి ప్రపంచానికి తగ్గట్టుగా వారిని సంసిద్ధం చేయాలి.

**సురక్షిత వాతావరణం:** ప్రతి ఇల్లు, ప్రతి పాఠశాల, ప్రతి వీధి పిల్లలకు సురక్షితమైన ప్రదేశంగా మారాలి. లైంగిక నేరాల నుండి పిల్లలను రక్షించే పోక్సో చట్టం గురించి విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలి.

**మార్గనిర్దేశం:** పిల్లలకు కేవలం డబ్బు లేదా వస్తువులు ఇవ్వడం కాకుండా, వారి కలలను గౌరవించి, వారిలో ప్రశ్నించే తత్వాన్ని, నాయకత్వ లక్షణాలను పెంచాలి.

## నిశ్శబ్ద మహమ్మారిపై యుద్ధం!

### నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం




**ఇన్సులిన్‌ను కనుగొన్న సర్ ఫెడరిక్ బాంటింగ్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ మధుమేహ దినోత్సవం జరుపుకుంటారు. ప్రపంచంలో అత్యంత వేగంగా విస్తరిస్తున్న నిశ్శబ్ద మహమ్మారులలో మధుమేహం ఒకటి. ఈ దినోత్సవం కేవలం అవగాహనకే పరిమితం కాకుండా, ఈ వ్యాధిని ఎదుర్కోవడానికి, నివారించడానికి, బాధితులకు సరైన చికిత్స అందించడానికి ప్రపంచ సమాజాన్ని ఏకతాటిపైకి తీసుకురావడానికి ఒక ముఖ్యమైన వేదికగా ఉపయోగపడుతుంది.**

#### మధుమేహం.. రకాలు..

శరీరం ఉత్పత్తి చేసే ఇన్సులిన్ అనే హార్మోన్ సరిగా పనిచేయనప్పుడు లేదా అసలు ఉత్పత్తి కానప్పుడు రక్తంలో చక్కెర (గ్లూకోజ్) స్థాయిలు పెరిగిపోవడాన్ని మధుమేహం అంటారు. మనం తీసుకునే ఆహారం శక్తిగా మారాలంటే ఇన్సులిన్ కీలకం.

**టైప్ 1 మధుమేహం:** ఇది సాధారణంగా చిన్న వయస్సులోనే వస్తుంది. శరీరం యొక్క రోగనిరోధక వ్యవస్థ ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే బీటా కణాలను నాశనం చేస్తుంది. దీనికి చికిత్సగా జీవితాంతం ఇన్సులిన్ తీసుకోవడం తప్పనిసరి.

**టైప్ 2 మధుమేహం:** ఇది మధుమేహ కేసులలో 90% వరకు ఉంటుంది. ఇందులో శరీరం ఇన్సులిన్‌ను తయారు చేసినప్పటికీ, దాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోలేదు (దీనిని ఇన్సులిన్ నిరోధకత అంటారు). ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకరమైన జీవనశైలి దీనికి ప్రధాన కారణాలు.

**గర్భధారణ మధుమేహం:** గర్భధారణ సమయంలో తాత్కాలికంగా రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం. ప్రసవం తర్వాత ఇది సాధారణంగా తగ్గిపోతుంది, కానీ తల్లికి, బిడ్డకు భవిష్యత్తులో టైప్ 2 వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది.

#### ప్రపంచ మధుమేహ రాజధానిగా మారుతున్న భారత్

ప్రపంచంలోనే అత్యధిక మధుమేహ బాధితులున్న దేశాలలో భారతదేశం అగ్రస్థానంలో ఉంది. సుమారు 10 కోట్ల మందికి పైగా భారతీయులు మధుమేహంతో బాధపడుతున్నారు, మరియు ఈ సంఖ్య భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉంది. భారతదేశం 'డయాబెటిస్ రాజధాని'గా మారుతుందనే ఆందోళన నిపుణులలో వ్యక్తమవుతోంది.

**జన్యు కారకాలు:** భారతీయులలో ఇతరుల కంటే తక్కువ బాడీ మాస్ ఇండెక్స్ వద్దే ఇన్సులిన్ నిరోధకత అభివృద్ధి చెందే జన్యు ధోరణి ఉంది.

**వేగవంతమైన పట్టణీకరణ:** జీవనశైలిలో వచ్చిన మార్పులు (శారీరక శ్రమ తగ్గడం, అధిక క్యాలరీలు, ప్రాసెస్ చేసిన ఆహారం తీసుకోవడం).

**మానసిక ఒత్తిడి:** పని, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లు రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి.

### నివారణే ఉత్తమ చికిత్స

మధుమేహానికి చికిత్స చేయవచ్చు, కానీ దానిని రాకుండా నివారించడమే ఉత్తమ మార్గం.

**ఆరోగ్యకరమైన ఆహారం:** పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం. ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర పానీయాలకు దూరంగా ఉండటం.

**నియమిత వ్యాయామం:** ప్రతిరోజు కనీసం 30 నిమిషాల పాటు వేగవంతమైన నడక లేదా వ్యాయామం చేయడం.

**బరువు నియంత్రణ:** ఆరోగ్యకరమైన బరువును మెయింటైన్ చేయడం ద్వారా టైప్ 2 వచ్చే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

**క్రమమైన పరీక్షలు:** 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ సంవత్సరానికి ఒకసారి రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకోవడం ముఖ్యం.

**ప్రపంచ మధుమేహ దినోత్సవం రోజున, మనం కేవలం వ్యాధి గురించి తెలుసుకోవడం కాదు, ఆరోగ్యకరమైన రేపటి కోసం మన జీవనశైలిలో మార్పులు తీసుకురావడానికి కృషి చేద్దాం. మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందనే స్ఫూర్తితో ఈ నిశ్శబ్ద మహమ్మారిపై విజయం సాధిద్దాం**

### తెలుగు రాష్ట్రాలలో పెరుగుతున్న మధుమేహం

దేశవ్యాప్తంగానే కాకుండా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో కూడా మధుమేహం కేసులు ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. నివేదికల ప్రకారం, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ వంటి పట్టణ ప్రాంతాలలోనే కాకుండా, గ్రామీణ ప్రాంతాలలో కూడా మధుమేహం వ్యాప్తి అధికమవుతోంది.

#### అధిక వ్యాప్తికి కారణాలు


**ఆహారపు అలవాట్లు:** బియ్యం ఆధారిత ఆహారం (అధిక కార్బోహైడ్రేట్లు) ప్రధానంగా తీసుకోవడం. నూనె పదార్థాలు, స్వీట్లు, ఫాస్ట్ ఫుడ్ వినియోగం పెరగడం.

**పొత్తికడుపు కొవ్వు:** తెలుగు ప్రజలలో జన్యుపరంగా పొత్తికడుపు చుట్టూ కొవ్వు పేరుకుపోయే ధోరణి ఎక్కువగా ఉంది, ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది.

**పరీక్షల పట్ల నిర్లక్ష్యం:** చాలా మంది తమకు మధుమేహం ఉందని తెలియక ఆలస్యంగా చికిత్స ప్రారంభించడం వలన సమస్య తీవ్రమవుతుంది.

**పని తీరు:** ముఖ్యంగా ఐటీ రంగం, వ్యాపార రంగాలలో పని చేసేవారిలో నిశ్చల జీవనశైలి అధికం కావటం.

దీనిని ఎదుర్కోవడానికి, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించడం, మరియు ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించడంపై దృష్టి పెట్టాలి.



# వినోదాన్ని కోరుకునే వారికి వైజాగ్ ప్రసిద్ధ గమ్యస్థానం

## బీచ్ రోడ్ లో ఆర్ట్ థీమ్ పార్క్ ఏర్పాటు సందర్శించిన మంత్రి కందుల దుర్గేష్



**విశాఖపట్నం (మనసులో మాట) నవంబర్ 13:** నగర జీవితంలోని గందరగోళం,ఒత్తిడితో కూడిన రోజువారీ జీవితం నుండి విశ్రాంతి తీసుకోవాలనుకునే వారికి వైజాగ్‌లోని థీమ్ పార్క్ లు మంచి ఉపశమనాన్ని ఇస్తున్నాయని పర్యాటక శాఖ మంత్రి దుర్గేష్ అన్నారు. ఆర్ కే బీచ్ లో ఏర్పాటుచేసిన థీమ్ పార్క్ ను సందర్శించిన ఆయన మాట్లాడారు. అమ్యూజ్ మెంట్ పార్క్ మాయా ప్రపంచమన్న మంత్రి దుర్గేష్ చిన్నా, పెద్ద అనే తేడా కుటుంబం మరియు స్నేహితులతో కలిసి ఆనందంగా ఉత్కంఠభరితమైన రోజును గడిపే ప్రదేశమని వెల్లడించారు.

డిసెంబర్ 31 నుంచి విశాఖ లో జరగనున్న

## సిఐటియు అఖిలభారత మహాసభలను

# జయప్రదం చేయండి

### అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో గోడపత్రిక ఆవిష్కరణ




**అనకాపల్లి, నవంబర్ 13 (మనసులో మాట):** సెంటర్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ (సిఐటియు) అఖిలభారత 18 వ మహాసభలు విశాఖపట్నంలో డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు జరుగుతున్న సందర్భంగా అనకాపల్లి సిఐటియు కార్యాలయంలో గురువారం గోడపత్రిక ఆవిష్కరించడం జరిగింది. సిఐటియు ఏర్పడిన 55 ఏళ్ల చరిత్రలో మొట్టమొదటిసారి విశాఖపట్నంలో మహాసభలు జరుగుతున్నాయి. ఈ మహాసభ జయప్రదానికై కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.వి శ్రీనివాసరావు, ఆర్ శంకర్రావు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ మహాసభల్లో పలు తీర్మానాలు చేయడంతో పాటు భవిష్యత్తు పోరాటాలకు రూప కల్పన జరుగుతుందని అన్నారు. అనకాపల్లి జిల్లాలో ఉండే ఫార్మా, బ్రాండిక్స్ తదితర పారిశ్రామిక కార్మికుల ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, పని గంటల పెంపు వంటి అంశాలపై ఎప్పటికే పలు పోరాటాలు నిర్వహిస్తున్నామన్నారు. అసంఘటితర కార్మికులు, స్కీం వర్కర్స్ సమస్యలపై సిఐటియు నిరంతరంగా పోరాడుతుందని అన్నారు. ఈ మహాసభలు జయప్రదానికై అందరూ తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి గనిశెట్టి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శులు ఆర్ రాము, జి వరలక్ష్మి, ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, రైతు సంఘం జిల్లా కోశాధికారి జి నాయినబాబు లు పాల్గొన్నారు.



బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై

## కఠిన చర్యలు తప్పవు

### నాతవరం ఎస్సై

**నాతవరం నవంబర్ 13(మనసులో మాట)..** నాతవరం పోలీస్ స్టేషన్ ఎస్సై టీ తార్కేశ్వరరావు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాతవరం ఎస్సై వై. తార్కేశ్వరరావు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎవరు ఉల్లంఘించిన వారిపై కేసు నమోదు చేస్తామని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదని వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించి నడపరాదని ఎస్సై వై.తార్కేశ్వరరావు చెప్పారు. ప్రతి ప్రదేశంలోని మూడో కన్ను నిఘ ఉంటుందని తెలియజేశారు.

## వైభవంగా దార్లపూడి మరిడిమాంబ జాతర



**ఎస్. రాయవరం, నవంబర్ 13,(మనసులో మాట):** ఎస్. రాయవరం మండలం దార్లపూడి గ్రామప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకు నేందుకు తెల్లవారుజాము నుండి భక్తులు క్యూలో వేచిఉన్నారు. జిల్లాలోని పలూప్రాంతాలు నుండి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ప్రతి ఏటా నాగుల చవితితరువాత వచ్చే మూడవ గురువారం రోజున అమ్మవారి జాతరను నిర్వహిస్తారు. 15 రోజులుపాటు అమ్మవారి పండుగ ప్రకటన, గటాలు ఊరేగింపు నిర్వహిస్తారు. మండలంలోని పలువురు నేతలు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. జాతరలో భాగంగా గ్రామం అంతా విద్యుత్ దీపాలు తో అలకరించారు. జాతరలో ఆలయంవద్ద వెలిగించే బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగానిలుస్తుంది.

వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కు

# దరఖాస్తుల ఆహ్వానం

### 2026- 2027 సంవత్సరాలకు అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ

### సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్

**గూడెం/సీలేరు నవంబర్ 13:(మనసు లో మాట)..** రాష్ట్ర, జిల్లా స్థాయిలలో పనిచేస్తున్న పాత్రికేయులకు రెండు సంవత్సరాల (2026, 2027) కాలపరిమితికి సమాచార, పౌర సంబంధాల శాఖ జారీ చేసే నూతన అక్రిడిటేషన్ లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 రెండు సంవత్సరాలకు జారీ చేసే అక్రిడిటేషన్స్ కు నిబంధనల మేరకు అర్హత కలిగిన పాత్రికేయుల దరఖాస్తులు ఆన్ లైన్ ద్వారా స్వీకరిస్తారన్నారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ ఏడాది నవంబర్ 30 నాటికి ముగుస్తున్నందున నూతన అక్రిడిటేషన్స్ జారీ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు. దరఖాస్తుల నమోదుకు ముందుగా మీడియా సంస్థల వివరాలు పోర్టల్ లో పొందుపరచవలసి ఉన్నందున సంబంధిత పత్రాల డాక్యుమెంట్లను పెన్ డ్రైవ్ లో పొందుపరిచి మరియు జిరాక్స్ కాపీలను సమాచార, పౌర సంబంధాల శాఖ, పండిట్ నెహ్రూ బస్టాండ్, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, రెండవ అంతస్థులోని విజయవాడ కార్యాలయంలో అందజేయాలన్నారు. అనంతరం పాత్రికేయులు నవంబర్ 14 వ తేదీ నుండి ఆన్ లైన్ వెబ్ సైట్ https://mediarelations.ap.gov.in లో సూచించిన విధంగా సంబంధిత పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ ఆ ప్రకటనలో తెలియజేశారు.

## చింతాలమ్మ ఘాట్‌లో విరిగిపడిన కొండచరియలు



కొయ్యూరు, నవంబర్ 13 (మనసులో మాట): అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం లోని చింతాలమ్మ ఘాట్‌లో గురువారం కొండచరియలు విరిగిపడ్డాయి. రోడ్డుకు అడ్డంగా భారీగా కొండచరియలు విరిగిపడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. 516-ఈ హైవే నిర్మాణంలో భాగంగా ఘాట్‌లో రోడ్డు వెడల్పు చేశారు. అయితే ఇంజనీరింగ్ అధికారుల వైఫల్యమో ఏమో తెలీదు కానీ అప్పటి నుంచి ఘాట్‌లో ఎప్పటికప్పుడు కొండచరియలు విరిగిపడడం పరిపాటిగా మారింది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.

## సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు కన్నుమూత



**గొలుగొండ, నవంబర్ 13,(మనసులో మాట):** భారత్ కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) అనకాపల్లి జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి కమ్యూనిస్టు వర్గాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. విద్యార్థి దశ నుంచే పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న రాముానాయుడు, ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా నాటక మండలి అధ్యక్షుడిగా, గొలుగొండ మండల కార్యదర్శిగా, జిల్లా సహాయ కార్యదర్శిగా సేవలందించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అనేక ఉద్యమాల్లో అగ్రగామిగా పాల్గొన్నారు. ఇటీవల జరిగిన సిపిఐ రెండవ జిల్లా మహాసభలో జిల్లా కార్యదర్శిగా ఎన్నికై, పార్టీ బలోపేతానికి కృషి చేశారు. అపస్మారక స్థితిలో నర్సీపట్నం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు ఇటీవలే మరణించడం కుటుంబాన్ని మరింత శోకసంద్రంలో ముంచేసింది. పురుగుల మందు సేవించడం వల్లనే రామునాయుడుమృతి చెందారని ప్రచారం జరుగుతుంది. జిల్లా నలుమూలల నుండి వచ్చిన సిపిఐ నాయకులు చోద్యం గ్రామం వచ్చి నివాళులు అర్పించి ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

జలజీవన్ మిషన్ పనులు లో

# బయట పడిన నాణ్యత లోపం

### మంత్రి ఫిర్యాదుతో అధికారులు తర్జన భర్జన





**ఎస్. రాయవరం, నవంర్13 (మనసులో మాట):** ఎస్. రాయవరం మండలం పెట్టుగోళ్ళపల్లి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకం క్రింద నిర్మాణం చేపట్టిన రక్షిత మంచినీటిట్యాంకు నిర్మాణ పనులలో నాణ్యత లోపం రాష్ట్రహెూంశాఖ మంత్రి వంగలపూడిఅనిత సమక్షంలో బయటపడటంతో ఆమె చర్యలు తీసుకోవాలంటూ జిల్లాకలెక్టర్ తోపాటు సంబంధిత మంత్రికి ఫిర్యాదుచేసారు. దీనితో అర్ డబ్ల్యూ ఎస్ అధికారులుతోపాటు జలజీవన్ మిషన్ ప్రోజెక్టు అధికారులు తర్జనభర్జనలు ప్రారంభించారు. ఈ మేరకు అధికారులు గురువారం పెట్టుగోళ్ళపల్లి సచివాలయంలో సమావేశమై నాణ్యత లోపం పనులుపై సమీక్షించారు. జలజీవన్ మిషన్ క్రింద పెట్టుగోళ్ళపల్లి గ్రామంలోనిర్మించిన ముచినీటిపథకం ప్రారంభోత్సవం కోసం బధవారం హెూంశాఖ మంత్రి వంగలపూడిఅనిత వెళ్ళారు. ప్రారంభించివలసిన ట్యాంక్ నుండి నీరులీకేజ్ కావటంతోపాటు మెట్లు క్రింద పెచ్చులు ఊడిపడటంతో మంత్రి ప్రారంభోత్సవం జరపకుండా వెనుతిరిగారు. నాణ్యత లోపంపై కంట్రాక్టర్, అధికారులు ను ప్రశ్నించినా సరైన సమాధానం లేకపోవటంతో చర్యలు తీసుకోవాలి అంటూ కలెక్టర్ ను కోరారు. దీనితో అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులుతో సమావేశమై నాణ్యత లోపంపై ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ తో చర్చించారు. ఈ పనులులో నాణ్యత లోపం కంట్రాక్టర్ నిర్లక్ష్యమా లేక అధికారుల పర్యవేక్షణ లోపం తేలవలిసి ఉంది. ఇదిలా ఉండగా గ్రామాల్లో జరుగుతున్న జలజీవన్ మిషన్ పనులలో నాణ్యత లేని పైపులు వినియోగిస్తున్నారంటూ పలుగ్రామాల ప్రజలు బహిరంగంగా విమర్శించటంతో పాటు మండలపరిషత్ సర్వసభ్య సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ పనులులో నాణ్యత లోపంపై సమగ్ర దర్యాప్తు జరిపించా లంటూ పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## పని దినాల కల్పనలో వెనుకబడిన కోటవురట్ల



**కోటవురట్ల (మనసులో మాట) నవంబర్ 13:** ఉపాధి హామీ పథకానికి సంబంధించి గృహాల నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు పని దినాలు కల్పించడంలో కోటవురట్ల మండలం జిల్లాలో వెనుకబడి ఉన్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకం సిబ్బంది, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లుతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏడాదిలో 90 వేల పని దినాలు కల్పించాల్సి ఉండగా, 70 వేల పని దినాలు మాత్రమే కల్పించారని అన్నారు. అలాగే నీటి గుంటలు నిర్మాణంలో కూడా మండలం వెనుకబడి ఉందన్నారు. సచివాలయ సిబ్బంది, డిజిటల్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. పని దినాల కల్పనలో వెనుకబడిన నేపాధ్యంలో ప్రతిసారి జిల్లా స్థాయిలో జరిగే సమీక్షలో తాను అధికారుల ముందు నిలబడాల్సి వస్తుందన్నారు. ఈ పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ఏవీ ఓ నాగరాజు మాట్లాడుతూ ముఖ ఆధారిత హాజరకు సంబంధించి ఈ కేవైసీ 90% పూర్తయిందన్నారు. ఈకేవైసీ చేయించుకున్న వారికే ఉపాధి పనులు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, ఇంజనీరింగ్ అధికారులు వర్మ, వరప్రసాద్ పాల్గొన్నారు.

# విజయోత్సవ ర్యాలీ




**చింతపల్లి.నవంబర్ 13. (మనసులో మాట)** ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలోని ఇంటర్ కాలేజీ ఎట్ లెవెల్ లో జరిగిన వాలీబాల్ టోర్నమెంట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతపల్లి మెన్ టీం ద్వితీయ స్థానం పొందినది సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం విజయ భారతి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ నుండి కళాశాల వరకు వాలీబా ల్ విద్యార్థులు మరియు విద్యార్థినీ విద్యార్థులతో విజయోత్సవ ర్యాలీని నిర్వహి ఈ సంద ర్భంగా కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీ కె శివరాం కుమార్ ప్రత్యేక అభినందనలు తెలిపారు ఈ విజయం. ముందు తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు ఒక స్ఫూర్తిదాయకంగా. ఉండాలని ప్రిన్సిపాల్ వివరించారు కళాశాల చరిత్ర లో 11 సంవత్సరాల తర్వాత విజయం సాధించడంలో క్రీడా కారుల కృషిని అధ్యాపకులు అభినందించారు.

వాగ్దేవి సమారాధనమ్ ఆధ్వర్యంలో

## 19న సరస్వతీ సామ్రాజ్యం

**విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 13:** వాగ్దేవిసమారాధనమ్ విజయనగరం ఆధ్వర్యంలో ఈనెల 19న ఉదయం 11 గంటలకు జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లాగ్రంధాలయసంస్థ వేదికగా సరస్వతీ సామ్రాజ్యం సభాకార్యక్రమం నిర్వహిస్తున్నట్లువాగ్దేవి సమారాధనమ్ సంస్థవ్యవస్థాపక అధ్యక్షులు మరియు కార్యవర్గసభ్యులు డా. పెన్నేటి స్వప్నహైందవి తెలిపారు. ఈమేరకు గురువారం కరదీపిక ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలోసభ్యులు మక్కాఅప్పలనాయుడు,ఆర్మీపల్లివెంకటనాయుడు,ఎం.వి. రమణమూర్తి, ఎం.శ్రీనివాసులు, డాక్టర్ చౌదరి తేజేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందరరేగా అధ్యక్షులు స్వప్న హైందవి మాట్లాడుతూ ఆరోజు కార్యక్రమాలలో ఆరునుండి పధవతరగతివరకు చదువుతున్న విద్యార్థులు వేమనపద్యాలు, శతకపద్యాలు, శ్లోకాలు మరియు కథనాలతో పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థులు ఈఅవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భవన నిర్మాణ కార్మిక ప్రాంతీయ సదస్సును

# జయప్రదం చేయాలి

### ఏఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ



**పెందుర్తి (మనసులోమాట) నవంబరు 13..** ఉత్తరాంధ్ర జిల్లాల భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 18న విశాఖ నగరంలోని సీతంపేట బీవీకే కాలేజ్ పక్కన గల పౌర గ్రంథాలయంలో జరుగు సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ ప్రజలు, కార్మికులకు పిలుపునిచ్చారు. జీవిఎంసీ 97వ వార్డు, పెందుర్తి మండలం, చిన్న ముసిడివాడ కార్మికుల సెంటర్లో గురువారం ఈ మేరకు ప్రచార సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పడాల రమణ హాజరై మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు చట్టం 1996 ను పటిష్టంగా అమలు చేస్తూ వెల్ఫేర్ బోర్డు ద్వారా పథకాలు అమలు చేస్తామని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం హామీని గాలికి వదిలి సమీక్షలు సభలు పేరుతో కాలం గడుపుతూ సమస్యలను మరింత జటిలం చేస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసిందని కార్మికుల కడుపులు కొట్టిందని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికుల కన్నీరు తుడుస్తామని, గత ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలన్నీ అమలు చేయడంతో పాటు మరిన్ని పథకాలతో కార్మికుల సంక్షేమ ధ్యేయంగా పాలన సాగిస్తామని యువగళం పాదయాత్రలో హామీఇచ్చిన మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు కనీసం ఇచ్చిన మాటకు కట్టుబడిన దాఖలాలు కనబడటం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డుకు తన సొంత నిధులు కోటి.రూపాయలు ఆర్థిక సహాయం చేస్తానని ఇచ్చిన హామీ మరిచిపోయారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం గడిచిపోయిందని అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, జిల్లా కలెక్టర్లకు అనేక దపాలుగా నిరసన తెలియజేసి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ సంక్షే బోర్డు పునరుద్ధనకై ఈ ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకో లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం 1996 చట్టాన్ని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను కార్మికులకే అందే విధంగా చర్యలు చేపట్టాలని, ఇతర రాష్ట్రాల మాదిరిగా సంక్షేమ పథకాలు అమలు చేయాలని పెండింగ్లో ఉన్న 46వేల క్లెయిమ్స్ రిలీజ్ చేయాలని డిమాండ్ చేసారు. లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని భవన నిర్మాణ కార్మికులను సమీకరించి డిసెంబర్ నెలలో చలో మంగళగిరి నిర్వహించి, ఉపముఖ్యమంత్రి కార్యాలయం ముట్టడి నిర్వహిస్తామని అందుకు భవన నిర్మాణంగా కార్మికులు అందరూ సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వై. బంగారు నాయుడు,అప్పలనాయుడు. పాపారావు జగదీష్. రామారావు. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శత చండీ యాగ మహోత్సవానికి రాట ముహూర్తం

### - రేజేటి శ్రీరామచార్యులు



**అనకాపల్లి, రూరల్, నవంబర్ 13 ( మనసులో మాట)** శ్రీ శివ పంచాయతన సహిత శత చండీయాగ మహోత్స వానికి రాట ముహూర్తాన్ని నిర్ణయించారు అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామచార్యులు. గాంధీనగర్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు రేజేటి చక్రవర్తి ఆలోచనల రూపంగా విశ్వశాంతి ఆకాంక్షిస్తూ జరిపే శత చండీ యాగ మహోత్సవం కు రాట ముహూర్తాన్ని పెట్టించాలన్న సత్సంకల్పంతో చక్రవర్తి తన శిష్య బృందంతో కలసి కశింకోట మారుతీ పీఠం వ్యవస్థాపకులు తన తండ్రి రేజేటి శ్రీరామచార్యులను కలసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ముహూర్తాన్ని నిర్ణయించమని కోరారు. ఈ సందర్భంగా రామాచార్యులు మాట్లాడుతూ రానున్న కాలం ప్రకృతి వైపరీత్యాలు, ప్రస్తుత కాలమాన ప్రకారం పరిస్థితులు అసలు బాగోలేవన్నారు. ఇది కేవలం రాష్ట్రానికి దేశానికి సంబంధించింది కాదని ప్రపంచమే ఇబ్బంది పడే పరిస్థితులు గోచరిస్తున్నాయన్నారు. ఈ మాట తాను చెప్పటం లేదని జ్యోతిష్య గ్రంథాలు తెలుపుతున్నాయన్నారు. జరగబోయే మంచినైనా చెడునైనా మనము ఏమీ చేయలేమని కానీ ఎండకు సేద తీరడానికి గొడుగు వేసుకున్నట్లే కొంత ప్రజా సంక్షేమానికి ఉపశాంతి కలగడానికి మన వంతు ప్రయత్నం గా చక్రవర్తి ఈ యాగాన్ని తలచడం దానికి మీరంతా కలిసి ముందుకు రావడం ఆనందించ వలసిన విషయం అన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు సుముహూర్తం తెలిపారు. విశ్వశాంతిని కోరి చేసే ఈ శత చండీయాగ మహోత్సవం దిగ్విజయంగా ఆ శ్రీ వేంకటేశ్వరుని కరుణ కటాక్ష వీక్షణాలతో పూర్తి అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర దేవస్థానం భక్త బృందం పాల్గొన్నారు.

### డిసెంబర్ 12 న కలెక్టర్ కార్యాలయ ఎదుట

## అంగన్వాడీ ల ధర్నా విజయవంతం చేయాలి

### అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్ఫ్ ర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ పిలుపు



**అనకాపల్లి, నవంబర్ 13 (మనసు లో మాట):** అంగన్వాడిల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్ఫెర్స్ యూనియన్ (సి ఐటియు) అధ్వర్యంలో డిసెంబర్ 12 న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యాక్రమం ను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం. దుర్గారాణి పిలుపు నిచ్చారు. అనకాపల్లి సిఐటియు కార్యాలయం లో గురువారం అంగన్వాడీ ల సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యలు తక్షణమే పరిష్కరం చేయాలన్నారు. కాగా నవంబర్ 14 న సచివాలయాలు, డిసెంబర్ 12 న కలెక్టర్ కార్యాలయాలు ఎదుట నిర్వహించే ధర్మాలు జయప్రదం చేయాలని అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు మాట్లాడుతూ ప్రీస్కూల్ నిర్వహణకు అడ్డంకిగా అనేక పనులను అప్పగిస్తున్నారన్నారు. ఆన్లైన్ పనులతో పని భారం విపరీతంగా పెరిగిందని, అంగన్వాడీ సెంటర్లో పిల్లలకు పాఠాలు చెప్పడానికి సమయం ఉండడం లేదని, ఆన్లైన్ పనులతో ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రీ స్కూల్ కి వస్తున్న పిల్లలకు తల్లికి వందనం ఇవ్వాలని, ప్రైవేటు స్కూల్లో ఆరు సంవత్సరాల్లో పిల్లల్ని జాయిన్ చేయకుండా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వాలని, అంగన్వాడీ సెంటర్లను ప్రభుత్వ స్కూల్లో బ్రిడ్జి చేసే పని ఆపాలని, పిల్లలకి ఇస్తున్న మెనూ పెంచాలని, అంగన్వాడీల నిర్వహణకు కొత్త మొబైల్ ఫోన్లు ఇవ్వాలన్నారు. అంతేకాకుండా కనీస వేతనం 26,000 అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 14న సచివాలయాల వద్ద, డిసెంబర్ 12 న కలెక్టర్ కార్యాలయాలు వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి వి.వి రమణమ్మ, మహాలక్ష్మి, వరలక్ష్మి సత్యవేణి, భవాని,జయలక్ష్మి పాల్గొన్నారు.

## కోణంలో మెగా నేత్ర వైద్య శిబిరం




**చీడికాడ, నవంబర్ 13, (మనసులో మాట)** హెల్ప్ ఫుల్ హ్యాండ్స్ సామాజిక వారధి స్వచ్ఛంద సేవా సంస్థ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో మండలంలో కోనాం గ్రామంలో మెగా ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో కోనాం గ్రామ ప్రజలు తో పాటు కోనాం పరిసర గ్రామాలు నుండి 70 మంది కంటి పరీక్షలుకు హాజరు అయ్యారు 25 మంది కంటి ఆపరేషన్ కోసం ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమంలో కోనారు సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ , బోగిండమ్మ మత్స్యకార సంఘం మాజీ ప్రెసిడెంట్ తాతయ్యలు, సచివాలయం సిబ్బంది హెల్ప్ ఫుల్ హ్యాండ్స్ సామాజిక వారధి అధ్యక్షులు ఎ.రమణ, ,శంకర్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ సతీష్ సిబ్బంది పాల్గొన్నారు..

## చీడికాడ పీ హెచ్ సి కేంద్రాన్ని సందర్శించిన జిల్లా లెప్రసీ అధికారి



**చీడికాడ, నవంబర్ 13, (మనసులో మాట)** జిల్లా వ్యాధి నిరోధిక టీకాల అధికారి డా చంద్ర శేఖర్ దేవ్ (డి ఐ ఓ) జిల్లా లేప్రోసి అధికారి డా. స్వప్న (డి ఎల్ వో) చీడికాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న సాన్సు ప్రోగ్రామ్ గురించి తగు సూచనలు అందించి క్షేత్ర స్థాయి లో 5 సంవత్సరాల లోపు పిల్లలలో పెనుయుమనియా వ్యాధి లక్షణాలు ప్రారంభం లోనే గుర్తించి తగు చికిత్స అందించాలని తెలియజేశారు. డిఎల్ఓ స్వప్న మాట్లాడుతూ టీవీ శాంపిల్స్ యొక్క పరీక్ష సంఖ్య పెరగాలని అదేవిధంగా 17 నుండి 30వ తేదీ వరకు జరుగు ఐసిడిసి ప్రోగ్రామ్ విజయవంతం చేయాలని సిబ్బందికి కోరారు. ఎలెక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ పెంచాలని హాస్పిటల్ కి వచ్చే ప్రతీ వ్యక్తి ఆధార్ కార్డ్ ఆధార్ లింక్డ్ మొబైల్ నెంబర్ తపనిసరిగా తీసుకొని వచ్చి హాస్పిటల్ సిబ్బందికి సహకరించాలని. ఎలెక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ ద్వారా భవిష్యత్ లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఉపయోగ పడుతుందని తెలియజేశారు.. జిల్లా లేప్రోసి అధికారి డా. స్వప్న చీడికాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రస్తుతం 12 నుంచి జరుగుతున్న సాన్సు ప్రోగ్రామ్ గురించి తగు సూచనలు అందించి క్షేత్ర స్థాయి లో 5 సంవత్సరాల లోపు పిల్లలలో పెను ఉమానియా వ్యాధి లక్షణాలు ప్రారంభం లోనే గుర్తించి తగు చికిత్స అందించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో చీడికాడ పిహచ్ సి వైద్యాధికారులు డాక్టర్ సునీల్ కుమార్ డాక్టర్ మురలీకృష్ణ సిహెచ్ఓ ప్రతాప్ పాల్గొన్నారు.

## విమానాశ్రయం లో జిల్లా యువతకి ఉపాధి కల్పించండి

### - లోక్ సత్తా



**విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 13:** విజయనగరం జిల్లా భోగాపురం లో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మాణం జరుగుతున్న అంతర్జాతీయ విమానాశ్రయం లో వివిధ రంగాల డిపార్ట్మెంట్ ల్లో విజయనగరం జిల్లా యువతకి ఉపాధి అవకాశాలు కల్పించాలని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డిని కోరారు. కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందచేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో యువతీ యువకులుకు కనీసం ఉపాధి అవకాశాలు లేవని, ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయని,కొత్తపరిశ్రమలు రాలేదని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 20 వేల మంది కి ఉపాధి అవకాశాలు ఉంటాయని జిల్లాలోని మంత్రి, అధికారులు, ఎమ్మెల్యేలు ద ృష్టి సారిస్తే డ్రైవర్లు, గార్డెనింగ్, పెయింటర్, మెకానిక్, వెల్డర్, హౌస్ కీపింగ్, తదితర శాఖల్లో ఉపాధి ఇప్పటినుండే శిక్షణ ఇచ్చి యువతని తయారుచేసి విమానాశ్రయం ప్రారంభం నాటికి సిద్ధం చెయ్యాలని భీశెట్టి కోరారు,రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజక వర్గంలో ఒక నైపుణ్యాలను అందించే శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చెయ్యాలని ఇంత భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించే సంస్థ జిల్లా కి మరొకటి రాదని మన నాయకులు అశ్రద్ధ వహిస్తే జిల్లాలోని యువత నష్టపోతుందని అటువంటి పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు.



### నేడు మాదిగ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చెయిర్ పర్సన్

## పర్యటన

### -ఎస్ సి కార్పొరేషన్ ఇ డి వెంకటేశ్వర రావు

విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 13:: ఆంధ్రప్రదేశ్ మాదిగ వెల్ఫేర్ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ లిమిటెడ్ (తాడేపల్లి) చైర్ పర్సన్ మరియు మాజీ శాసన సభ్యురాలు డా.ఉండవల్లి శ్రీదేవి ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా విజయనగరం జిల్లాలో శుక్రవారం పర్యటించనున్నారని జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు డి.వెంకటేశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11.00 గంటలకు జిల్లా ఎస్సీ కార్పోరేషన్, డా.మర్రిచెన్నారెడ్డి భవనం, కంటోన్మెంట్, విజయనగరం నందు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారన్నారు. అనంతరం ప్రజల నుండి అర్జిలు స్వీకరిస్తారని తెలిపారు. చైర్ పర్సన్ పర్యటనలో అభిమానులు, అందరు ఆహ్వానితులేనని, పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమంలు విజయవంతం చేయాలని కోరారు.

### ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో

## ఇద్దరు మృతి..

### మరో ఇద్దరి పరిస్థితి విషమం పలువురికి గాయాలు..



**విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 13:** ఎచ్చెర్ల నియోజకవర్గం, లావేరు మండలం, గుర్రాలపాలెం గ్రామానికి చెందిన పలువురు భక్తులు జలుమూరు మండలం శ్రీ ముఖలింగం ఆలయ దర్శనం కోసం వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదంలో చిక్కుకొని ఇద్దరు మ ృతి చెందారు. క్షతగాత్రులను ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ కు తరలించారు. విషయం తెలిసిన వెంటనే పార్లమెంట్ విజయనగరం సభ్యులు కలిశెట్టి హుటాహుటిన రిమ్స్కు, జెమ్స్కు చేరుకొని పరిస్థితి సమీక్షించి, క్షత గాత్రులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించవలసిందిగా కోరారు.అలాగే తక్షణమే మెరుగైన వైద్యం కోసం, తక్షణ సహాయక చర్యల కోసం జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పి ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

### నేటి నుండి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

**అచ్యుతాపురం నవంబర్ 13, మనసులో మాట.** ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కోటీశ్వరావు తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా పిల్లలకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నారని నిత్య పుస్తక పటన చేయడం వలన పిల్లలకు, విద్యార్థులకు జ్ఞానం సంపాదించవచ్చని దాని వలన పోటీ పరీక్షలలో సత్తా చాటాలన్నారు ముగింపు రోజున అక్షరాస్యత దినోత్సవం లో పాల్గొని గెలిచిన వారందరికీ ముఖ్య అతిథులతో బహుమతులు అందజేయడం జరుగుతుందని కోటేశ్వరరావు తెలిపారు.

## చదురుగుడికి చెందిన హుండీల లెక్కింపు

**విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 13:** ఉత్తరాంధ్రప్రజల ఆరాధ్యదైవం శ్రీపైడితల్లిఅమ్మవారి దేవస్థానం చదురుగుడికి చెందిన హుండీల లెక్కింపు బుధవారం పైడితల్లిదేవస్థానం కళ్యాణామండపంలో నిర్వహించారు. 29 రోజులకు హుండీద్వారా 20,97,852 రూ.బంగారం 15 గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 260గ్రాములు వచ్చినట్లు దేవస్థానం ప్రకటించింది. దేవస్థానం ఇఓ కె.శిరీషపర్యవేక్షణలో నిర్వహించిన ఈకార్యక్రమంలో సూపరింటెండ్.వై.వి.రమణి, ఆలయ వేదపండితులు, అర్చకులు,సిబ్బంది,స్వచ్ఛందసేవకులు పాల్గొన్నారు.

## చోడవరం స్కిల్ హబ్ లో కొత్త కోర్సులు

**చోడవరం , నవంబర్ 13(మనసులో మాట ):** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ లో నూతన కోర్సులు ప్రారంభించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.కిరణ్ కుమార్ తెలిపారు. ప్రధాన మంత్రి కౌసల్య వికాస్ యోజన (పిఎం.కె.వి.వై) ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏ.పి.ఎస్.ఎస్.డి.సి.) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్ లో రెండు కొత్త కోర్సులు ప్రారంభిస్తున్నట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు . వెబ్ డెవలప్మెంట్ , సెక్యూరిటీ అనలిస్ట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ పూర్తి చేసిన యువతీ ,యువకులు అర్హుల అనిస్పష్టం చేసారు. ఒక్కొక్క కోర్సు లో 30 సీట్లు మాత్రమే ఉన్నాయని ఆసక్తి గల యువత తమ ధరఖాస్తులను కళాశాల స్కిల్ హబ్ లో అంద చేయాలని కోరారు. మరిన్ని వివరాలకు 9494791935, 9908799126 నంబర్ ల్లో సంప్రదించాలని సూచించారు . అదేవిధంగా 2025-26 విద్యా సంవత్సరం లో డిగ్రీ స్పాట్ అడ్మిషన్ లకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ కోరారు .బిఏ ఎకనమిక్స్ ఆనర్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ ఆనర్స్ , బీఎస్సీ జువాలజీ, కెమిస్ట్రీ ఆనర్స్ గ్రూప్ లలో స్పాట్ అడ్మిషన్ల ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు . అడ్మిషన్లకు సీనియర్ ఉపన్యాసకులు నారాయణ మూర్తి 824747025, మల్లిబాబు 9966545448 నంబర్ ల్లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచి.

### రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మెన్ మళ్ళ సురేంద్ర, జివిఎంసి జోనల్ కమిషనర్ చక్రవర్తి

### అనకాపల్లి రైల్వే స్టేషన్ సమీపం లోని

## అన్న క్యాంటిన్ నిర్వహణ ఆకస్మిక పరిశీలన



**అనకాపల్లి, నవంబర్ 13 (మనసులో మాట):** అనకాపల్లి రైల్వే స్టేషన్ సమీపం లోని అన్న క్యాంటీన్ ను గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, జివిఎంసి జోనల్ కమిషనర్ చక్రవర్తి ఆకస్మికంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. ముందు గా వారు అక్కడ ఉన్న వారి తో కలిసి టిఫిన్ చేసి,ఇక్కడ అన్న క్యాంటీన్ లో ఇబ్బందులు ఏమైనా ఉంటున్నయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మళ్ళ సురేంద్ర మాట్లాడుతూ గత వైఎస్ఆర్సీపి ప్రభుత్వం అన్న క్యాంటీన్ లు మూసివేసి పేదలకు భోజన ఇబ్బందులు కల్గజేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు కోసం ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ లో అందరూ సంతోషంగా మూడు పూట్ల టిఫిన్,భోజనం చేస్తున్నారని తెలిపారు. అనంతరం అక్కడ ఉన్న వారు అందరూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు,కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ స్టాఫ్ మాడుగుల అప్పారావు,పొట్నూరు దుర్గారావు, బీశెట్టి శిరీష, నారాయణ, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## కార్తీక వన భోజనానికి తరలిన పార్టీ నాయకులు



**విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 13:** జయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు కార్తీక మాసం, అలాగే ఎచ్చెర్ల నియోజక వర్గం క్లస్టర్, యూనిట్, గ్రామ,బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాన్ని పురస్కరించు కొని ఈరోజు ఎచ్చెర్ల నియోజకవర్గం, రణస్థలం హెడ్ క్వార్టర్ లో ఏర్పాటు చేసిన ఎన్డీఏ కూటమి ఆత్మ కలయిక, కార్తీక మాస వనసమారాధన కార్యక్రమంలో టీడీపీ, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమాను లు, ప్రజలు పాల్గొని దిగ్విజయం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు, చీపురుపల్లి శాసన సభ్యులు కిమిడి కళా వెంకట్రావు, స్థానిక ఎచ్చెర్ల నియోజకవర్గం శాసనసభ్యులు నడికుదుటి ఈశ్వరరావు , ఏపీ స్టేట్ మార్కోఫ్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు , ఏపీ స్టేట్ తూర్పు కాపు చైర్మన్ పాలవలస యశస్విని , టిడిపి పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు మాధవ నాయుడు , విజయనగరం బిజెపి పార్టీ అధ్యక్షులు రాజేష్ వర్మ , ఎచ్చర్ల నియోజకవర్గం జనసేన ఇన్చార్జ్ విశ్వక్సేన్, చీపురుపల్లి జనసేన ఇంచార్జ్ విసినిగిరి శ్రీనివాస్ , బొబ్బిలి నియోజకవర్గం జనసేన ఇన్చార్జ్ గిరాడ అప్పలస్వామి , విజయనగరం పార్లమెంటరీ సీనియర్ నాయకులు త్రిమూర్తుల రాజు, ఎచ్చెర్ల నియోజకవర్గం నాలుగు మండలాల టిడిపి, బిజెపి, జనసేన పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, అలాగే ఎచ్చెర్ల నియోజకవర్గం నాలుగు మండలాల ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి అనకాపల్లి శాఖాగ్రంధాలయం లో

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



**అనకాపల్లి, నవంబర్ 13 (మనసులో మాట):** అనకాపల్లి శాఖవీధి లోని శాఖాగ్రంధాలయం లో ఈనెల 14 నుంచి 20 వరకు జరిగే 58 వ జాతీయ గ్రంధాలయ వారోత్సావాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సిద్దార్ధ సోషల్ సర్వీస్ & కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు, భారత రాష్ట్రపతి అవార్డు గ్రహీత బల్లా నాగభూషణం విడుదల చేసారు. ఈ సందర్భంగా బల్లానాగభూషణం మాట్లా డుతూ వారము రోజులపాటు ఎంతో ఘనముగా నిర్వహించే ఈ గ్రంధాలయ వారోత్సావాలకు పట్టణ ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని విజ్ఞప్తి చేశారు. శాఖాగ్రంధాలయా ధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ 58 వ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 వ తేదీ ఉదయం 10 గంటలకు నెహ్రూ జన్మదినం సందర్భంగా ప్రారంభమవుతాయని , ఈ ప్రారంభములో స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, సిద్దార్ధ సోషల్ సర్వీస్ & కల్చరల్ అసోసియేషన్, ప్రతినిధులు, విశ్రాంత అధ్యాపకులు, సాహితీవేత్త లతో కలసి ప్రారంభించడము జరుగు తుందని, 15 వ తేదీ ఉదయం గ్రంథాలయ పుస్తక ప్రదర్శన, 16 వ తేదీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 17 వ తేదీ సాహితీ మిత్రుల కవి సమ్మేళనం, 18 వ తేదీ స్థానిక అరసం సాహితీ సంస్థ ఆధ్వర్య ములో విద్యార్థులకు డిబేట్ పోటీలు, 19 వ తేదీ స్థానిక విభిన్న ప్రతిభావంతుల సంస్థ ఆధ్వర్యములో దివ్యాంగులకు దేశభక్తి గీతాల పోటీలు, 20 వ తేదీ ఉదయం 10 గంటలకు ముగింపు వేడుకలు, పోటీలలో విజేతలకు, పాల్గొన్న కవులకు బహుమతీ ప్రదానం ముఖ్య అతిధి జిల్లా ఖజానా శాఖాధికారి వి.లక్ష్మీ సుభాషిణి ప్రసంగం , వారి చేతుల మీదుగా బహుమతుల ప్రదాన ము జరుగుతుందని గ్రంధాలయ అధికారి కె.శ్రీనివాసరావు తెలియ జేశారు. ఈ కార్యక్రమములో సిద్దార్ధ సోషల్ సర్వీస్ & కల్చరల్ అసోసియేషన్, అధ్యక్షులు బల్లానాగభూషణము, గ్రంధాలయ అధికారి కె. శ్రీనివాసరావు,విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, నారాయణ కాలేజీ విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఘనంగా కమిటీ సభ్యుల ప్రమాణోత్సవం



**విజయనగరం (మనసులో మాట) నవంబర్ 13:** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు విజయనగరం ని యో జ క వర్గా ని కి సంబంధించి నూతనంగా నియమించిన తెలుగుదేశం పార్టీ మండల/పట్టణ, గ్రామ / వార్డు కమిటీలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్ ల ప్రమాణస్వీకార కార్యక్రమం గురువారం విజయనగరం పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ కిమిడి నాగార్జున , స్థానిక శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు హాజరైయ్యారు. కార్యక్రమంలో ముందుగా తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది, తదుపరి సమావేశం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించి, నివాళులు అర్పించి, మా తెలుగుతల్లికి గీతాలాపన చేశారు. అనంతరం వివిధ స్థాయిలలో నూతనంగా పార్టీ ప్రతినిధులుగా ఎన్నికైన వారు ప్రమాణస్వీకారం చేయడం జరిగింది మరియు సమావేశమునకు వచ్చిన పార్టీ శ్రేణులు అందరికి హ్యాండ్ బుక్స్ మరియు పెన్నులను అందజేశారు. అదేవిధంగా కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేయడం జరిగింది.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ సాగర దుర్గా అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం




**విజయనగరం: (మనసులో మాట):నవంబర్ 13:** భీమిలి నియోజకవర్గం , పద్మనాభం మండలంలోని మద్ది గ్రామంలో గురువారం నిర్వహించే శ్రీశ్రీ శ్రీ సాగర దుర్గా అమ్మవారి ప్రథమ వార్షికోత్సవం ఆహ్వానం మేరకు ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వై.యస్.ఆర్.సి.పిజిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరమ్మ ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీ శ్రీ శ్రీ సాగర దుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ కమిటీ పెద్దలు సిరమ్మకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీశ్రీ శ్రీ సాగర దుర్గా అమ్మవారి పీఠం నకు వచ్చిన శ్రీ పరమాత్మ నంద గిరి స్వామి, శ్రీ శ్రావణ చైతన్య నందస్వామీజీల అశ్వీర్వాదంపొందారు. ఆమె మాట్లాడు తూ కార్తీక మాసంలో శ్రీ శ్రీ శ్రీ సాగర దుర్గా అమ్మవారు వార్షికోత్సవం చేయడం చాలా సంతోషకరంగా ఉందని అన్నారు. సాగర దుర్గా అమ్మవారు కరుణా కటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆమె ప్రార్థించారు. సాగర దుర్గా అమ్మ వారు మహిమ గల తల్లి అని కొనియాడారు. తదనంతరం అక్కడ నిర్వహించిన అన్నప్రసాదం కార్యక్రమం లో పాల్గొని భక్తులకు స్వయంగా ప్రసాదం వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం ఎం.పీ.పి. కంటుభుక్త రాంబాబు, మద్ది సర్పంచ్ బుగత సత్యనారాయణ, ఆనందపురం మండల పార్టీ ప్రతినిధి మరియు వై యస్సార్ సీపీ సీనియర్ నాయకులు మజ్జి వెంకట రావు, స్థానిక ముఖ్య నాయకులు, చిన్న శ్రీను సోల్జర్స్ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కడతేరిన 'కన్న' పాశం

## -కన్నతల్లి,బిడ్డ మృత్యువాత

## -బిడ్డ మృతి, తల్లి ఆత్మాహుతి అనుమానాస్పదం





**చోడవరం, నవంబర్ 13( మనసులో మాట) :** గదిలో విగతజీవిగా ఆరు నెలల పసిబిడ్డ , ప్రక్కనే చీరకొంగు తో ఉరివేసుకుని ఆత్మ హత్యకు పాల్పడిన వివాహిత దుర్ఘటన చోడవరం పట్టణంలో కలకలం రేపింది . పట్టణ సీఐ అప్పలరాజు కథనం ప్రకారం బుధవారం సాయంత్రం వెలుగు చూసిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి . పార్వతీపురం జిల్లా కొమరాడ మండలం గుమడ గ్రామానికి చెందిన పోరెడ్డి వీణ (30) అదే జిల్లా వి.ఎం.వలస మండలం కౌడుతండ గ్రామానికి చెందిన ఉమామహేశ్వర రావు లు గత ఏడాది జనవరిలో పెద్దల అంగీకారంతో ప్రేమ వివాహం జరిగింది .వీరికి ఆరు నెలల వయసున్న వియాన్స్ సంతానం. అనకాపల్లి జిల్లా బుచ్చియ్యపేట మండలం కె.పి. అగ్రహారం మండల పరిషత్ పాఠశాలలో ఉమామహేశ్వరరావు ఉపాధ్యాయుడిగా ఉద్యోగ భాధ్యత నిర్వహిస్తున్నాడు. వీరి కుటుంబం స్థానిక ద్వారకానగర్ దరి కనకమహాలక్ష్మినగర్ లో అద్దింట్లో కాపురం ఉంటున్నారు. బుధవారం ఉదయం యధావిధిగా భర్త ఉద్యోగార్థం కె.పి.అగ్రహారం వెళ్లి అటు తర్వాత భార్య కు కాల్ చేస్తున్నప్పటికీ బదులు పలకలేదు. కాగా మధ్యాహ్నం 4 గంటల సమయంలో పాఠశాల నుంచి తిరిగి ఇంటి వచ్చి చూడగా గది తలుపులు లోపలినుంచి వేసి ఉన్నాయి. దీంతో ఇరుగు పొరుగు వారిని పిలిచి వారి సహాయం తో తలుపులు తెరచి చూడగా చీరతో వురిపోసుకొని వీణ, కింద విగతజీవిగా పసిబిడ్డ పడి ఉన్నారు. ఆ స్థితినిబట్టి బాబును తలగడతో అదిమిపెట్టు ఊపిరాడకుండా చేసి అటు తర్వాత తల్లి వీణ ఉరి వేసుకుని ఆత్మహత్య కు పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. లేదా పసిబిడ్డ మరణంతో ఆత్మహత్యకు పాల్పడింది, లేదా ఈ మరణాల వెనుక భర్త ప్రమేయం ఏమైనా ఉందా అన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు . ఈ మేరకు మృతదేహాలను పంచనామా జరిపి, పోస్ట్ మార్టమ్ కు తరలించారు . మృతురాలి భర్త ఉపాధ్యాయుడు ఉమామహేశ్వరరావును అదుపులోకి తీసుకుని హత్య కోణంలో విచారణ చేస్తున్నారు . మృతురాలి తల్లి దండ్రుల వాంగ్మూలం మేరకు కేసు కొలిక్కి రానున్నదో.



## జాతీయ స్థాయి బాక్సర్లను అభినందించిన స్పీకర్ అయ్యన్న

**నర్సీపట్నం ,నవంబర్ 13 (మనసులో మాట)..** ఆంధ్ర యూనివర్సిటీ స్థాయిలో జరిగిన ఇంటర్ కాలేజీ బాక్సింగ్ సెలక్షన్స్లో బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నర్సీపట్నంకు చెందిన ఇద్దరు మహిళా బాక్సర్లను స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభినందించారు. నర్సీపట్నంలోని స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం వీర్ను స్పీకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు. నర్సీపట్నం నింజాస్ అకాడమీకి చెందిన ఈ క్రీడాకారిణులైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకున్న బొంతు మౌనిక కళ్యాణం (75 కేజీల విభాగం), ఏబిఎం డిగ్రీ కళాశాలకు చెందిన యేడిద లక్ష్మీ తేజస్విని (81 కేజీల విభాగం) ఇటీవలే అద్భుత ప్రతిభ కనబరిచారు. వచ్చే నెలలో పంజాబ్లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన సందర్భంగా స్పీకర్ వారిని అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించి, మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ డైరెక్టర్ సభ్యులు సుతాపల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

### అనకాపల్లి జిల్లా లో వరుస చోరీల కేసుల పరిష్కారంలో

# కీలక విజయాన్ని సాధించిన జిల్లా పోలీసులు

### ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్



**అనకాపల్లి, (మనసులో మాట)నవంబర్ 13:** ఇటీవల కాలంలో చోడవరం, బుచ్చియ్యపేట, వి.మాడుగుల, చీడికాడ, దేవరాపల్లి మండలాల్లో వరుసగా, రాత్రి వేళల్లో దేవాలయాల్లో హుండీ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు యువకులను చోడవరం పోలీస్ వారు పట్టుకొని వారి వద్ద నుండి మొత్తం 26 కేసుల్లో దొంగతనాలకు గురైన 10.32 గ్రాములు బంగారం, 26 తులాల వెండి, మరియు నగదు రూ.44,218/- మొత్తం సుమారు రూ.66,418/- విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగినది. పై కేసుల్లో ఒకరు మేజర్ కాగా, మరో ముగ్గురు మైనర్ బాలురు ఉన్నారు. నిందితులు జల్సాలకు అలవాటు పడి, దేవాలయాలను టార్గెట్ చేస్తూ, రాత్రి వేళల్లో హుండీ దొంగతనాలకు పాల్పడేవారు. నేరస్థలంలో దొరికిన ఆనవాళ్ళు ఆధారాలతో పాటు ఆధునిక సాంకేతిక పద్ధతులు వినియోగించి నిందితులను గుర్తించి పట్టుకోవడంలో అనకాపల్లి జిల్లా పోలీసులు విజయవంతమయ్యారు. ఈ కేసులో 1.రాసూరి పోతురాజు, ), దొరబాబు కోలనీ, వడ్డాది గ్రామం, బుచ్చయ్యపేట మండలం, అనకాపల్లి జిల్లా. నిందితులు జల్సాలకు అలవాటు, చెడు వ్యసనాలకు బానిసై, ఈ హుండీ చోరీలకు పాల్పడి, దొంగలించిన వాటిలో కొంత వారి అవసరాలు ఖర్చు చేసుకొని మిగతా డబ్బు, బంగారం, వెండిని విజయరామరాజుపేట ఏరియాలో దాచి ఉంచి, ఈ దినం పై ముగ్గురు బైకే పై వడ్డాది నుండి చోడవరం వైపు వస్తుండగా చోడవరం పోలీస్ వారు చోడవరం గ్రామ శివారులో గౌరిపట్నం వద్ద నిందితులను పట్టుకోవడం జరిగినది. వీరిలో మొదటి ముగ్గురు అన్ని నేరాలకు పాల్పడగా, 4వ వ్యక్తి ఒక్క నేరానికి మాత్రమే పాల్పడినాడు. పోలీస్ స్టేషన్లలో నమోదు అయిన కేసులు:లి చోడవరం -02,లి బుచ్చియ్యపేట-11,లి వి.మాడుగుల-09,లి చీడికాడ-02,లి దేవరాపల్లి-02,లి మొత్తం-26కేసులు ఈ కేసులను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ దిశానిర్దేశనలో, అదనపు ఎస్పీ క్రైమ్స్ ఎల్.మోహనరావు పర్యవేక్షణలో, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి ఆద్వర్యంలో చోడవరం ఇన్స్పెక్టర్ పి.అప్పలరాజు, ఎస్సై బి.నాగకార్తీక్, ఎస్సై బి.జోగారావు, పోలీస్ సిబ్బంది తో కలసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఛేదించడంతో, అధికారులను ప్రశంసా పత్రాలతో అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... "ఇలాంటి సంఘటనపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానస్పద వ్యక్తులను ప్రశ్నించడం, తమ ఇంట్లో విలువైన డబ్బు, బంగారం బ్యాంకు లాకర్లో భద్రపరుచుకోవాలన్నారు. తమ ఇళ్లకు తాళాలు వేయడమే కాకుండా, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, బయటి ప్రాంతాలకు వెళ్ళేవారు స్థానిక పోలీసులతో కలిసి ఎల్.హెచ్.ఎం.ఎస (లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టం) సేవలు వినియోగించుకోవాలన్నారు. అలాగే అన్ని దేవాలయాల్లో తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, భద్రత లేదని దేవాలయాల్లో విలువైన వస్తువులు, నగదు ఉంచరాదని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, నేరాలపై కఠిన చర్యలు ఉంటాయని ఉంటాయని తెలియజేసారు. ఈ మీడియా సమావేశంలో అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహనరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, చోడవరం ఇన్స్పెక్టర్ పి.అప్పలరాజు, ఎస్సై బి.నాగకార్తీక్, ఎస్సై బి.జోగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రేక్షకులు మా ఊరు వెంకన్న సినిమాను

# విజయవంతం చేయాలి

### ఉపసర్పంచ్, జనసేన నేత బొడ్డెడ అప్పలనాయుడు



**మునగపాక (మనసులో మాట) నవంబర్ 13,** మునగపాక గ్రామానికి చెందిన డాక్టర్ కోరుకొండ గోపీ కృష్ణ దర్శకత్వం లో, వి. కోటేశ్వరశర్మ నిర్మాణ సారధ్యం లో, యజ్ఞశ్రీ బ్యానర్ పై, ఈ నెల 14 వ తేదీన శుక్రవారం, రిలీజ్ కాబోతున్న మా ఊరు వెంకన్న మూవీ, వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు తో, అనకాపల్లి శ్రీ వేంకటేశ్వర దియేటర్ లో విడుదల అవుతుంది, అనకాపల్లి పరిసర గ్రామాల ప్రజలు అనకాపల్లి దియేటర్ లో చూసి ఆదరిస్తారనీ మునగపాక పంచాయతీ ఉపసర్పంచ్, జనసేన నేత బొడ్డెర అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఈ సినిమాకు 50 టికెట్లు వరకు బొడ్డెడ అప్పలనాయుడు స్పాన్సర్ చేశారు. ఈ సినిమా విడుదల ద్వారా మునగపాక గ్రామానికి దర్శకుడు కోరుకొండ గోపి కృష్ణ, నిర్మాత వెలవలపల్లి కోటేశ్వర శర్మకు మంచి పేరు పఖ్యాతలురావాలని అప్పల నాయుడు ఆకాంక్షించారు.

## ఈ రహదారుల్లో ప్రయాణం జరభద్రం బ్రదర్



**మునగపాక, నవంబర్ 13, మనసులో మాట** మండలంలోని పలు గ్రామాలు రహదారులు పూర్తిగా మలుపులతో నిర్మాణం చేపట్టడం వల్ల తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొండకర్ల జంక్షన్ నుండి ఉప్పవరం, మల్లవరం, జగన్నాధపురం, చూచుకొండ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి 28 మలుపులతో నిర్మాణం జరిగింది. ఈ రహదారుల ద్వారా ప్రయాణం చేసేటప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించకపోతే ప్రమాదపు తంచునపడినట్లే, అలాగే మునగపాక నుండి మూలపేట అనకాపల్లికి వెళ్లే రహదారి మలుపులతో నిండి ఉంటుంది. ఈ రహదారిలో ప్రయాణం చేసిన ప్రయాణికులు, వాహనదారులు ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే ప్రయత్నంలో పలు ప్రమాదాలు జరిగాయి. అలాగే తిమ్మరాజుపేట నుండి పెదపాడు, కాశీ పాలెం, పురుషోత్తపురం, పల్లపు ఆనందపురం, కుమారపురం, సూచుకొండ గ్రామాలకు వెళ్లే రహదారి అనేక మలుపులతో నిర్మాణం జరిగింది. రోడ్డుకు ఇరువైపులా చెట్లు వేపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించడంలో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ మార్గాల్లో ప్రయాణం చేసే వాహనదారులు ఆదమరచివెళ్లకుండా ప్రయాణంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



**దుంబ్రిగుడ, నవంబర్ 13 మనసులో మాట:** మండలంలోని గసబ పంచాయతీ. నువ్వగూడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి సునీత కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఇప్పటికి కంగారు సొల, గసబ గ్రామంలో సీసీ రోడ్డు పనులు పూర్తి అయ్యిందని చెప్పారు. అన్ని గ్రామంలో త్రాగు నీరు, విధ్యుత్ దీపాలు కల్పిస్తున్నామనీ చెప్పారు. గ్రామ పంచాయతీ నిధులు మరియు స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రావీటీ ద్వారా మరియు బోర్ వెల్ ద్వారా త్రాగు నీరు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాంగి. సురేష్ కుమార్, పంచాయతీ వార్డ్ సభ్యులు పాంగి సత్యనారాయణ, పాంగి హరి, వైసీపీ నాయకులు వంతాల బలరాం, సిపిఎం నాయకులు పద్దు. బాస్కర్, సోమేల. సత్యనారాయణ, వంతాల. శివ , పంచాయతీ సెక్రటరీ జ్యోత్స్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్, సచివాలయ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆహారం కల్తీ వల్ల ఆ స్వస్థత

### జర్రెల ఆశ్రమ బాలురు పాఠశాలల్లో - వార్డెన్ నిర్లక్ష్యం 57 మంది కి శాపం





**గూడెం/సీలేరు నవంబర్ 13బీ(మనసు లో మాట)..** అల్లూరి సీతారామరాజు గూడెం మండలం జెర్రీల ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో వికటించిన పెరుగుతిని 57 మంది విద్యార్థులు ఆశ్వస్థకు గురయ్యారు 57 మంది విద్యార్థులు ఆశ్వస్థకు గురి కావడానికి గల కారణం వికటించిన పెరుగు పెట్టడం తోనే విద్యార్థులకు వాంతులు విరోచనాలు తలనొప్పి జ్వరం గుండె దడ లక్షణాలతో బాధపడుతూ ఉదయం 7 గంటలకు హాస్పిటల్ కి చేరారు విషయం తెలుసుకున్న పంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షులు మరియు జీకే విధి మండల పిసా కార్యవర్గ సభ్యులు జెర్రెల ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్న పిల్లలను పరామర్శించారు మరియు ఆశ్రమ పాఠశాలను కూడా పరామర్శించి అక్కడ జరిగిన విషయాలన్నీ క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు స్కూల్ యాజమాన్యం అందించిన వివరాలు ఇలా ఉన్నాయి రోజువారి మెనూ పద్ధతిలోనే పాలను వడబోసి పెరుగు సేసి పెట్టె క్రమంలోనే వికటించిందని అన్నారు. రోజువారి పద్ధతిలో పాలను పెరుగు తోడి పెట్టినప్పటికీ ఎలా వికటించిందో తమకు అర్థం కావటం లేదని స్కూల్ వార్డెన్ తెలియజేశారు ఇదిలా ఉండగా ఇలాంటి సంఘటనలు అనేకం జరుగుతా ఉన్నాయి అందుకనే ప్రతి ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో రాత్రిపూట పిల్లలకు అవస్థత వచ్చినప్పుడు హెల్త్ అసిస్టెంట్, ఎ ఎన్ ఎం లను ప్రభుత్వం నియమించాలని కోరారు. కారణం ఏదేమైనా జరిగిన చిన్నపాటి తప్పి దానికి 57 మంది విద్యార్థుల ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయట పడినందుకు సంతోషం అన్నారు. ఇంకా అశ్వస్థతకు గురవుతున్న విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం తక్షణమే ఏరియా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని జెర్రీల ఆసుపత్రిలో డాక్టర్ సందీప్ ని ఏ టి డబ్ల్యు ని సకాలంలో సరైన వైద్యం అందించి విద్యార్థులు ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడే విధంగా కృషి చేయాలని కోరారు విద్యార్థుల తల్లితండ్రులు ఎటువంటి ఆందోళన చెందవద్దని విద్యార్థులకు ఏమీ కాదని మనోధైర్యాన్ని నింపారు.

# సమాజ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర కీలకం


### పిఎస్ టిఎ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శ్రీకాంత్



**విజయనగరం (మనసులో మాట)నవంబర్ 13:**సమాజ అభివృద్ధిలో పాత్రికేయుల పాత్ర అత్యంత కీలకమని ప్లానింగ్ సెక్రెటరీస్ టెక్నికల్ అసోసియేషన్ (పిఎస్ టిఎ) జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శ్రీకాంత్ అన్నారు. ఇటీవల ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పిఎస్ ఎస్ వి శివ ప్రసాద్, విజయనగరం జర్నలిస్టుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు లింగాల నరసింగరావు, ప్రధాన కార్యదర్శి వేదుల సత్యనారాయణలను గురువారం సాయంత్రం అభినందించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ వార్తల సేకరణలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ అనేక సామాజిక సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షులు ఉరిటి చైతన్యసాయి, గురజాడ అశోక్ కుమార్, కోశాధికారి వెత్సా మణికంఠ, జాయింట్ సెక్రటరీ లు త్రిపురాన సందీప్ చంద్ర, ఎం. మోహన్, అసోసియేషన్ సభ్యుడు లెంక త్రినాథరావు, గ్రంధి రవికుమార్, పి. రాజేష్, హేమంత్, దాశరథి తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం

### డాక్టర్ సునీల్ జీవిత దశలలో మధుమేహం గురించి సూచనలు సలహాలు



**అనకాపల్లి, నవంబర్ 13 (మనసు లో మాట):** మధుమేహం ఎందుకు ప్రతి వయస్సువారినీ ప్రభావితం చేస్తోందో డాక్టర్ సునీల్ వివరించారు. నేటి జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వ్యాయామం లేకపోవడం, ఒత్తిడి, ఇవి అన్నీ చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకూ మధుమేహం వచ్చే అవకాశాలను పెంచుతున్నాయి. అందుకే డబ్ల్యూహెచ్ఓ ఈ సంవత్సరం థీమ్ ను "జీవిత దశల్లో మధుమేహం"గా నిర్ణయించింది. పిల్లల్లో మధుమేహం ఎలా గుర్తించాలంటే తరచూ దాహం వేయడం, ఎక్కువగా మూత్రం పోవడం, బరువు తగ్గడం, అలసట, పాఠశాలలో ఏకాగ్రత తగ్గడం, ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్ష చేయించాలి. ఇక యవ్వనంలో ప్రమాదం ఎందుకు పెరుగుతోంది. జంక్ ఫుడ్, పానీయాలు (సాఫ్ట్ డ్రింక్స్, మిల్క్ షేక్స్), మొబైల్ తో ఎక్కువ సమయం,నిద్రలేమి, వ్యాయామం తగ్గడం వంటివి. ఈ వయస్సులో శరీరం త్వరగా స్పందిస్తుంది,కాబట్టి చిన్న మార్పులు పెద్ద ఫలితాలు ఇస్తాయి.అలాగే యువకులు, యువతులు ఎందుకు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. ఒత్తిడి, సడెన్ టైమింగ్స్ కూర్చొని చేసే ఉద్యోగాలు, రాత్రిళ్లు జాగారం, రెగ్యులర్ మీల్స్ లేకపోవడం ఇవి ఇన్సులిన్ పై ప్రభావం చూపి షుగర్ పెరిగేలా చేస్తాయి. గర్భకాల మధుమేహం ఏమిటి? ఎందుకు జాగ్రత్త అవసరం? గర్భధారణలో మొదటిసారిగా కనిపించే షుగర్ను జిడిఎం అంటారు. మాత అండ్ శిశువు ఇద్దరికీ ప్రమాదాలు ఉంటాయి. అధిక బరువు కలిగిన శిశువు, డెలివరీ సమస్యలు, తల్లికి ఆగమనంలో టైప్-2 దయాబెటిస్ వచ్చే అవకాశం. అందుకే గర్భిణీ స్త్రీలు షుగర్ స్క్రీనింగ్ తప్పనిసరిగా చేయించాలి. ఉద్యోగాల్లో ఉన్న పెద్దలకు ముఖ్యమైన సూచనలు.

ప్రతి 45-60 నిమిషాలకు 2-3 నిమిషాలు నడవాలి, ఆఫీసులో టీ-కాఫీ తో వచ్చే చక్కెరను తగ్గించాలి, భోజన టైం ఫిక్స్ చేసుకోవాలి, స్ట్రెస్ మేనేజ్మెంట్ అనుసరించాలి, ఏడాదికి ఒక్కసారి షుగర్, బిపి, లిపిడ్ ప్రొఫైల్ చెక్ చేయాలి. పెద్దవారిలో (60 ఏళ్ళు పై బడినవాళ్ళు ) మధుమేహం ఎలా వేరుగా ఉంటుంది. హృద్రోగం, కిడ్నీ, కళ్ళ సమస్యలు త్వరగా వస్తాయి. బిపి అండ్ షుగర్ ఒక్కసారిగా పడిపోవడం/పెరగడం జరగొచ్చు, పాద సంరక్షణ చాలా ముఖ్యం. ఏదేమైనా కుటుంబ సభ్యుల సహకారం పెద్దల ఆరోగ్యానికి అత్యంత కీలకం.

**మధుమేహం నిజంగా నివారించగలమా**

టైప్-2 మధుమేహం చాలా వరకు లైఫ్ స్టైల్తోనే నియంత్రించవచ్చు. రోజు కు 30 నిమిషాలు నడవడం, బరువు తగ్గించడం,

సాఫ్ట్ డ్రింక్స్, మిఠాయిలు, రాత్రి భోజనం తగ్గించడం, సరైన నిద్ర ఇవి చాలామందిలో షుగర్ పెరగకుండా అడ్డుకుంటాయి.

**మందులు తీసుకుంటే డైట్ అవసరమా**

మందులు షుగర్ తగ్గిస్తాయి, కానీ డైట్ ం వ్యాయామం, శరీరం మొత్తాన్ని రక్షిస్తాయి, గుండె, కిడ్నీ, కళ్ళు, నర్వులు. రోగులు తప్పనిసరి గా పాటించాల్సిన ఐదు పనులు

నడక - రోజు 30-45 నిమిషాలు,

ఆహారం తక్కువ కార్బులు, ఎక్కువ పచ్చిమిర్చి, ప్రోటీన్, నిద్ర - కనీసం 7 గంటలు, ఫాలో-అప్ హెచ్ బిఎ1సి ప్రతి 3-6 నెలలకు, పాద సంరక్షణ - చిన్న గాయాన్ని కూడా నిర్లక్ష్యం చేయరాదని డాక్టర్ సునీల్ తెలియజేశారు.

## డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ కొరకు దరఖాస్తు చేసుకోండి

### జిల్లా రవాణాశాఖ అధికారి జి మనోహర్



**అనకాపల్లి, నవంబర్ 13 (మనసు లో మాట)...** ప్రధానమంత్రి కౌసల్ వికాస్ యోజన కార్యక్రమంలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ఈనెల 20 వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రవాణాధికారి జి మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా నైపుణ్యంతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేయడమే దీని ఉద్దేశ్యమన్నారు. ఇందులో భాగంగా 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున మంజూరు చేసేందుకు నిర్ణయించుట జరిగినదని డీటీఓ పేర్కొన్నారు. ఈ నెల 20 లోపుల ఆసక్తి గల అభ్యర్థులు డీపిఆర్ నకలను, ఇతర అటాచ్మెంట్లను స్థానిక జిల్లా రవాణాధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఇందుకు కావాల్సిన అర్హతలు: ఆసక్తి గల సంస్థ ఎన్జీఓ, ట్రస్ట్, కోపరేటివ్ సొసైటీ, తయారీదారుడు ఫార్మ్ అయి ఉండాలన్నారు. ఎన్జీఓ అయితే తప్పనిసరిగా దర్పం పోర్టల్ లో రిజిస్టర్ అయి ఉండాలి. ఈ సంస్థ గత మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్స్, టర్న్ ఓవర్ సర్టిఫికెట్స్ అందించాలి. ఇటువంటి సంస్థకు సొంతంగా లేదా కనీసం పది సంవత్సరాల లీజు కలిగిన రెండు ఎకరాల స్థలం, సిమ్యూలేటర్, ట్రైనింగ్ వాహనాలు, వర్క్ షాప్, క్లాస్ రూమ్స్, ఇంటర్నెట్ తదితర సదుపాయాలు ఉండాలి. ధరఖాస్తు లను జిల్లా కలెక్టర్ ఆమోదం కొరకు పంపబడునని తెలిపారు. మరిన్ని వివరాలకొరకు డీ.టీ.ఓ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### తెలుగుదేశం పార్టీ కూటమి

# స్థానిక సంస్థల్లో విజయం సాధించాలి

### మాడుగుల శాసనసభ్యులు: బండారు సత్యనారాయణమూర్తి..



**కె. కోటపాడు, నవంబర్ 13 (మనసులో మాట):** మాడుగుల నియోజకవర్గం లో స్థానిక సంస్థల్లో విజయం సాధించేందుకు కృషి చేయాలని మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలో గురువారం మేడిచర్ల గ్రామంలో మాడుగుల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మండల కమిటీ మరియు అనుబంధ గ్రామ కమిటీలు సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం శాసనసభ్యులు బండారు, నియోజకవర్గ పరిశీలకలు వాసిరెడ్డి ఏసుదాసు చేతులు మీదుగా ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కోటపాడు , చీడికాడ,మాడుగుల,మండల పార్టీ అధ్యక్షుడు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్ ఆధ్వర్యంలో జరిగిన సభలో శాసనసభ్యులు బండారు మాట్లాడుతూ ముందుగా గ్రామ మండల పార్టీ ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బండారు మాట్లాడుతూ తెలుగుదేశం కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు సమన్వయంతో 2026 జనవరి, ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల రావచ్చని దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్క కార్యకర్త నాయకులు శ్రద్ధ చూపాలని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో వాలంటీర్లని కార్యకర్తలుగా ఉపయోగించి దుర్మార్గపు ఎన్నికలు చేశారని, అలాంటి టైంలో కూడా తెలుగుదేశం పార్టీ బలపర్చిన ఎక్కువమంది 50 లోపు ఓట్లతో సర్పంచులు ఎంపీటీసీలు పెద్ద సంఖ్యలో ఓడారని అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలలోకి తీసుకువెళ్లే వాళ్లకు వివరించాలని అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గెలిపే లక్ష్యంగా ఏ ఒక్క గ్రామంలో చేయి జారకుండా విజయం సాధించే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఈ విజయాన్ని బహుమతిగా అందించాలని అన్నారు.తెలుగుదేశం పార్టీలో ఎలాంటి బేదాభిప్రాయాలు లేకుండా మాజీ శాసనసభ్యులు రామనాయుడు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ మేము ముగ్గురిని కూర్చోని సమానం చేస్తామని హామీ ఇచ్చారు. నేను తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. గ్రామ మండల కమిటీల్లో మహిళలకు పెద్దపీట వేసామని అన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు రాగద్వేషాలకు పోకుండా సమన్వయంతో గ్రామాల్లో ముందుకే వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మూడు మండలాలకు చెందిన కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



## మాజీ ఎంపీ భరత్

## చీకటి వ్యాపారాలకు

# నేనే ప్రత్యక్ష సాక్షిని

- చందా సత్రం మాజీ చైర్మన్ రామశర్మ
- భరత్ వల్ల అన్ని విధాలా నష్టపోయాను
- ఆర్థికంగా చితికిపోయా.. మానసికంగా నలిగిపోయా
- పార్టీ కార్యక్రమాలకు, వైసీపీ నేతలు వచ్చినప్పుడు ఖర్చంతా నాదే
- హరితా యువతా కార్యక్రమాలకు దీపు ఖర్చుపెట్టాడు..
- పేపర్ మిల్లు 'పరంపర' వ్యవహారంలో ప్రవీణ్ చౌదరి ఇచ్చిన కోటిన్నర నా చేతులతోనే భరత్ కు ఇచ్చా..
- ఇసుక ర్యాంపుల నుంచి నెల నెలా ముడుపులు తీసుకున్నది నిజం కాదా..
- గ్రావెల్ కు 5 ఎకరాలకు నేనే కోటీ పాతిక లక్షలు ఇచ్చా..
- ప్రవీణ్, దీపు, అబ్దుల్లా.. ఇలా ఎంతో మందిని, క్యాడర్ ను పార్టీలోకి తీసుకొచ్చా..
- అవసరం తీరాక పట్టించుకోలేదు..
- భరత్ అనుచరుడు పీతా రామకృష్ణ.. అతని అనుచరుల వల్ల ప్రాణహాని ఉంది..
- రక్షణ కల్పించండి..నాకేదైనా అయితే భరత్, రామకృష్ణ, అతని అనుచరులే బాధ్యులు
- మీడియా సమావేశంలో కన్నీరు పెట్టుకున్న భరత్ చిన్ననాటి స్నేహితుడు, చందా సత్రం మాజీ చైర్మన్ పీ రామశర్మ



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఇప్పుడు నీతిమంతుడిలా కబుర్లు చెబుతున్నాడు కానీ..అతను ఎక్కడెక్కడ ఎవరివద్ద ఎంతెంత ముడుపులు తీసుకున్నాడో నాకు తెలుసని చందా సత్రం మాజీ చైర్మన్, భరత్ చిన్ననాటి స్నేహితుడు పీ రామశర్మ సంచలన ఆరోపణలు చేశారు. భరత్ కు ఎంతో సహాయం చేసినా..కనీస మాత్రంగా కూడా కృతజ్ఞత చూపకపోవటం పట్ల తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. భరత్ చీకటి వ్యాపారాలకు నేనే సాక్షినని చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో.. భరత్ అనుచరుడు పితా రామకృష్ణ, అతని అనుచరుల వల్ల తనకూ, వృద్ధులైన తల్లితండ్రులకు ప్రాణహాని ఉందని రామశర్మ కన్నీరు పెట్టుకున్నారు. గురువారం రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పలు సందర్భాలలో తీవ్ర ఉద్వేగానికి, ఆవేదనకు గురయ్యారు. భరత్ చీకటి వ్యాపారాలలో ప్రధాన భాగస్వామిగా తానే ఉండి..ఎవరెన్ని లక్షలు ఇచ్చినా స్వయంగా భరత్ కు పట్టుకెళ్ళి ఇచ్చానని రామశర్మ తెలిపారు. భరత్ అనుచరుడు పితాని రామకృష్ణ కు తాను రూ.4 లక్షలు అప్పు ఉన్నానని, దాని నెపంతో నేరుగా తన మిత్రులతో ఇంటికొచ్చి తన తల్లిదండ్రులను చులకన చేసి హేళనగా మాట్లాడటం, మద్యం సేవించటం ఇలా రకరకాలుగా మానసిక వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పితా రామకృష్ణ తను లేనప్పుడు వచ్చి ఎలా వ్యవహరించేవాడో కొన్ని చిత్రాలను మీడియాకు చూపించారు. ఇతని చర్యలు, మాటలకు మానసికంగా వేదనకు గురైన తమ తల్లిదండ్రులు ఆత్మహత్య చేసుకునేందుకు కూడా సిద్ధమయ్యారని కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసు స్టేషన్లో ఫిర్యాదు కూడా చేశానని, ఇంత జరుగుతున్నా భరత్ నోరు మెదపకపోవడం తీవ్ర మనస్తాపం చెందానన్నారు. తన చిన్ననాటి స్నేహితుడు కదా అని..భరత్ కు అన్ని రకాలుగా సహకరించానన్నారు. ఇన్నమూరి దీపు, మైనారిటీ నాయకుడు అబ్దుల్లా, పేపర్ మిల్లు కార్మిక నేత ప్రవీణ్ చౌదరి తదితరులను వైఎస్సార్ సీపీలోకి తీసుకొచ్చింది తానేనని, క్యాడర్ ను కూడా తీసుకొచ్చానన్నారు. వారికి భరత్ చేసిందేమీ లేదన్నారు. వ్యక్తిగతంగా భరత్ కు కానీ, పార్టీకి కానీ ఎటువంటి అన్యాయం చేయలేదన్నారు. నాకు మాట సహాయం కూడా చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**భరత్ చీకటి వ్యాపారాలు ఇవిగో..నిజం కాదా..**

మార్గాని భరత్ రామ్ చీకటి వ్యాపారాలలో తన భాగస్వామ్యం ఉన్న వివరాలను మీడియాకు తెలియజేస్తూ..వీటిలో నిజం లేదా అని రామశర్మ సూటిగా భరత్ ను ప్రశ్నించారు. పేపర్ మిల్లు కార్మిక నేత ప్రవీణ్ చౌదరి నుంచి 'పరంపర'..ఒకే నెలలో మూడు దఫాలుగా రూ.1.5 కోట్లు భరత్ కు స్వయంగా నేనే పట్టుకెళ్ళి ఇచ్చాను. నిజం కాదా అని ప్రశ్నించారు. 5 ఎకరాలలో గ్రావెల్ వ్యాపారం నిమిత్తం ఎకరాకు రూ.25 లక్షలు చొప్పున కోటీ పాతిక లక్షలు ఇచ్చానన్నారు. బుర్రిలంక ఇసుక ర్యాంపు తనకు ఇచ్చినందుకు రూ.25 లక్షలు ఇచ్చాను. అది రెండవ రోజుకే మూతపడిందన్నారు. గాయత్రీ ఇసుక ర్యాంపు నిర్వాహకుడు రామకృష్ణ (ఆర్కే) ప్రతి నెలా రూ.10 లక్షలు చొప్పున ఇచ్చారని..నేనే సాక్షినన్నారు. బీసీల ఐక్య వేదిక, వన సమారాధనలు..ఇలా అనేక కార్యక్రమాలకు లక్షల కొద్దీ డబ్బులు ఖర్చు పెట్టానని చెప్పారు. వైసీపీ నేతలు మిథున్ రెడ్డి, సుబ్బారెడ్డి..తదితరులు వచ్చినప్పుడు ఖర్చంతా తనదే అన్నారు. నగరంలో హరితా యువత కార్యక్రమాలకు వచ్చిన సెలబ్రిటీలకు ఇన్నమూరి దీపు ద్వారా ఖర్చుపెట్టించాడని తెలిపారు. ఇంత చేసినా దీపునకు కానీ, అబ్దుల్లాకు కానీ ఏ విధంగానూ భరత్ సహకరించలేదన్నారు.

**నాకు రక్షణ కావాలి..**

ఎవరి వత్తిడి, ప్రోద్బలంతో తాను మీడియా ముందుకు రాలేదని, పితా రామకృష్ణ తనపైనా, తన తల్లిదండ్రులపై చేస్తున్న అరాచకాలకు విసిగిపోయి తన ఆవేదనను చెప్పేందుకే ఇక్కడకు వచ్చానన్నారు. ప్రస్తుతం ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నానని, మా నాన్నగారు పుష్కరాల రేవు వద్ద పౌరోహిత్యం చేసుకుంటున్నారని..దీనికంతటికీ కారణం భరత్ అన్నారు. నా ద్వారా భరత్ కు నాలుగైదు కోట్లు ఇచ్చానని ఒక ప్రశ్నకు సమాధానంగా రామశర్మ తెలిపారు. నేను కొంతమంది వద్ద అప్పు తీసుకున్న మాట వాస్తవమేనని, వారందరికీ చెల్లిస్తానని..అయితే తనని ఇబ్బంది పెట్టవద్దని చేతులు జోడించి ప్రాధేయపడుతు న్నానని రామశర్మ కోరారు.

**ఎస్పీకు ఆధారాలతో ఫిర్యాదు చేస్తా..**

భరత్ అనుచరుడు పితా రామకృష్ణ, అతని మనుషులు తన ఇంటికి వచ్చి చేసిన అరాచకాలను ఆడియో రికార్డు, ఫొటోలు తదితర ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేశానని, మరోసారి ఎస్పీని కలిసి ఫిర్యాదు చేస్తానని రామశర్మ తెలిపారు. తమకు పూర్తి రక్షణ కావాలని, తమ ప్రాణాలకు ఏదైనా హాని జరిగితే దానికి బాధ్యత భరత్, రామకృష్ణ, అతని అనుచరులే బాధ్యులవుతారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో న్యాయవాదులు నవీన్, అనిల్ పాల్గొన్నారు.



# నేనున్నానంటూ

## దివ్యాంగుడికి మంత్రి కందుల దుర్గేష్ భరోసా

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** మంత్రి కందుల దుర్గేష్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. తనను నమ్మి రాజమహేంద్రవరంలోని ఇంటి వద్దకు వచ్చిన రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నామవరం శాటిలైట్ సిటీకి చెందిన కండిపిల్లి ప్రసన్నకుమార్ అనే విభిన్న ప్రతిభావంతుడికి తానున్నానంటూ మంత్రి కందుల దుర్గేష్ భరోసానిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. సదరం సర్టిఫికెట్ లో నూటికి నూరు శాతం అంగవైకల్యం ఉన్నప్పటికీ కండిపిల్లి ప్రసన్నకుమార్ కు ఆధార్ బయోమెట్రిక్ పడటం లేదన్న కారణంతో గత కొంత కాలంగా పెన్షన్ అందడం లేదు. అది కూడా దివ్యాంగుల కోటా పెన్షన్ రూ.6 వేలు వచ్చేదని మంత్రి కందుల దుర్గేష్ కు సమస్యను విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్ బయోమెట్రిక్ సెంటర్ వారితో తాను చర్చిస్తానని, కాకినాడ వెళ్లి అప్డేట్ చేసుకోమని మంత్రి దుర్గేష్ సూచించారు. కలెక్టర్ ఆఫీస్ కు సంబంధిత సమాచారం చేరవేసి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల కోటాలో నెలకు రూ.15 వేలు పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటానని ప్రసన్నకుమార్ కు మంత్రి కందుల దుర్గేష్ హామీ ఇచ్చారు. తనను కలిసేందుకు రాజమహేంద్రవరం వచ్చిన ప్రసన్నకుమార్ కు ఆటో ఖర్చుల రూపేణా వ్యక్తిగత సాయంగా రూ. 2 వేలు అందించారు. మంత్రి దుర్గేష్ స్పందించిన తీరుపై ప్రసన్నకుమార్, అతని కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## నేటి నుండి గ్రంథాలయ వారోత్సవాలు

**కపిలేశ్వరపురం (మనసులో మాట) నవంబర్ 13:** స్థానిక శాఖ గ్రంథాలయం వద్ద 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుండి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు స్థానిక శాఖ గ్రంథాలయ అధికారిణి దానేటి శివకుమారి గురువారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం జాతీయపతాక ఆవిష్కరణతో వారోత్సవాలను ప్రారంభించి 20వ తేదీన గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయిలో అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులకు విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం చిత్రలేఖనం పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు.

## కొల్లేరు అభయారణ్యం సరిహద్దులను గుర్తించండి



**ఏలూరు, (మనసులో మాట) నవంబర్ 13..** కొల్లేరు అభయారణ్యం సరిహద్దులను గుర్తించి నివేదిక సమర్పించాలని రాష్ట్ర అటవీ శాఖ చీఫ్ ప్రిన్సిపుల్ కన్జర్వేటర్ డా. పి . వి. చలపతిరావు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ లోని గౌతమీ సమావేశపుహాలులో రాష్ట్ర అటవీశాఖ అదనపు ప్రిన్సిపుల్ చీఫ్ కన్జర్వేటర్ శాంతిప్రియ పాండే, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల అటవీ, రెవిన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులతో కొల్లేరు అభయారణ్యం, సుప్రీం కోర్ట్ ఏర్పాటుచేసిన కేంద్ర సాధికార కమిటీ కొల్లేరు అభయారణ్యం లో కొన్ని అంశాలపై నివేదికలు కోరిన అంశాలపై అధికారులతో డా. చలపతిరావు సమీక్షించారు. ఈ సందర్భంగా డా. చలపతిరావు మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యం సరిహద్దులను అభయారణ్యం రూపొందించినప్పుడు ఉన్న రికార్డులతో ప్రస్తుతం ఆధునిక లిడార్ సర్వే టెక్నాలజీ ద్వారా గుర్తించి నివేదికలు సమర్పించాలన్నారు. కొల్లేరు అభయారణ్య పరిధిలో జిరాయితీ, డి.ఫారం పట్టా భూములు వివరాల తో పాటు , ఇటీవల కొల్లేరు ప్రాంతంలో పర్యటించిన సుప్రీం కోర్ట్ నియమించిన కేంద్ర సాధికార కమిటీ కొల్లేరు అభయారణ్యం పై కొన్ని అంశాలపై నివేదికలు సమర్పించాల్సిందిగా ఆదేశించిందని, వాటిని సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి వాటిపై నివేదికలను వెంటనే సమర్పించాలని డా. చలపతి రావు అధికారులను ఆదేశించారు. కొల్లేరు ప్రాంతంలో నీటి నిర్వహణకు బాధ్యత వహించే నీటిపారుదల శాఖ కొల్లేరు సరస్సు ప్రాంతం యొక్క వివరణాత్మక కాంటూర్ మ్యాప్లను అందించాలని ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ ను డా.చలపతిరావు ఆదేశించారు. ఉప్పుటేరు సరిహద్దులను గుర్తించి నివేదికలు సమర్పించాలని, దీనికరణంగా కొల్లేరుప్రాంతంలో వరదలను నియంత్రించేందుకు ఆక్రమణలపై చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా అటవీ శాఖాధికారి బి. విజయ, ఏలూరు జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, ఇరిగేషన్ శాఖ చీఫ్ ఇంజనీర్ శేషుబాబు, ఎస్ఈ దేవప్రకాష్, ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, పంచాయతీరాజ్ ఎస్ఈ రమేష్, డిపిఓ కె. అనురాధ, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ త్రినాధ్ బాబు, అటవీ,రెవిన్యూ, ఇరిగేషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలు - 2027

## శాఖల వారీగా సమన్వయ కార్యాచరణపై సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి




**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** గోదావరి పుష్కరాలు- 2027ను సమర్ధవంతంగా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల విధులు, బాధ్యతలు, అవసరమైన మౌలిక సదుపాయాలపై విభాగాల వారీగా నిర్దిష్టమైన అంచనాలు రూపొందించి, వాటిని సమగ్రంగా క్రోడీకరించి రాష్ట్ర ముఖ్యమంత్రి సమక్షంలో జిల్లా యంత్రాంగం తరపున సమగ్ర ప్రెజెంటేషన్ రూపంలో ప్రదర్శించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆధ్వర్యంలో గోదావరి పుష్కరాలు -2027 నేపథ్యంలో ప్రాథమిక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సమక్షంలో గోదావరి పుష్కరాలు 2027 కార్యాచరణ ప్రణాళిక అందచేసే క్రమంలో జిల్లా ప్రజా ప్రతినిధులు, ఇంచార్జి మంత్రి ఆధ్వర్యంలో వారి సూచనలు, సలహాలను అధికారులు చేసిన ప్రతిపాదనలతో సమన్వయం చేసుకోవలసి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో గత పుష్కరాల సమయంలో ఏర్పడే భారీ జనసమ్మర్ధం, రవాణా సౌకర్యాలు, భద్రత, శానిటేషన్, నీటి సరఫరా, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై విభాగాల వారీగా చర్చించినట్టు తెలిపారు. అదే విధంగా రానున్న గోదావరి పుష్కరాలు 2027 సమర్థవంతంగా నిర్వహించే క్రమంలో శాఖల మధ్య సమన్వయం అత్యవసరమని అన్నారు. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో రెవెన్యూ, పోలీసు, ట్రాన్స్పోర్ట్, ఆర్టీసీ తదితర శాఖలు తమ విభాగాల ప్రాథమిక కార్యాచరణ, బాధ్యతలు, అవసరమైన మౌలిక సదుపాయాల వివరాలను పీపీటీల ద్వారా సమగ్రంగా వివరించాయి. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రానున్న సమావేశాల్లో ఇరిగేషన్, దేవదాయ, రైల్వే, రవాణా, విద్యుత్తు, మున్సిపల్ శాఖలు 2003, 2015 పుష్కరాల అనుభవాలను ఆధారంగా తీసుకుని తమ విభాగాల డేటా, ఎదుర్కొన్న సవాళ్లు, భవిష్యత్తు ప్రణాళికలు సమర్పించవలసి ఉందన్నారు. 2027 పుష్కరాల నిర్వహణలో స్మార్ట్ మానిటరింగ్, ఐసీసీసీ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్, ఏఐ టెక్నాలజీ, డిజిటల్ ఇన్వెంటరీ సిస్టమ్ వంటి ఆధునిక పద్ధతులు కీలకమన్నారు. కొవ్వూరు, రాజమహేంద్రవరం ఇరు ప్రాంతాల్లో పుష్కర స్నానాలు ఆచరించే క్రమంలో భక్తుల సంఖ్య ముందస్తు అంచనా వెయ్యడం జరగాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ డైవర్షన్, పార్కింగ్, క్రౌడ్ నిర్వహణ విషయం లో రవాణా, ఇతర వ్యవస్థలు పోలీసు యంత్రాంగంతో కలిసి పని చేయడం ముఖ్యం అన్నారు. తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక వైభవం, సంప్రదాయ విధానాలు, గోదావరి పుష్కరాలకు సంబంధించిన విశిష్ట ఆచారాలు, చారిత్రక నేపథ్యం వంటి అంశాలను సమగ్రంగా ప్రతిబింబించేలా దేవదాయ, సాంస్కృతిక శాఖలు ఏర్పాట్లు చేయాలని , ఆ మేరకు ప్రతిపాదనలను సంబంధిత విభాగాల అధికారులను సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. జిల్లా యొక్క సాంస్కృతిక ప్రతిభ, సంప్రదాయ కళారూపాలు, పుణ్యక్షేత్రాల వైశిష్ట్యం ప్రజలకు తెలియజేయడం ద్వారా గోదావరి ఆధ్యాత్మికతను మరింతగా వెలుగులోకి తేవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ డీ నరసింహ కిషోర్ మాట్లాడుతూ 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, జన సమూహాల పర్యవేక్షణ వంటి అంశాలపై ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని తెలియజేశారు. ప్రధాన ఘాట్ల వద్ద సీసీ టీవీ కెమెరాలు, ఏఐ ఆధారిత డెన్సిటీ ట్రాకింగ్ సిస్టమ్, డ్రోన్ పర్యవేక్షణ, స్మార్ట్ పేట్రోలింగ్ పాయింట్లు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలల్సి ఉంటుందన్నారు. పుష్కరాల సమయంలో వివిధ ప్రభుత్వ శాఖలు, రక్షణ విభాగాలు, పోలీసు, రెవెన్యూ, ట్రాన్స్పోర్ట్ శాఖలు మధ్య సమన్వయంతో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐసీసీసీ) ద్వారా సమాచారం పంచుకునే విధంగా సమగ్ర మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కేపీఎంజీ కన్సల్టెన్సీ ఏజెన్సీ ప్రతినిధులు ప్రకాశ్ శ్రీవాత్సవ్, ప్రశాంత్ తదితరులు మహా కుంభమేళా -2025 (ప్రయాగ్‌రాజ్)లో అమలు చేసిన స్మార్ట్ క్రౌడ్ మేనేజ్‌మెంట్, వాహన చలనం, పార్కింగ్, శానిటేషన్, డిజిటల్ కమ్యూనికేషన్, ఐసీసీసీ ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థల అమలు విధానాలను వివరించడం జరిగింది. గోదావరి పుష్కరాల సందర్భంలో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా టెక్నికల్ లేఅవుట్, మోడల్ ప్రణాళిక అందించనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, అదనపు ఎస్పీ మురళీ కృష్ణ, ఆర్డీవోలు రాణి సుస్మిత, కృష్ణ నాయక్, డీఎస్పీ దేవకుమార్, రైల్వే, రెవెన్యూ, ట్రాన్స్పోర్ట్, మున్సిపల్, ఆర్టీసీ, ఆర్ఎంసీ, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొక్కు తీర్చుకున్న

## సినీ హీరో బెల్లంకొండ శ్రీనివాస్

### అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి వారికి పదివేల కొబ్బరికాయలు కొట్టి



**అయినవిల్లి (మనసులో మాట) నవంబరు 13 :** ప్రసిద్ధి చెందిన అయినవిల్లి శ్రీ సిద్ధి వినాయక స్వామి వారి ని ప్రముఖ హీరో బెల్లంకొండ శ్రీనివాస్ దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి విచ్చేసిన హీరో బెల్లంకొండ శ్రీనివాస్ కు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన మొక్కుకున్న కొబ్బరికాయలను స్వామివారికి కొట్టి మొక్కి తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి ఆలయానికి గత 12 ఏళ్ల నుండి వస్తున్నానని మా తండ్రి బెల్లంకొండ సురేష్ చాలా ఏళ్ళ నుండి స్వామివారిని దర్శించుకుంటున్నా రన్నారు. నాకు చాలా చాలా ఇష్టమైన దేవుడు అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి అన్నారు. స్వామి వారిని నేను కోరిన కోర్కెలు ప్రతి కోరికను తీర్చే ఇష్టమైన దేవుడు అన్నారు. స్వామివారిని ఇలాంటి మంచి వాతావరణంలో దర్శించుకోవడం నాకు చాలా ఆనందకరంగా ఉందన్నారు. ఇటీవల నేను తీసిన సినిమా కిష్కంధపురి హిట్ అయిందని నాకు ఇలాంటి సక్సెస్ ను స్వామివారి ఇస్తే 50,000 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకుంటానని స్వామివారికి మొక్కుకున్నానన్నారు. ఈ మొక్కులో భాగంగా ఈరోజు పదివేల కొబ్బరికాయలు స్వామివారికి కొట్టి మొక్కు తీర్చుకున్నానని శ్రీనివాస్ తెలిపారు. స్వామి వారి ఆశీర్వాదం నాపై నా కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నట్లు హీరో శ్రీనివాస్ తెలిపారు.

# 15న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రా

## నవంబర్ నెల మూడో శనివారం "వ్యక్తిగత - సమాజ పరిశుభ్రత" అనే ఇతివృత్తంతో జిల్లా అంతటా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి.. - జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ (మనసులో మాట), నవంబరు 13:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం పరిశుభ్రత, ప్రజా పరిశుభ్రత, పౌరుల భాగస్వామ్యం యొక్క విలువలను ప్రోత్సహించడానికి ప్రతి నెల మూడవ శనివారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, మున్సిపల్ కార్యాలయాల్లోను, సంస్థలలో స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణ ఆంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఈ నవంబర్ 2025 నెల మూడో శనివారం "వ్యక్తిగత & సమాజ పరిశుభ్రత" అనే ఇతివృత్తంతో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, మున్సిపల్ క్యాలయాల్లో నవంబర్ 15న స్వచ్ఛంద దినోత్సవం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. బహిరంగ మలవిసర్జన, మూత్ర విసర్జన నిర్మూలనపై దృష్టి సారించి, సమాజ శ్రేయస్సు కోసం మంచి పారిశుధ్య పద్ధతులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడానికి విద్యాసంస్థలు, పాఠశాలలు మరియు ప్రభుత్వ కార్యాలయాలలో వాష్ (వాటర్ శానిటేషన్ & హైజీన్) కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో బహిరంగ మూత్ర విసర్జన, మల విసర్జనను నిరోధించ డానికి ప్రచారం చేపట్టాలని సూచించారు. పరిశుభ్రత నిర్వహణ, సురక్షితమైన పారిశుధ్య పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కమ్యూనిటీ టాయిలెట్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాల చుట్టూ శుభ్రపరిచే డ్రైవ్‌లను నిర్వహించాలన్నారు. పారిశుద్ధ్యం విస్తరించడానికి మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలలో, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లలో కొత్త కమ్యూనిటీ/పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణానికి స్థల సేకరణ చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నీరు, లైటింగ్ మరియు శుభ్రపరిచే సహాయంతో 24x7 పనితీరును నిర్ధారించడానికి ఇప్పటికే ఉన్న పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, పునరుద్ధరణ డ్రైవ్‌లను చేపట్టాలన్నారు. పర్యాటక ప్రదేశాలు, మార్కెట్లు, బస్సు స్టాండ్లలో టాయిలెట్లను గుర్తించి వాటి నిర్వహణ మెరుగు పరచాలన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి క్రమం తప్పకుండా ప్రజా మరుగుదొడ్ల లభ్యత, వాటి నిర్వహణను నిర్ధారించడానికి ఎన్.హెచ్.ఏ.ఐ, రాష్ట్ర రహదారుల విభాగాలతో సమన్వయం చేసుకోవాలన్నారు. స్థిరమైన నమూనాల కింద ప్రజా మరుగుదొడ్ల అవగాహన, నిర్వహణ కోసం స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ఆర్డబ్ల్యుఎస్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

ప్రపంచ టాయిలెట్ దినోత్సవం (19 నవంబర్ 2025) సందర్భంగా సురక్షితమైన పారిశుధ్యం, టాయిలెట్ వినియోగం, పరిశుభ్రత ప్రవర్తన జిల్లా యొక్క ప్రాముఖ్యతపై సామూహిక అవగాహన పోటీలను నిర్వహించాలన్నారు. సంబంధిత హ్యాష్‌ట్యాగ్‌లను ఉపయోగించి ఎస్-ఎస్ఏ ప్లాట్‌ఫామ్‌లో ఛాయాచిత్రాలు, వీడియోలు అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు, ప్రత్యేక అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సమర్థవంతమైన అమలు కోసం అన్ని శాఖల అధికారులతో సమన్వయాన్ని ప్రోత్సహింత్యచండి. ఎన్నికైన ప్రతినిధులు, విద్యాసంస్థలు పౌర సంస్థలను ఇందులో భాగస్వామ్యం చేయాలని జిల్లా సూచించారు.



## నేటి నుండి గ్రంథాలయం వారోత్సవాలు

**ముమ్మిడివరం, (మనసులో మాట) నవంబరు 13:** ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు ముమ్మిడివరం శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు లైబ్రేరియన్ శీలం నాగరాజు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు వ్యాసరచన, వివిధ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

## ఈనెల 16న యానాంలో కాపు కార్తీక వన సమారాధన

**హాజరుకానున్న తోట, పేరాబత్తుల, గొల్లపల్లి**

**యానాం (మనసులో మాట), నవంబరు 13:** పవిత్ర కార్తీక మాసం సందర్భంగా ఈ నెల 16వ తేదీ ఆదివారం యానాంలో కాపు కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు యానాం తెలగ (కాపు-బలిజ) అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి రామ్మూర్తి తెలిపారు. స్థానిక బైపాస్ రహదారిలోనిశ్రీ పెద్దిరెడ్డి కృష్ణ వినాయకరావు యానాం కాపు కళ్యాణ మండపంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాపు ప్రజాప్రతినిధులు తోట త్రిమూర్తులు, పేరా బత్తుల రాజశేఖరం, గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరు కానున్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు మహిళలకు ముగ్గుల పోటీలు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు మొదలైన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి బస్సు సౌకర్యం కల్పించడమ్ జరుగుతుందన్నారు. కార్తీక వన సమారాధన మహోత్సవానికి తెలగా (కాపు, బలిజ) అభ్యుదయ సంఘం నాయకులు, కార్యకర్తలు హాజరు కావాల్సిందిగా రామ్మూర్తి కోరుతున్నారు.

## ప్రతీ విషయంలోను విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి



**కాకినాడ(మనసులో మాట), నవంబరు 13:** హెల్మెట్ వాడకం, వందేమాతర గేయం ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీని కాకినాడ ట్రాఫిక్ పోలీసులు గురువారం నిర్వహించారు. కాకినాడ జగన్నాథపురంలోని ఏవిస్టి ప్రభుత్వ మహిళా కళాశాల కాలేజీ విద్యార్థినులతో కలిసి గురువారం ఈ ర్యాలీని చేపట్టారు. బాలాజీ చెరువు సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ మెయిన్ రోడ్, జగన్నాథపురం పాత బ్రిడ్జి, చర్చి స్క్వేర్ సెంటర్ మీదుగా కాలేజీ వరకు సాగింది. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ వాడకం చట్టపరమైన బాధ్యత మాత్రమే కాకుండా వ్యక్తిగత భద్రతకు ఎంతో అవసరమని తెలిపారు. హెల్మెట్ ధరించడం ద్వారా ప్రమాదాల తీవ్రత తగ్గుతుందని, ప్రాణాలు రక్షించుకోవచ్చని చెప్పారు. బైక్‌లపై ట్రిపుల్ రైడింగ్, స్టంట్స్ చేయరాదని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్, జాబ్ ఆఫర్లు, డిజిటల్ అరెస్టులు వంటి వాటి గురించి వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 112, 100, 1930, 1972 నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్-1, 2 పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు ఎన్ రమేష్, డి రామారావు, ట్రాఫిక్ ఎస్ఐలు పాల్గొన్నారు.

## హాలో మాదిగ చలో ఢిల్లీ విజయవంతం చేయండి



**పల్నాడు,నవంబర్ 13,(మనసులో మాట):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి పై జరిగిన దాడిని ఖండిస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో 17న చలో ఢిల్లీ కార్యక్రమం జరుగుతుందని ఎం ఎస్ పి జిల్లా కోశాధికారి కంచర్ల జాన బాబు మాదిగ అన్నారు. గురువారం పెదకూరపాడు లో కరపత్రాలు ఆవిష్కరించారు. జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు దళితుల ఆత్మగౌరవ ప్రదర్శన కార్యక్రమం ఉంటుందని అన్నారు. పెదకూరపాడు మండలం నియోజకవర్గ నుంచి మాదిగ సోదరులు చలో ఢిల్లీ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కంచర్ల సుబ్బారావు కంచర్ల అమర్ రావెల బెంజిమెన్ తాళ్లూరు చక్రవర్తి కంచర్ల పిచ్చయ్య మాదిగ సోదరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో వర్గ విభేదాలు కుంపటి

**జనసేన నేతలకు ఆహ్వానం లేదంటూ ఆగ్రహం - ఆదినుంచి అమలాపురంలో ఇదే జరుగుతుంది**



**అమలాపురం (మనసులో మాట) నవంబరు 13:** కూటమి ప్రభుత్వంలో తెదేపా, జనసేన, బిజెపి మూడు పార్టీ నాయకులు కలసి ఆయా నియోజకవర్గాల్లో అభివృద్ధి సంక్షేమ పనులు చేపట్టాలనేది సీఎం చంద్రబాబు డిసిఎం పవన్ కళ్యాణ్ లు ఎమ్మెల్యే లకు చెప్పిన మాటలు. రాష్ట్రంలో మూడు పార్టీలలో బిజెపిలో ఎంపీలు తప్ప ఎమ్మెల్యే లేకపోవడం ప్రధానంగా తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు మాత్రమే ఎమ్మెల్యేగా ఆయా నియోజవర్గాల్లో ఉన్నారు. అమలాపురం నియోజవర్గంలో ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గా అయితా బత్తుల ఆనందరావు కొనసాగుతున్నారు. ఇక్కడ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలను మాత్రమే ఎమ్మెల్యే పట్టించుకుంటున్నారని జనసేన పార్టీ నాయకులకు అసలు అవకాశం ఇవ్వడం లేదని జనసేన పార్టీ నాయకులు ఆరోపణ. అయితే ఇక్కడ జనసేన పార్టీలో రెండు వర్గాలు ఉండటం వలన ఇది తెదేపాకు ఒక అవకాశం గా మారడంతో తెలుగుదేశం పార్టీ వారికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారనేది అందరి నోళ్ళలో నానుతున్న మాట. ఇటీవల జరిగిన నామినేటెడ్ పదవుల్లో కూడా అమలాపురంలో తెలుగుదేశం పార్టీకే ప్రాధాన్య దక్కిందని చెప్పాలి. ప్రభుత్వం ముఖ్య కార్యక్రమాలు జరిగినప్పటికీ జనసేన పార్టీకి అసలు పిలుపు ఉండటం లేదని జనసేన పార్టీ నాయకులు ఆవేదన చెందుతూ ఈ పంచాయతీని రాష్ట్ర నాయకులు వరకు తీసుకెళ్లారు. అయినప్పటికీ అమలాపురంలో ఎటువంటి మార్పు కనిపించడం లేదని ప్రధాన చర్చ జరుగుతోంది. ఇది ఇలా ఉండగా బుధవారం అమలాపురంలో రెండు ప్రధాన కార్యక్రమాలు జరిగాయి. ఒకటి అమలాపురం రూరల్ నడిపూడి గ్రామంలో ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు జిల్లా కలెక్టర్లు హౌసింగ్ రుణాలు నూతనంగా నిర్మించిన గృహాలు లబ్ధిదారులకు అందించే కార్యక్రమం, అలాగే అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ మార్చ్ కార్యక్రమం కూడా జరిగింది ఈ రెండు కూడా పెద్ద కార్యక్రమాలే అయితే ఈ రెండు కార్యక్రమాలకు జనసేన పార్టీ నుండి ఒక్క నాయకుడికి కూడా పిలుపు లేకపోవడంతో జనసేన నేతలు ఆగ్రహంతో ఊగిపోయారు. కూటమి ప్రభుత్వం అమలాపురంలో అర్ధనారీశ్వరులం అని చెప్పుకునే జనసేన నేతలకు కనీసం ఏ ఒక్క కార్యక్రమానికి పిలుపు ఉండటం లేదని వారు ఆవేదన. జనసేన నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇదంతా జరుగుతుందని ఈ కారణంతో తెదెపా వారికి లోకువగా మారమని పలువురు జనసేన నేతలు బహిరంగ అంటున్నారు. జనసేన పార్టీ నాయకులు అంతా ఐక్యంగా ఉండి ఉంటే అమలాపురంలో ఈ పరిస్థితి ఉండేది కాదని వారు ముక్తకంఠంగా చెబుతున్నారు. ప్రస్తుతం రెండు,మూడు నెలల్లో స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అమలాపురంలో తెదేపా జనసేన పార్టీలు ఎడ మొహం పెడ మొహంతో ఉంటే పరిస్థితి వైఎస్ఆర్సిపి వారికి అనుకూలంగా ఉండే అవకాశం ఉంటుంది. మరి ఇప్పటికైనా కూటమి నాయకుల్లో మూడు పార్టీలు ఐక్యంగా ఉండి ముందుకు వెళ్లకపోతే స్థానిక ఎన్నికల్లో దాని ప్రభావం కచ్చితంగా ఉంటుందని పలువురు అంటున్నారు. కూటమి నాయకులు ఇప్పటికైనా ఒకటవుతారా లేదా అనేది వేచి చూడాలి.

## కార్యకర్త కుటుంబానికి రూ.20 వేలు ఆర్థిక సహాయం



**రామచంద్రపురం(మనసులో మాట) నవంబర్ 13..** కష్ట కాలంలో ఉన్న కార్యకర్త కుటుంబానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. వివరాల్లోకెళితే రామచంద్రపురం జల్లి పేటకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త తొగరు శ్రీనివాస్ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈ విషయాన్ని కార్యకర్తల ద్వారా తెలుసుకున్న మంత్రి సుభాష్ శ్రీనివాసును గురువారం పార్టీ కార్యాలయానికి పిలిపించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలను ఎన్నడూ విస్మరించబోమని, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వెంటనే రూ. 20 వేలు చెక్కును ఇచ్చి ఆపన్న హస్తం అందించారు. కార్యకర్తల కష్టం తెలుసుకొని తక్షణం స్పందించిన మంత్రి సుభాష్ మానవత్వానికి, దయా గుణానికి పలువురు వర్షం వ్యక్తం చేసారు. మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ నాయకులు కంచుమర్తి బాబురావు, మురళి, ప్రకాష్ ఉన్నారు.

## పలు కుటుంబాలకు తుమ్మలపల్లి రమేష్ పరామర్శ



**కిర్లంపూడి (మనసులో మాట) నవంబరు 13..** జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం గోనేడ గ్రామం లో నీలం సూరిబాబు(లేటు) సతీమణి మరియు నీలం సురేంద్ర అమ్మ అయిన మాజీ సర్పంచ్ నీలం బేబమ్మ ఇటీవల స్వర్గస్తులైనారు. ఈరోజు వారి స్వగృహంలో నిర్వహించిన బేబమ్మా దశదినకర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యుల పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన జగ్గంపేట జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్. ఈ సందర్భంగా బేబమ్మ చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘన నివాళు లర్పించడం జరిగింది. పరామర్శించిన వారిలోతోట నాయుడు, తామరడ ఎంపిటిసిగోకేడ రాజా,మాదారపు వీరబాబు, జేజేలు గురువు,బదిరెడ్డి నాని,గోకేడ రమణ, చిక్కల కల్కి భగవాన్,గోకవరం బదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. బూరుగుపూడి గ్రామం లో పాటంశెట్టి వెంకటేశ్వరులు ఇటీవల స్వర్గస్తులైనారు. ఈరోజు వారి స్వగృహంలో నిర్వహించిన వెంకటేశ్వర్లు దశదినకర్మ కార్యక్రమానికి హాజరై వారి కుటుంబ సభ్యుల పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన జగ్గంపేట జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్. ఈ సందర్భంగా వెంకటేశ్వరులు చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘన నివాళులర్పించడం జరిగింది. పరామర్శించిన వారి లో రామిశెట్టి రాజు,మాదారపు వీరబాబు, పాతం శెట్టి మురళీకృష్ణ, పాటంశెట్టి సత్తిబాబు,వంశీ తదితరులు ఉన్నారు

# నేటి బాలలే రేపటి పౌరులు

**- అవగాహన లోపం తో కాగితాలకే పరిమితమైన చిన్నారుల చట్టాలు**

**- ప్రతీ పాఠశాలలో విలువలు గురించి, చట్టాలు గురించి వారం లో ఏదోక రోజు ప్రత్యేక క్లాస్ ఉండాలి**



**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 13:** నేటి బాలలే రేపటి పౌరులు. దేశ భవిష్యత్తు, అభివృద్ధి వారి చేతుల్లోనే ఉంది. భారత రాజ్యాంగం ప్రతి చిన్నారికి విద్య, రక్షణ, ఆరోగ్యం, గౌరవప్రదమైన జీవనానికి హక్కు కల్పిస్తుంది. ఈ హక్కులను రక్షించేందుకు భారత ప్రభుత్వం అనేక చట్టాలను చేసింది. కానీ అవగాహన సరిగా లేక చట్టాలు పుస్తకాలకే పరిమితం అవుతున్నాయి. ఆచరణలో నిలిపి చట్టాల అమలు ద్వారా చిన్నారులకు రక్షణ కల్పించడంతో పాటు వారికి విద్య, ఆరోగ్యం అందించటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత. బాలల రక్షణతోనే దేశ భవిత. పిల్లలూ మరి నవంబర్? 14న జాతీయ బాలల దినోత్సవం కదా ఈ సందర్భంగా బాలల రక్షణకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని ముఖ్యమైన రక్షణ చట్టాలు గురించి తెలుసుకుందామా!

**జువైనల్ జస్టిస్ చట్టం :**
ఇది 2015 సంవత్సరంలో అమలులోకి వచ్చింది. 18 సంవత్సరాలలోపు వయసు ఉన్న వారంతా బాలలే. నేరాల్లో చిక్కుకున్న లేదా రక్షణ అవసరమైన పిల్లలకు న్యాయపరమైన రక్షణ కల్పించేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో జువైనల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటు చెయ్యాలి. బాలల సంరక్షణ కమిటీలు, పునరావాస కేంద్రాలు సైతం ఏర్పాటు చెయ్యాలి

**బాల్య వివాహ నిషేధం (2006) :**
18 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న అమ్మాయిలు, 21 సంవత్సరాల కంటే తక్కువ వయసున్న అబ్బాయిలకు వివాహం చేయడం నేరం. ఒక వేళ ఇలాంటి పెళ్లి జరిగినా దానిని చెల్లకూడని వివాహంగా చట్టం నిర్దేశిస్తుంది.

**అత్యాచారాల నుంచి రక్షణ :**
లింగ వివక్ష లేకుండా ఎవరైనా పిల్లలు (18 సంవత్సరాల లోపు) లైంగిక దాడులు, వేధింపులకు గురైతే వారికి రక్షణ కల్పించడమే పోక్సో చట్టం (2012) ఉద్దేశం. నేర తీవ్రతను బట్టి జీవిత ఖైదు లేదా ఉరిశిక్ష కూడా విధించే అవకాశం ఉంటుంది. కేసుల విచారణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేసింది.

**విద్యా హక్కు :**
పాఠశాల ఈడు పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 2009లో ఈ చట్టాన్ని తీసుకువచ్చింది. 6 నుంచి 14 సంవత్సరాల బాలలకు కుల, జాతి, మత, ఆర్థిక అసమానతలకు అతీతంగా విద్యను అందించేందుకు విద్యను హక్కుగా గుర్తించి అమలు చేస్తున్నారు.

**బాలకార్మిక వ్యవస్థ నిరోధక :**
14 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టడం నేరంగా భావిస్తూ 1986లో బాల కార్మిక నిరోధక చట్టం అమలులోకి వచ్చింది. 14 నుంచి 18 సంవత్సరాల బాలలను ప్రమాదకర ఉద్యోగాలలో పెట్టడాన్ని కార్మిక నిరోధక చట్టం నిరోధించింది.

**రక్షణగా 1098 :**
ఎవరైనా చిన్నారి ప్రమాదంలో ఉన్నారని అనిపిస్తే చైల్డ్‌లైన్ నెంబరు 1098కు కాల్? చేస్తే సంబంధిత అధికారులు స్పందించి రక్షణ కల్పిస్తారు. ఈ నెంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుంది.

**ఉచిత న్యాయ సహాయం :**
న్యాయసేవాధికార చట్ట ప్రకారం బాలలందరూ ఉచిత న్యాయ సహాయానికి అర్హులు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టులలో న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశం ఉంది. "పిల్లల రక్షణకు ఎన్నో చట్టాలు ఉన్నప్పటికీ, వాటిపై అవగాహన లేకపోవటం కారణంగా సరైన న్యాయం పొందలేకపోతున్నారు. బాలలను చైతన్యపరిచే ఉద్దేశంతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బడిలో, కాలేజీలో న్యాయవిజ్ఞాన శిబిరాలు నిర్వహించాలి. సమాజంలోని ప్రతి ఒక్కరూ చట్టాలు తెలుసుకోవాలి. తమ పిల్లలను చైతన్యపరిస్తే లక్ష్యం నెరవేరుతుంది. ఈ మేరకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది.



# తీరనున్న రహదారి కష్టాలు

**దుగ్గుదూరు- ఉప్పుమిల్లి,**

**తాళ్ళరేవు బి తిప్పరాజుపాలెం రహదారులకు మోక్షం**

**కాజులూరు (మనసులో మాట) నవంబరు 13..** మూడు కోట్ల రూపాయలుతో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మండలంలోని పది గ్రామాల ప్రజలు సరైనా రహదారి లేక ఇన్నాళ్లు పడిన కష్టాలకు మోక్షం లభించబోతున్నది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చేసిన కృషితో రహదారి సౌకర్యం కల్పించేందుకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ ముందుకు వచ్చింది. కోటి రూపాయలు సిఎస్ ఆర్ నిధులు వెచ్చించి ఉప్పుమిల్లి దుగ్గుదుర్రు రహదారికి, రహదారి నిర్మాణానికి ఆమోదం తెలపగా, తాళ్ళరేవు తిప్పరాజుపాలెం రహదారికి కోటి 95 లక్షల రూపాయల నాబార్డ్ నిధులతో నిర్మించనున్న రహదారులకు గురువారం కాజులూరు, ఉప్పుమిల్లి గ్రామాలలో జరిగిన కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వాసంశెట్టి సత్యం రహదారి నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ తిప్పరాజుపాలెం కాజులూరు రహదారికి కోటి 95 నిమిషాల రూపాయల నాబార్డ్ నిధులు, ఉప్పుమిల్లి దుగ్గుదురు రహదారి నిర్మాణానికి సిఎస్ ఆర్ నిధులు విడుదల చేసిన అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఎం.డీ నిత్యానందరెడ్డిని అభినందించారు. ఇంతకాలం సరైన రహదారి లేక రవాణా సౌకర్యం కొరవడి అవస్థలు పడిన పది గ్రామాల ప్రజల కష్టాలు ఇక తొలగిపోతాయన్నారు. రహదారి ఏర్పాటుకు మంత్రి వాసంశెట్టి సుభాష్ చూపిన చొరవను ఈ సందర్భంగా పది గ్రామాల ప్రజలు కొనియాడారు. అధ్వానంగా ఉన్న రోడ్డుపై రాకపోకలు సాగించలేక ప్రజలు ఇబ్బందులు పడ్డామని అడుగడుగున గుంతలతో నిత్యం ప్రమాదాల బారిన పడేవారమనివారు తెలిపారు. అత్యవసర సమయంలో మండల కేంద్రానికి చేరుకోవడానికి గంటల తరబడి ప్రయాణించాల్సిన దుస్థితి నుంచి మంత్రి వాసంశెట్టి సుభాష్ మోక్షం కలిగించారని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలైన రోడ్లు, తాగునీరు కల్పించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తగు చర్యలు తీసుకుంటున్నారని వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ , ఏ.ఈ. వీ .లక్ష్మీ ప్రసన్న తెదేపా అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి జనసేన నాయకుడు అన్యం శ్రీరామచంద్రమూర్తి , సహకార సంఘం అధ్యక్షుడు వెంకటరమణ మాజీ ఎంపీపీ యాళ్ళ కృష్ణరావు , సిరిపురం డిసి పేపకాయల నారాయణరావు, వనుము వీరబ్రహ్మం, పోతు పరమేశ్వరరావు, దూడల శంకరనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పలపాటి జానకి అమ్మ అన్నదాన సత్రం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన



**రావులపాలెం (మనసులో మాట) నవంబర్ 13..** రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో ఉప్పలపాటి జానకియమ్మ అన్నదాన సత్రం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సత్రం చైర్మన్ గోపిశెట్టి సత్తిబాబు ఈవో మీసాలు రాధాకృష్ణ ఆధ్వర్యంలో కార్తీక దామోదర పూజ , ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమం లోముఖ్య అతిథులుగా కొత్తపేట తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బండారు సంజీవ్ పాల్గొని వృద్ధులకు దుప్పట్లు, స్థానిక పాఠశాల విద్యార్థులకు, స్కాలర్‌షిప్‌లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని సంజీవ్ పేర్కొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్ రాజు, సిబ్బంది వర్మ,శ్రీనివాసు,పొడగట్లపల్లి గ్రామ నాయకులు, పిఎసిఎస్ చైర్మన్ అల్లూరి కృష్ణంరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

**- మూడు రైస్ మిల్లులు సిద్ధం**

**- 75 కేజీల బస్తాకు కనీస మద్దతు ధర 1777 మండల వ్యవసాయ అధికారి అశోక్**



**కాజులూరు (మనసులో మాట) నవంబరు 13..** ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలుకు రైతు సేవ కేంద్రాలు సిద్ధం అయ్యాయని రైతులకు న్యాయమైన ధర లభించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ సారి నేరుగా ధాన్యం కొనుగోలు చేయబడుతుందనీ మండల వ్యవసాయ అధికారి వి అశోక్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన కాజులూరులో వ్యవసాయ అధికారి అశోక్ మాట్లాడుతూ మండల పరిధిలోని 22 రైతు సేవ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు సిద్ధమయ్యాయని సిబ్బంది అందుబాటులో ఉన్నారని మూడు రైస్ మిల్లులు ద్వారా ధాన్యం స్వీకరణకు పూర్తిగా సిద్ధమయ్యాయని తెలిపారు. రైతులు తమ పంటను శుభ్రంగా, తేమ శాతం 17 శాతం లోపు ఉంచి రైతు సేవా కేంద్రాల సిబ్బందికి తెలియజేయాలన్నారు. ప్రతి బస్తా బరువు 75 కిలోలు ఉండాలనీ ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం ప్రతి 75 కేజీల బస్తాకు 1777 ఇవ్వబడుతుందని వివరించారు. రైతులు తమ ధాన్యాన్ని అమ్మడానికి ముందుగా రైతు సేవా కేంద్రాల వద్ద నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రైతులు దగ్గరికి వెళ్లి ధాన్యం తేమ శాతంపై వివరించారు. ధాన్యం అమ్మిన వెంటనే బరువు నమోదు చేసి, రైతుల ఖాతాల్లో నేరుగా చెల్లింపు జరుగుతుందని అశోక్ తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, తాత్కాలిక నిల్వ షెడ్లు, తూకం యంత్రాలు వంటి సౌకర్యాలను కల్పించామని ఆయన చెప్పారు. "రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేశాం," అని ఆయన అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ చర్యలతో రైతులకు మద్దతు ధర హామీగా అందుతుందని, మధ్యవర్తుల దోపిడీ తగ్గుతుందని అధికారులు పేర్కొన్నారు.



## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గా కర్రి నాగిరెడ్డి

**కొత్తపేట (మనసులో మాట) నవంబర్ 13..** డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కర్రి నాగిరెడ్డి పార్టీ రాష్ట్ర కార్యదర్శి గా పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నియమించారు. నియామకం పై అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. నూతన రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగిరెడ్డి మాట్లాడుతూ, నాయకుడు వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నాపై ఉంచిన నమ్మకానికి హృదయపూర్వక ధన్యవాదాలు. పార్టీ బలోపేతం, ప్రజల సమస్యల పరిష్కారం, దిశగా మరింత కృషి చేస్తాను. ప్రజలతో మమేకమై పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ చేర్చడమే నా లక్ష్యం అని తెలిపారు. కోనసీమలో నాగిరెడ్డి నియామకంతో జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులూ అభినందనలు తెలిపారు. సేవాస్ఫూర్తికి గుర్తింపు కర్రి నాగిరెడ్డి ఇటీవలి పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజా సేవలో ముందున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన కృషి పార్టీ వర్గాల్లో విశేషంగా నిలిచింది. ఈ నియామకం పార్టీ బలోపేతానికి మరొక మైలురాయిగా భావిస్తున్నామని కార్యకర్తలు అన్నారు.

## శివ రావు గారి దివాన్ గిరి పిఠాపురం చరిత్రను తెలిపే ఒక అద్భుత రచన



**పిఠాపురం,(మనసులో మాట) నవంబరు 13:** పిఠాపురం సంస్థానంలో 18 వ శతాబ్దంలో దివానులుగా పనిచేసిన దిగవల్లి తిమ్మరాజు పంతులు, దిగవల్లి వెంకట శివరావు ల పరిపాలన, రాజ్య వైభవాలపై వారి మనవలు దిగవల్లి వెంకట చంద్రశేఖర రావు దిగవల్లి రామచంద్రరావు కలిసి ఒక గ్రంథాన్ని రూపొందిస్తున్నారు. ఈ పుస్తకానికి 'శివరావు గారి దివాన్ గిరి' అని పేరు పెట్టారు. దీనిలో రాజులు దివాన్ల మధ్య సంబంధాలు, పరిపాలన యంత్రాంగం వంటి అంశాలను వాస్తవ చారిత్రిక ఆధారాలతో వివరించనున్నారు. ఈ సందర్భంగా దిగవల్లి వెంకట చంద్రశేఖర రావు దిగవల్లి రామచంద్రరావు బుధవారం పిఠాపురం యువరాజా ని కలిసి అప్పటి రాజ్య విశేషాలపై చర్చించారు. ఈ చారిత్రక గ్రంథానికి ముందుమాట రాసేందుకు పిఠాపురం జంట కవులలో ఒకరైన దివంగత ఓలేటి పార్వతీశం మనవడు ప్రస్తుత ఓలేటి పార్వతీశం అంగీకరించినట్లు రచయితలు తెలిపారు. ఈ గ్రంథమునకు మూలాధారమైన ఆనాటి శుద్ధ ప్రాత ప్రతి లిపిలో దిగవల్లి రామచంద్రరావు దగ్గర లభ్యమయిందన్నారు. పిఠాపురం చరిత్రకు సంబంధించిన అరుదైన విషయాలను వెలుగు తీసే ఈ గ్రంథం చరిత్ర ప్రియులకు ఎంతో ఉపయోగపడుతుందని రచయితలు ఆశాభావం వ్యక్తం చేశారు. పుస్తక ప్రచురణకు సంబంధించిన పనులను వేగవంతం చేస్తున్నట్లు వారు తెలిపారు.

## వ్యాపార దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

### కోరంగి ఎస్సై సత్యనారాయణ



**తాళ్లరేవు (మనసులో మాట), నవంబరు 13:** జాతీయ రహదారి 216 చెంతన గల వ్యాపార దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరంగి ఎస్ఐ పి.సత్యన్నారాయణ సూచించారు. గురువారం మండల పరిధిలోని చొల్లంగి నుంచి జి.వేమవరం వరకు రహదారి చెంతన ఉన్న వ్యాపార దుకాణాదారుల వద్దకు వెళ్లి సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి వివరించారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలతో పాటు, వ్యాపార దుకాణాలలో జరుగుతున్న చోరీలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అవకాశం ఉన్నంత మేరకు ప్రతీ ఒక్కరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ సత్యన్నారాయణ తెలిపారు.

# ప్రతి అర్జీను పరిష్కరిస్తా.. ప్రజలకు అండగా ఉంటా

### ప్రజా దర్బార్ నిర్వహించిన మంత్రి సుభాష్



**రామచంద్రపురం(మనసులో మాట) నవంబర్ 13..** ప్రజల సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువారం రామచంద్రపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి మంత్రి సుభాష్ కు తమ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వారి నిర్దేశించి మాట్లాడుతూ ప్రజాదర్బార్లో వచ్చిన ప్రతి అర్జీను పరిశీలించి తక్షణమే సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలే పరిష్కారం లక్ష్యంగా నియోజకవర్గాలతో పాటు రాష్ట్ర కార్యాలయంలో కూడా ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజలు సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఉండవల్లి శివ, టీడీపీ రూరల్ మండలాధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, పట్టణ ఉపాధ్యక్షుడు చందమామ వాసు, కాజులూరు మండల అధ్యక్షుడు, చవ్వాకుల నారాయణమూర్తి, కే గంగవరం మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, కూటమి పార్టీ నాయకులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

## వాడపల్లి ఆలయానికి రెండు వీల్ చైర్ బహుకరణ



**ఆత్రేయపురం (మనసులో మాట) నవంబర్ 13 ..** కోనసీమ తిరుమల గా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి విజయవాడకు చెందిన పి శ్రీనివాసరావు విజయలక్ష్మి దంపతులు వృద్ధులు వికలాంగులు భక్తుల సౌకర్యార్థం ఉపయోగించుకునేందుకు రెండు వీల్ చైర్‌లను బహుకరించారు. ఆలయ చైర్మన్ ముదునూరు వెంకటరాజు దాతలకు స్వామివారి ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి చిత్రపటం చేశారు. సినీ నటుడు బెల్లంకొండ శ్రీనివాస్ వాడపల్లి ఆలయాన్ని దర్శించుకున్నరు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ప్రత్యేక దర్శనం చేయించి స్వామివారి చిత్రపటం చేశారు.

### నేర నియంత్రణయే ప్రథమ కర్తవ్యంగా

# కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



**పల్నాడు, నవంబర్ 13,(మనసులో మాట):** శాంతి భద్రతల పరిరక్షణ చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిర్మూలన నేర నియంత్రణే ప్రథమ కర్తవ్యం కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ బి కృష్ణారావు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం ఉదయం కారంపూడి పోలీస్ స్టేషన్ పరిధి పేట సన్నేగండ్ల గ్రామం నందు శాంతి భద్రతల పరిరక్షణ చర్యలలో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించి ప్రజలకు మేమున్నాము అనే భరోసా కల్పిస్తూ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నందు రౌడీ షీటర్లు,ట్రబుల్ మాంగర్స్,పాత కేసుల లోని నిందితులపై ప్రత్యేక నిఘా, ఇళ్లు, పరిసర ప్రాంతాలలో విస్తృత తనిఖీలు చేపట్టారు. గ్రామంలో సరైన పత్రాలు లేని 33 ద్విచక్ర వాహనాలు, ఘాతాల కర్రలు -2, పెద్ద కత్తులు - 2,కొడవళ్ళు-14, గొడ్డళ్లు-8,గునపాలు-6, స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఫుట్ పెట్రోలింగ్ చేస్తూ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, అనుమానితులు మరియు పాత కేసుల లోని నిందితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాత కేసుల నిందితుల తో సమావేశమై పాత పంథా కొనసాగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గ్రామంలో అకారణంగా గొడవలు సృష్టిస్తే సహించేది లేదని, వారి మీద కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురజాల డి.ఎస్పి జగదీష్,గురజాల రూరల్ సిఐ టి.వి.శ్రీనివాస రావు, మాచర్ల రూరల్ సిఐ ఎస్ కె.నఫీజ్ భాష,పిడుగురాళ్ల సీఐ వెంకట్రావు, 7 మంది ఎస్సైలు,ఏ ఎన్ ఎస్ సిబ్బంది, పోలీసు సిబ్బంది మంది పాల్గొన్నారు.

# గ్రామోద్యోగ్ వికాస్ యోజనపై అవగాహన సదస్సు




**ఆలమూరు (మనసులో మాట) నవంబర్ 13..** చేతి వృత్తి ద్వారా మహిళలు ఉపాధి పొందుతూ ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చునని ఏపీ కెవిఐసి డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్ అన్నారు. ఆలమూరు మండలం జొన్నాడ గ్రామంలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ చైర్మన్ ఏం.రాజబాబు అధ్యక్షతన గ్రామోద్యోగ్ వికాస్ యోజన పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా కెవిఐసి అసిస్టెంట్ డైరెక్టర్ రహమ్ తుల్లా, లీడ్ జిల్లా మేనేజర్ కేశవ వర్మ (యానియన్ బ్యాంకు అఫ్ ఇండియా), జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ఏపివి మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పరిశ్రమల ప్రోత్సాహం, అభివృద్ధి కొరకు గ్రామోద్యోగ్ వికాస్ యోజన పథకాన్ని అమలు చేస్తున్నారని, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ ద్వారా దేశవ్యాప్తంగా ఉమ్మడి సౌకర్యాలు, సాంకేతిక, అదునికికరణ, శిక్షణ మెదలైన వాటిని అందిస్తుందన్నారు. దీనిలో భాగంగా మహిళలకు శిక్షణ సాధనాలను అందించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పధకాన్ని అర్హులైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం కెవిఐసి నోడల్ అధికారి డి. సుబ్రమణ్యం, ఉప సర్పంచ్ ఎన్.నాగమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మర్రిపాకలో చిరుధాన్యాలు వాటి ఉత్పత్తులపై శిక్షణ



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 13..** జగ్గంపేట మండలం మర్రిపాక గ్రామంలో వ్యవసాయ శాఖ,జిల్లా మండల వనరుల కేంద్రం, పెద్దాపురం వారి ఆధ్వర్యంలో చిరుధాన్యాలు వాటి ఉత్పత్తులు పై శిక్షణ కార్యక్రమం జగ్గంపేట మండల వ్యవసాయ అధికారి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాగి సాగు చేసే విధానం తెలుసుకోవడం జరిగింది అంతేకాకుండా వరి సాగువలన ఎక్కువగా లాభం ఉండడం లేదని ఇటువంటి చిరుధాన్యాల ద్వారా ప్రస్తుతం బయట మార్కెట్లో ఎక్కువ ధర ఉండటం వల్ల రైతులకు ఇది లాభసాటిగా ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేశారు దీనిలో భాగంగా పెద్దాపురం నుండి విచ్చేసిన అసిస్టెంట్ డైరెక్టర్ గిరి మాలకొండయ్య వివరిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో చిరుధాన్యాల సాగు యొక్క ప్రాముఖ్యత మరియు సాగు చేసుకునే విషయాలను రైతులకు తెలియజేసి యున్నారు జిల్లా నుండి చేసిన ఆఫీసర్ సంజయ్ చిరుధాన్యాలతో పాటుగా వాటి యొక్క ఉత్పత్తులను ఈ విధంగా చేసుకొని మార్కెట్లో అమ్మినట్లయితే రైతులు ఏ విధంగా లాభం పొందుతారు అనే విషయాలు తెలియజేయడం జరిగింది. జగ్గంపేట సహాయ సంచాలకులు జి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు ఎప్పుడూ ఒకే పంట మీద ఆధారపడకుండా వివిధ పంటల ద్వారా లాభం అందించినట్లయితే సంవత్సరం పాటు రైతులకు లాభసాటి వ్యవసాయం చేసుకునే అవకాశం ఉందని తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ గతంలో చిరుధాన్యాలు సాగు వల్ల ఎక్కువ ఆరోగ్యకరంగా ఉండే వారిని రానురాను ఈ చిరుధాన్యాలు సాగు తగ్గించి వరి మీద ఎక్కువ ఆధారపడి ఉండవల్ల రైతులు పెట్టుబడి అయితే పెరుగుతుంది కానీ లాభసాధి వ్యవసాయం లేదని అందువలన ప్రతి రైతు సోదరులు తనకున్న పొలంలో ఒక పది సెంట్లు అయిన రాగి సాగు చేస్తున్నట్లయితే వాళ్ల కుటుంబం కోసం అయినా ధాన్యం ఉత్పత్తులు పండించుకుని ఆరోగ్యకరంగా ఉండాలని సూచించారు అంతేకాకుండా తొలకరి వస్తున్నాయి కావున రైతు సోదరులందరూ బాగా ధాన్యం ఆరబెట్టి ప్రతి రైతు సేవ కేంద్రంలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకుని ప్రభుత్వం మద్దతు ధరలకు దాన్ని అమ్మి లాభం పొందాలని తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మర్రిపాక గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ,రైతు సోదరులు పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయడం జరిగింది.



### జోయా లూకాస్ జ్యువెలరీ లో

## సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు జాబ్ మేళా - కలెక్టర్

**అమలాపురం (మనసులో మాట) నవంబరు 13:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన జోయా లుకాస్ జ్యూవెలరీ నందు సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు భర్తీ చేయుటకై ఈనెల 18 వ తేదీ మంగళ వారం స్థానిక కలెక్టరే ట్లోని వికాస కార్యాలయం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్న ట్లు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జోయా లుకాస్ జ్యూవెలరీలో సేల్స్ ఎగ్జిక్యూ టివ్స్ పోస్టుల కోసం భ ర్తీ జాబ్ మేళా జరుగుతోంద న్నారు. ఈ జాబ్ మేళాలో ఫ్రెషర్‌లు మరియు అనుభవం ఉన్న వారు రెండూ రిక్రూట్ మెంట్ల కొరకు దర ఖాస్తు చేసుకోవచ్చునన్నారు.స్థానిక పట్టణంలో నూతనంగా ప్రారంభించనున్న జోయాలుకా స్ జ్యూవెలరీ బ్రాంచ్ నందు పనిచేయు టకుగాను సేల్స్ ఎగ్జిక్యూ టివ్ పోస్టులకు 200 వరకు ఖాళీలు ఉన్నాయన్నారు. ఫ్రెషర్‌లు మరియు అనుభవ జ్ఞులు ఇద్దరూ దరఖాస్తు చేసు కొనవచ్చునన్నారు. డిగ్రీ, లేదా సమానమైన డిప్లొమా కలిగి ఉండాలన్నారు. పురుషులు, మహిళలు దరఖాస్తు చేసుకొ నవచ్చునని ఎంపిక విధానం వాక్-ఇన్ ఇంటర్వ్యూల ద్వారా జ్యూవెలరీ నేరుగా ఇంట ర్వ్యూకు హాజరు కావచ్చును న్నారు.రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా సేల్స్ ఎగ్జి క్యూటివ్ పోస్టులు నింపడం జరుగు తుందన్నారు.విద్యార్హత ధ్రువపత్రాలు ఆధార్ నేటివిటీ ఎక్స్పీరియన్స్ తదితర ధ్రువ పత్రాలు తప్పనిసరిగా తీసుకుని వచ్చి ఈనెల 18 న మంగళ వారం ఉదయం 10 గంటలకు వికాస కార్యాలయా నికి హాజరు కావాలన్నారు.నిరుపేద,చిన్న పట్టణాల అభ్యర్థులకు మంచి అవకాశమన్నారు ప్రారంభ జీతం రూ 20 వేల నుండిరూ 32వేల వరకు ఉంటుందన్నారు .వీటితో పాటుమెడికల్ బెనెఫిట్స్, పిఎఫ్ అలవెన్సెస్, ప్రమోషన్ అవకా శాల్లో మెరుగైన వాతావరణం ఉందన్నారు.ఉద్యోగం సురక్షి తంగా, అధిక వృద్ధి అవకాశా లతో ఉంటుం దన్నారు. మరిన్ని వివరాల కొరకు జోయా లుకాస్ వెబ్సైట్ నందు సంప్రదించి తెలుసుకొన వచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జి ఇ వో సేభాష్టియన్, వికాస జిల్లా మేనేజర్ జి రమేష్ పాల్గొన్నారు.

## ఘనంగా ఇంట్రాస్పోర్ట్స్ పోటీలు ప్రారంభం




**అనపర్తి (మనసులో మాట) నవంబరు 13:** స్థానిక జి.బి.ఆర్. ఇంగ్లీష్ మీడియం స్కూల్ క్రీడామైదానంలో 3 రోజులు "ఇంట్రాస్పోర్ట్స్ పోటీలు" ప్రారంభోత్సవం గురువారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని జి.బి.ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ జి. హరి ప్రసాద్, హైస్కూల్ హెచ్.ఎం.రామారావు, ప్రైమరీ హెచ్.ఎం భువనేశ్వరి, ప్రీ ప్రైమరీ హెచ్.ఎం.కామాక్షి, ఇంచార్జ్ వెంకటరెడ్డి, అకడమిక్ కో-ఆర్డినేటర్ ప్రశాంతి రెడ్డి, ఏవో ఆచారి ఆధ్వర్యంలో జరిగినది. కార్యక్రమంలో ముఖ్య అతిథి జి.బి.ఆర్. పీజీ డైరెక్టర్ బి. రత్నారెడ్డి చేతులమీదుగా క్రీడా జ్యోతి ప్రజ్వలన చేశారు. జి.బి.ఆర్ పూర్వపు జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ గొలుగూరి జగన్నాథరెడ్డి, జూనియర్ కాలేజ్ డైరెక్టర్ ఉమావెంకటరెడ్డి, నర్సింగ్ స్కూల్ డైరెక్టరు సత్యనారాయణ రెడ్డి, గేమ్స్ డైరెక్టర్ మహేంద్ర రెడ్డి పాల్గొన్నారు. ఈ పోటీలలో ముందుగా 4×100 రిలే రన్నింగ్ రేస్ అతిథులు ప్రారంభించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కబడ్డీ, కోకో, రన్నింగ్, లాంగ్ జంప్ , హైజంప్ , టగ్ ఆఫ్ వార్, త్రోబాల్ మొదలైన ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు 150 కేటగిరీలలో 1200ం బహుమతులు ఇవ్వబడతాయని నిర్వాహకులు తెలిపారు. జి.బి.ఆర్ విద్యాసంస్థల సెక్రెటరీ అండ్ కరస్పాండెంటు తేతలి ఆదిరెడ్డి (కొండబాబు) విద్యార్థినీ విద్యార్థులు క్రీడలలో బాగా రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

## సిసి రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యే నల్లమిల్లి



**అనపర్తి (మనసులో మాట) నవంబరు 13:** అనపర్తి మండలం రామవరం లో 25. 70 లక్షల రూపాయలతో నిర్మించిన మూడు సిసి రోడ్లను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం ప్రారంభించారు. అనపర్తి నుంచి రామవరం మీదుగా వెళ్లే వాహనదారులకు ఈ రోడ్డు అభివృద్ధి చేయడం ద్వారా ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణంలో చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఆయన తెలిపారు. అనపర్తి మండలం కూటమి నాయకులు రామవరం గ్రామం నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.

### మోర్త ఆనందరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన

## జగ్గంపేట వైసీపీ ఇంచార్జ్ తోట నరసింహం

**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 13..** జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం సోమవారం గ్రామంలో ఇటీవల కారు ప్రమాదంలో మృతి చెందిన మోర్త అనందరావు కుటుంబ సభ్యులును జగ్గంపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి మాజీ ఏం.పి తోట నరసింహం,రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మరియు ఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీ రాంజీ పరామర్శించడం జరిగింది.అధైర్య పడవద్దని,ఏ ఇబ్బంది వచ్చిన పార్టీ తరపున అండగా ఉంటామని,కుటుంబసభ్యులకు భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో తోట బాబ్జి, అడబాల నాగు, నూకరాజు, జగ్గంపేట నియోజకవర్గం వికలాంగుల విభాగం అధ్యక్షుడు బల్ల కామేశ్వరరావు, అంబటి కొండబాబు సోమవారం గ్రామ వైసీపీ నాయకులు పాల్గొనడం జరిగింది.





## అంగన్వాడి కేంద్రానికి దారేది..!

- ప్రైవేటు రహదారి చెంతన నిర్మాణం..
- ప్రమాదకరంగా ఉన్న గోడ
- ఫిర్యాదు చేసిన స్పందించిన అధికారులు

**తాళ్ళరేవు (మనసులో మాట), నవంబరు 13:** మండల పరిధిలోని ఇంజరం పంచాయతీలో రహదారి సౌకర్యం లేని స్థలంలో అధికారులు అంగన్వాడీ భవనాన్ని నిర్మిస్తున్నారు. స్థానిక షిర్డీసాయిబాబా వారి ఆలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడీ భవనానికి సంబంధించిన రహదారిపై వివాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఒక దాత అంగన్వాడీ భవనానికి స్థలాన్ని బహూకరించారు. అయితే ఈ భవనానికి వెళ్లేందుకు సరైన రహదారి లేదు. అధికారులు భవన నిర్మాణాన్ని ప్రారంభించి, నిధుల కొరత కారణంగా అసంపూర్తిగా నిలిపివేసారు. ఇలా ఉండగా ఇటీవల ఈ భవనానికి సంబంధించి ఉన్న ఒక చిన్నపాటి ప్రైవేటు సందును పంచాయతీ సిబ్బంది శుభ్రం చేసారు. దీనిపై పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ స్థలంలో పంచాయతీ సిబ్బంది పనులు చేయడం, కనీసం సమాచారం ఇవ్వకపోవడం పట్ల పెద్దింటి వెంకట నగేష్ అసంతృప్తి వ్యక్తం చేసారు. అంతేకాకుండా ఒక కాంట్రాక్టర్ రహదారిని నిర్మించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రహదారి సౌకర్యంలేని స్థలంలో ప్రభుత్వ భవనం ఎలా నిర్మిస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. తమ ఇంటి ప్రహరీ గోడ అనేక సంవత్సరాల క్రితం కట్టినదని, ఆ సందులో చిన్న పిల్లలను తల్లిదండ్రులు తీసుకు వెళ్లేటప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఇలా ఉండగా అంగన్వాడి కేంద్రానికి ఏవైనా వాహనాలు వస్తే ఎక్కడ నిలిపి ఉంచుతారని, మెటీరియల్ ఏ విధంగా తరలిస్తారని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అంగన్వాడీ భవనానికి సరైన రహదారి సౌకర్యం కల్పించాలని నగేష్ కోరారు. ఈ మేరకు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేదని నగేష్ విలేకర్ల వద్ద వాపోయారు.

## పిఠాపురంలో కోటి సంతకాల సేకరణ



**పిఠాపురం (మనసులో మాట) నవంబరు 13:** కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడం నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా వైసిపి నిరసనలు కొనసాగుతున్నాయి. పిఠాపురం పట్టణంలో పట్టణ వైసీపీ శ్రేణులు బుధవారం 14,17 వార్డుల నందు రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా పుల్లయ్య కాలవ,శిష్టికరణాల వీధి నందు ప్రజల నుండి ప్రైవేటు వైద్య కళాశాలకు వ్యతిరేకంగా సంతకాలు సేకరించారు. వైసీపీ నాయకులు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మండలి సభ్యుడు గండేపల్లి బాబి మాట్లాడుతూ ప్రైవేటు వైద్య కళాశాలలకు వ్యతిరేకంగా ప్రజలంతా మద్దతు తెలుపుతున్నారన్నారు. ప్రజల మద్దతుతో జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు రావుల మాధవరావు, కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పశ్చిమల్ల జ్యోతి అప్పలరాజు, పట్టణ మహిళా అధ్యక్షురాలు సామరౌతు లలితాదేవి, కౌన్సిలర్లు తలిశెట్టి వెంకటేశ్వరరావు, బొజ్జ పెద్దకాపు, బోను దేవా, నాయకులు అరిగెల రాజా, పితాని కాశీ విశ్వనాథ్, జోవహార్ ఆలీ, మోయుద్దీన్ వబ్రపు బాబి రాజాల చక్రం చోడిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలే పార్టీ కి వెన్నుముక

**- ఎమ్మెల్యే దాట్ల**

- కష్టపడిన వారికే టీడీపీ పార్టీలో సముచిత స్థానం..
- మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ బూతు కమిటీలు ప్రజాస్వామ్య బద్ధంగా పనిచేయాలి
- ప్రమాణస్వీకారంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం





**ముమ్మిడివరం (మనసులో మాట) నవంబరు 13:** టీడీపీ పార్టీ అంటేనే కార్యకర్తల పార్టీ అని, పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం ఈ పార్టీ పనిచేస్తుందని, నిస్వార్థంగా కష్టపడే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి పార్టీలో ఎల్లప్పుడూ సముచితమైన స్థానం అధిష్టానం గుర్తిస్తుందని, మరో 15 ఏళ్ళు కూటమి అధికారం లో ఉంటే ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అభివృద్ధి పథం లో ముందు ఉంటుందని రాష్ట్ర విఫ్, ముమ్మిడివరం శాసన సభ్యుడు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం ముమ్మిడివరం పరిధిలో పల్లిపాలెం లో శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపం లో ముమ్మిడివరం మండల అధ్యక్షుడు అర్దాని శ్రీనివాసరావు అధ్యక్షత న ఏర్పాటు చేసిన నూతనంగా మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ముందుగా తెలుగుదేశం పార్టీ పతకా ఆవిష్కరణ చేశారు. మరో ముఖ్య అతిథి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం మాట్లాడుతూ.. ఇటీవల టీడీపీ అధికారంలోకి రావడానికి పార్టీ అమలు చేసిన క్లస్టర్, యూనిట్, బూత్ వ్యవస్థ కీలక పాత్ర పోషించిందన్నారు. క్షేత్ర స్థాయిలో టీడీపీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఈ వ్యవస్థ చాలా బాగా పని చేసిందన్నారు. పార్టీ కోసం రోజువారీగా కష్టపడిన నిజమైన యోధులు ఇక్కడ ప్రమాణస్వీకారం చేస్తున్నారన్నారు. ఇది కేవలం పదవి కాదు, పార్టీ పట్ల వారి నిబద్ధతకు దక్కిన గౌరవమన్నారు. ఎవరికి పదవులు వచ్చినా, రాకపోయినా ఎవరూ నిరాశ పడకూడదన్నారు . పార్టీలో అందరూ సమానమేనని, రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరికీ తప్పకుండా గుర్తింపు లభిస్తుందన్నారు. మనందరి లక్ష్యం ఒకటే - రాష్ట్రాభివృద్ధి, టీడీపీ పార్టీ బలోపేతం అన్నారు. ప్రతి కార్యకర్త సహకారం పార్టీకి అత్యంత ముఖ్యమని తెలిపారు. కార్యకర్తలందరూ తమ భేదాభిప్రాయాలను పక్కన పెట్టి, రాబోయే స్థానిక ఎన్నికల కోసం సన్నద్ధం కావాలని రాజశేఖరం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రతి మండలంలో, ప్రతి గ్రామంలో, ప్రతి బూత్‌లో మన అభ్యర్థులను గెలిపించడానికి అందరూ కలసికట్టుగా, సమన్వయంతో కృషి చేయాలన్నారు. నూతనంగా ఎన్నికైన మండల, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీ సభ్యుల చేత పార్టీ నియమ నిబంధనలకు కట్టుబడి పనిచేస్తామని ప్రమాణస్వీకారం ముమ్మిడివరం ఎమ్మెల్యే సుబ్బరాజు చేయించారు. ముమ్మిడివరం నియోజకవర్గంలోని కమిటీల ప్రమాణ స్వీకారం కార్యక్రమం పల్లెపాలెం శ్రీ హరిత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ దాట్ల బుచ్చిబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై, కొత్తగా ఎన్నికైన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ముమ్మిడివరం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా కట్టా సత్తిబాబు,తాడి జానికి రామ్, ఐ. పోలవరం మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సాగిరాజు సూరిబాబు రాజు, బొంతు శ్రీరాములు, కాట్రేనికోన మండల అధ్యక్ష, కార్యదర్శులుగా చెల్లి సురేష్, ఇసుకపట్ల శివశంకర్, తాళ్లరేవు మండల అధ్యక్ష, కార్యదర్శులుగా దూళిపూడి వెంకటరమణ (బాబీ),కట్టా త్రిమూర్తులు, ముమ్మిడివరం నగర పంచాయతీ అధ్యక్ష, కార్యదర్శులుగా అర్దాని శ్రీనివాస రావు, చిక్కాల అంజిబాబు లు పది క్లస్టర్ లకు సంబందించి కన్వీనర్లు, కో-కన్వినర్ లు 20 మంది, 55 యూనిట్ లకు కన్వినర్ లు, కో-కన్వినర్ లు 110 మంది, 268 బూత్ లకు సంబందించి కన్వీనర్ లు, కో-కన్వినర్ లు 536 మంది గ్రామ కమిటీ లు, అనుబంధ సంఘాల కమిటీల సభ్యులచే ప్రమాణం చేయించారు.

ఈ కార్యక్రమంలో చెల్లి వివేకానంద,నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి,చెల్లి అశోక్, గొలకోటి. దొరబాబు, మందాల గంగ సూర్యనారాయణ, కాకర్లపూడి రాజేష్ , ఆకాశం శ్రీను, నడింపల్లి సుబ్బరాజు,దొమ్మేటి రవణ కుమార్, దాట్ల పృధ్వీ రాజ్,తాడి నరసింహారావు, దాట్లబాబు,ములపర్తి బాలకృష్ణ,గొల్లపల్లి గోపి, కడలి నాగు,ఇసుకపట్ల వెంకటేశ్వరావు, వెంట్రు సుధీర్,చింతల పూడి బాబురావు,లోకినీడు వెంకటేశ్వరావు, ధర్మారావు, టేకుమూడి లక్ష్మణరావు, పొన్నమండ రామలక్ష్మి, గొల్లపల్లి గోపి, యాళ్ల ఉదయ్ , మెండి కమల,బొక్క రుక్మిణి,వాసం శెట్టి అమ్మాజీ,మాదే యోగేశ్వరి , కుడిపూడి మల్లేశ్వరి, గోదాశి గణేష్ లతో పాటు పలువురు కార్యకర్తలు, తెలుగుదేశం అభిమానులు, కమిటీల సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### ఎంపీ సానాసతీష్ బాబు చొరవతో

# అర్హుల కళ్లలో ఆనందం



**కాకినాడ (మనసులో మాట) నవంబర్ 13..** సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా కాకినాడ ప్రజల ఆరోగ్య రక్షణలో ప్రభుత్వం అండగా ఉందనే నమ్మకాన్ని మరొకసారి చాటుతూ కాకినాడ జిల్లా కొప్పవరం గ్రామంలో గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి కింద వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసిన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేశారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు ఆదేశాల మేరకు ఆయన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లాకు చెందిన ఐదుగురు లబ్ధిదారులకు మొత్తం 9 లక్షల 91 వేల 602 రూపాయల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ చెక్కులు పంపిణీ చేశారు. వైద్య చికిత్స ఖర్చులతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు ఈ సహాయం అందడంతో అర్హుల కళ్లల్లో ఆనందం మెరిసింది. ఈ సందర్భంగా ఎమ్ పి కార్యాలయ ప్రతినిధులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా ప్రజలకు అత్యవసర వైద్య భరోసాను ఇస్తున్నారని తెలిపారు. ఎంపీ సానా సతీష్ బాబు సూచనలతో ఈ సహాయం వేగంగా లబ్ధిదారులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని వారు చెప్పారు.ప్రభుత్వం పేదల వైపు నిలబడి వైద్య అవసరాల సమయంలో అండగా ఉంటుందనే నమ్మకాన్ని సీఎం రిలీఫ్ ఫండ్ మరింత బలపరుస్తోందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాస్ (బున్ని) ఆఫీస్ ఇంచార్జ్ మేకా లక్ష్మణమూర్తి, అవసరాల హరి గింజాల శ్రీనివాస్ వెన్నపు చక్రధర్ అజయ్ బాబ్జి పాల్గొన్నారు

# ఈవీఎం ఎమ్మెల్యే డైవర్షన్ పాలిటిక్స్

- రామశర్మ మునుపు ఐపీ పెట్టిన వ్యక్తి - లోపాయికారి ఒప్పందంతో రామశర్మతో ఆరోపణలా..
- ఎవరిది మిత్ర ద్రోహం..ఎవరిది స్నేహ ధర్మం
- టీడీపీ నేతలపై వైసీపీ నేతలు మజ్జి అప్పారావు, బిల్డర్ చిన్న, పులి సాగర్ ఫైర్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** డైవర్షన్ పాలిటిక్స్ తో ప్రజల దృష్టి మరల్చడానికి ఈవీఎం ఎమ్మెల్యే యత్నిస్తున్నారని వైసీపీ నేతలు మజ్జి అప్పారావు, బిల్డర్ చిన్న, పులి సాగర్ ధ్వజమెత్తారు. గురువారం రాజమండ్రి ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ..లిక్కర్ ఆడియో వ్యవహారం, బ్లేడ్ బ్యాచ్ల వీరంగం తదితర ఫిర్యాదుల నేపథ్యంలో ప్రజల దృష్టి మరల్చేందుకు రామశర్మను ఈవీఎం ఎమ్మెల్యే ఆయుధంగా వాడుతున్నారని అన్నారు. ఈవీఎం ఎమ్మెల్యే కార్యదర్శి మణికంఠ ప్రెస్ క్లబ్ కు ఫోన్ చేసి అజ్ఞాత వ్యక్తి ప్రెస్ మీట్ అని చెప్పడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. బాల్య స్నేహితుడు అన్న ఒకే ఒక కారణంతో భరత్ అతనిని చేరతీసినందుకు..రామశర్మ మాటలు విన్నాక మిత్ర ద్రోహం అని ఎవరైనా అంటారన్నారు. ఈవీఎం ఎమ్మెల్యే అతనితో లోపాయికారి ఒప్పందం చేసుకుని18 నెలల నుంచి తప్పించుకు తిరుగుతున్న రామశర్మను వెతికి పట్టుకుని సమావేశం పెట్టించి..అవాస్తవాలు చెప్పించారన్నారు. దేవి సన్స్ శివ విషయంలో రామశర్మ మీద చెక్ బౌన్స్ కేసు నడుస్తున్న విషయం కూడా మీకు తెలియదంటే ఏమనాలని ప్రశ్నించారు. రామశర్మ వచ్చిన 18 నెలలకే అతను చేస్తున్న పనులకు భరత్ పక్కన పెట్టడం మీకు తెలియదని, కనీసం పేపర్లు చదివితే తెలిసేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండు సంవత్సరాలు అయ్యాక రామశర్మను తెరమీదకు తెచ్చి డ్రామాలు ఆడుతున్నారని, విజ్ఞులైన ప్రజలకు అన్నీ తెలుసన్నారు. విశ్వసనీయత విలువలు గురించి ఎమ్మెల్యే మాట్లాడుతున్నారు..నిజమే మా జగనన్న అధికారంలోకి వచ్చాక తొట్టతొలి ఎమ్మెల్సీ మీ తండ్రి గారే విశ్వసనీయతకు నిజమైన సాక్షి అని ఎద్దేవా చేశారు. ఇక విలువలు.. రామశర్మను తెరపైకి తెచ్చి అతనిని పావులా వాడుకోవడం మీరు చేస్తున్న రాజకీయం..ఇదే ప్రత్యక్ష సాక్ష్యం అన్నారు. మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నారని అడ్డుకుంటామన్నారు. ప్రభుత్వ ఆస్తులను అన్యాక్రాంతం చేస్తే చూస్తూ ఊరుకోబోమన్నారు. శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ వ్యాఖ్యలు ఆయన సంస్కారానికి నిదర్శనమని.. వంట మనిషి, పాలేరు అంటూ మాట్లాడటం బాధాకరమన్నారు. బడుగు బలహీన వర్గాలు మీకు లోకువా, వెనుకబడిన జాతి వాళ్ళమని హీనంగా మాట్లాడుతున్నారా అని ప్రధాని. అసలు సోము వీర్రాజు ని ఉద్దేశించి అంటే దానికి ఆయన స్పందించాలి కానీ..కందకు లేని దురద కత్తి పీటకు ఎందుకని ప్రశ్నించారు. మీ వ్యాఖ్యల ఆధారంగా అట్రాసిటీ కేసు పెడతామని పులి సాగర్ అన్నారు. మీరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా భరత్ లక్ష్యం ప్రజా సంక్షేమమని..ఇదే తమ అజెండా అని వైసీపీ నేతలు స్పష్టం చేశారు.



జగపతి నగరం లో షిర్డీ సాయి ఆలయం వద్ద

# మహా అన్నదానం

### సుమారు 10 వేల మంది భక్తులకు అన్నదానం

**కిర్లంపూడి (మనసులోమాట) నవంబరు 13..** కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామంలో వేంచేసియున్న షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద గురువారం ఆలయ కమిటీ సభ్యులు మాచపల్లి రవి,చదలవాడ బాబి,గౌతు జగన్నాధరావు,బుద్ధ సూరిబాబు,పెంటకోట నల్లబాబు,అలీషా,బొడ్డేటి అప్పారావు,తోట శేషుబాబు,గంధం బూరి,పాముల చంటి,వీరబాబు,నక్కా రమణల ఆధ్వర్యంలో గ్రామ ప్రజల సహాయ సహాకారాలతో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ముందుగా ఆలయ అర్చకులు గోవర్ధనం కృష్ణమోహన్,గోవర్ధనం అంజిబాబు బాబా వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అన్నప్రసాద నైవేద్యాన్ని నివేదించారు.ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రత్తిపాడు వైసీపీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు,జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు విచ్చేసి బాబా వారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ 32వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ షిర్డీ సాయినాధుని కృపా కటాక్షాలతో ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా విజయవంతంగా అన్నదాన కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. మహారాష్ట్ర నుండి ఒక పరమ సాధువు బాబా వారి విగ్రహాన్ని తీసికొచ్చి ప్రతిష్టించినప్పటి నుండి భక్తుల పాలిట కొంగు బంగారమై విశేష పూజలు అందుకుంటున్నారని తెలిపారు. కిర్లంపూడి, చిల్లంగి, జగపతినగరం గ్రామాలతో పాటు వివిధ గ్రామాల నుండి బాబా ప్రసాదం స్వీకరించడానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# మీ డబ్బు మీ హక్కు

### జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సిహెచ్ఎస్ వి ప్రసాద్




**కాకినాడ ( మనసులో మాట) నవంబర్ 13..** మీ డబ్బు -మీ హకు నినాదంతో భారతప్రభుత్వం, రిజర్వే బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది అక్టోబరు నుంచి డిసెంబర్ వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తుందని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ సీహెచ్ఎస్వీ ప్రసాద్ గురువారము ఒక ప్రకటన లో తెలిపారు. వివిధ కారణాల చేత బ్యాంకు ఖాతాల్లో ఉండిపోయిన సొమ్మును తిరిగి పొందేందుకు భారత ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో ఆర్బీఐ జనరల్ మేనేజర్ మార్గనిర్దేశం మేరకు ఈ నెల 14న కాకినాడ లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కాకినాడ పట్టణం తిలక్ స్ట్రీట్ లో గల యూనియన్ బ్యాయ ఆఫ్ ఇండమా శాఖలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమం ద్వారా పది ఏళు ,, అంతకు మించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును బ్యాంకులు అర్హులైన బ్యాంకు ఖాతాధారులకు తిరిగి ఇచ్చేయడం ఇచ్చేయడం జరుగుతుందన్నారు. ఖాతాదారుని మరణం, చిరునామా మార్పు లేదా నామినీ వివరాలలో లోపాలు, మర్చిపోవడం అంటే కారణాలతో కొన్ని ఖాతాలోని డబ్బులు లబ్ధిదారులు చేరడ లేదన్నారు. వీటికి సంబంధించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు సరైన ధృవపత్రాలతో ఈకేవైసీ పూర్తి చేసి తమ సొమ్మును తిరిగి పొందవచ్చున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని ఎల్డీఎం కోరారు.

### మోర్త ఆనందరావు కుటుంబ సభ్యులను

# పరామర్శించిన తోట నరసింహం



**జగ్గంపేట (మనసులోమాట) నవంబరు 13..** జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం సోమవారం గ్రామంలో ఇటీవల కారు ప్రమాదంలో మృతి చెందిన మోర్త అనందరావు కుటుంబ సభ్యులును జగ్గంపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ మంత్రి మాజీ ఏం.పి తోట నరసింహం,రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మరియు ఉభయగోదావరి జిల్లాల విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ తోట శ్రీ రాంజీ పరామర్శించడం జరిగింది.అధైర్య పడవద్దని,ఏ ఇబ్బంది వచ్చిన పార్టీ తరపున అండగా ఉంటామని,కుటుంబసభ్యులకు భరోసా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో తోట బాబ్జి,అడబాల నాగు,నూకరాజు,జగ్గంపేట నియోజకవర్గం వికలాంగుల విభాగం అధ్యక్షుడు బల్ల కామేశ్వరరావు, అంబటి కొండబాబు సోమవారం గ్రామ వైసీపీ నాయకులు పాల్గొనడం జరిగింది.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



### గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ట్రక్కు మాయం...
## సిబ్బంది పని తీరు పై
# గ్రామస్తులు ఆగ్రహం

**కపిలేశ్వరపురం (మనసులో మాట) నవంబర్ 13..** డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ ట్రక్కు మాయం అయింది. గ్రామంలో రోడ్లు తడిపేందుకు, అలాగే డ్రైనేజీ లో పేరుకుపోయిన శిల్ట్ తీయడానికి, గతంలో ట్యాంక్ నిర్మాణం తో కూడిన ట్రక్కును గ్రామంలో ఉపయోగించేవారు. గత కొంత కాలం నుండి ఈ ట్రక్కు దుర్గమ్మ గుడి వీధిలోని వాటర్ ట్యాంక్ వద్ద ఉన్న కాళీ స్థలంలో దీనిని ఉంచారు. గ్రామంలో కొంత మంది వారి స్వప్రయోజనాలకు కూడా ఈ ట్రక్కునే ఉపయోగించుకునేవారు. ట్రక్కు మాయమై సుమారు 4 మాసాలైన ఇక్కడ లేదనే విషయాన్ని పంచాయతీ సిబ్బందికి తెలియకపోవడం శోచనీయం. ప్రజా ధనముతో లక్షల రూపాయలు ఖర్చు పెట్టి గ్రామ ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి వస్తువులు మాయమవుతున్నా పంచాయతీ అధికారులు కళ్ళుమూసుకుని వ్యవహరిస్తున్న తీరు దారుణంగా కనిపిస్తోంది. రెండు రోజుల క్రితం ఈ విషయం కార్యదర్శి రాయుడు మోహన్ దృష్టికి రావడం తో అంగర పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు అయన గురువారం విలేకరులకు తెలిపారు. గతంలో ఈ పంచాయతీలో పని చేసిన కార్యదర్శులు రికార్డులు పూర్తి స్థాయిలో అప్పగించడం లేదని తెలుస్తోంది. అంతే కాకుండా కార్యాలయానికి సంబంధించిన ఫర్నిచర్ కూడా గల్లంతైనట్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నత అధికారులు దృష్టి పెట్టి పంచాయతి ఆస్తులను కాపాడేలా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# రాష్ట్రంలోనే అగ్రస్థానం
### నమో యాప్ లో కంబాల రికార్డు



**గోకవరం (మనసులో మాట), నవంబర్ 13 :** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రతి నెల నాలుగో ఆదివారం మన్ కి బాత్ కార్యక్రమం ద్వారా ప్రజలకు అనేక సందేశాలను అందించి, నమో యాప్ ద్వారా ప్రజలకు మన దేశానికి చేరవేస్తున్నారని అన్నారు. గురువారం మండల కేంద్రమైన గోకవరంలోని తంటికొండ రోడ్ లో స్థానిక సీఎండీ లే అవుట్ కార్యాలయం వద్ద నిర్వహించిన మీడియా సమావేశంలో రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నమో యాప్ లో రెండు లక్షలు పైగా పాయింట్లు సాధించి ఏపీ నుంచి మొదటి స్థానంలో ఉన్నట్లు వెల్లడించారు. అలాగే లీడర్ స్కోర్ లో బ్లూ బ్యాడ్జి కలిగిన వ్యక్తిగా నిలవడం జరిగిందన్నారు. స్వదేశీ వస్తువుల్ని వాడాలని, కేంద్ర పథకాల గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం నమో యాప్ లో రెండు లక్షలు పాయింట్లు సాధించిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.


## సీఐఐ సమ్మిట్ లో పిఠాపురం నుంచి ప్రాతినిధ్యం



**పిఠాపురం, ( మనసులో మాట) నవంబరు 13 :** విశాఖపట్నంలో భారీ స్థాయిలో నిర్వహిస్తున్న సిఐఐ పార్ట్నర్షిప్ సమ్మె 2025లో పిఠాపురం నియోజక వర్గానికి పెట్టుబడులును ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నుంచి జనసేన నాయకుడు, గోదావరి తూర్పు ప్రాంత డెల్టా చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ ఈ సమావేశానికి హాజరుకానున్నట్లు ఒక ప్రత్యేక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సంయుక్తంగా నవంబర్ 14,15వ తేదీలలో విశాఖపట్నం లో పార్ట్నర్షిప్ సమ్మిట్ ను నిర్వహిస్తున్నాయి. ఈ సదస్సులో దేశ,విదేశీ పారిశ్రామికవేత్తలు పెట్టుబడుదారులు పాల్గొనున్నారు. సునీల్ కుమార్ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గం లో పెట్టుబడలకి ఉన్న అపార అవకాశాలను అంతర్జాతీయ పెట్టుబడిదారులకు వివరించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పర్యాటక అభివృద్ధి, సముద్ర తీర ప్రాంతంలో పెట్టుబడులు, ఎగుమతులు దిగుమతులు, పోర్టు సౌకర్యాలు చేనేత వస్త్రాలు, సీ ఫుడ్ పిఠాపురంలో గల ప్రసిద్ధ దేవాలయాల పర్యాటక అభివృద్ధి, ఈ కార్యక్రమంలో సమ్మిట్ లో వివిధ విభాగాలకు చెందిన కంపెనీలు ప్రతినిధులతో సమావేశమై పిఠాపురం ప్రత్యేకతలను వివరించి పెట్టుబడులకు గల మార్గాలన్నింటిని అంతర్జాతీయ జాతీయ వ్యాపారస్తులకు వివరిస్తానని తెలిపారు

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ
### 14 మంది లబ్ధిదారులకు రూ.12,65,349 విలువైన చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే గోరంట్ల





**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** పేద మధ్యతరగతి కుటుంబాల్లో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో వెలుగులు నింపుతోందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 14 మంది లబ్ధిదారులకు రూ.12,65,349లు విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ "ఎన్టీఆర్ వైద్య సేవలో లేని అనేక చికిత్సలకు లక్షల రూపాయలు ఖర్చు చేసి అప్పుల బారిన పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఆశాకిరణంగా మారింది. రాష్ట్రంలో ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ, ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.25 లక్షల వరకు వైద్య బీమా పథకాన్ని ప్రవేశపెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది" అని తెలిపారు. గత 17 నెలల కాలంలో రూరల్ నియోజక వర్గం పరిధిలో రూ. 2,69,42,532లు సీఎం సహాయ నిధి కింద సహాయం అందజేశామని గోరంట్ల తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన డైరెక్టర్ పందూరి అప్పారావు, ఏపీఐఐసీ డైరెక్టర్ మార్గాని సత్యనారాయణ, కురుకూరి కిషోర్, బొప్పన నానాజీ, పెంద్యాల రామకృష్ణ, పితాని శివరామకృష్ణ, వట్టికూటి దత్తుడు, పాతంశెట్టి రాంజీ, దండమూడి తేజ, తాడేపల్లి నాగరాజు, దొడ్డి బాబ్జి, చలమూరి సత్యనారాయణ, సింగవరపు సత్యనారాయణ, కొప్పిశెట్టి చిన్ని, గారపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మీడియా అక్రెడిటేషన్ దరఖాస్తులు
# ఆన్‌లైన్‌లో సమర్పించండి

- నిర్ణీత పత్రాలు రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ, విజయవాడలోని సంచాలకులకు అందజేయాలి
- జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కే లక్ష్మీ నారాయణ

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మీడియా అక్రెడిటేషన్ నియమావళి, 2025"ను అమల్లోకి తీసుకువచ్చినట్లు జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కే లక్ష్మీ నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పారదర్శకంగా మీడియా అక్రెడిటేషన్లు జారీ చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి, అవసరమైన ధ్రువపత్రాలను రాష్ట్ర కార్యాలయానికి సమర్పించాల్సిందిగా ఆయన సూచించారు. రాష్ట్ర సమాచార, ప్రజా సంబంధాల శాఖ మంత్రి ఈ నెల 10న మీడియా అక్రెడిటేషన్ ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించారన్నారు. ఈ పోర్టల్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న అర్హత కలిగిన జర్నలిస్టులు, మీడియా సంస్థలు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని తెలిపారు. ఇందు నిమిత్తం సంచాలకులు, రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ (విజయవాడ) ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల ఎడిటర్లు, బ్యూరో చీఫ్‌లకు ఈ మేరకు లేఖలు జారీ చేశారు.

మీడియా సంస్థలు తమ సంస్థకు సంబంధించిన పత్రాలను నిర్ణీత నమూనాలో పెన్ డ్రైవ్‌లో వేర్వేరుగా స్కాన్ చేసి, ప్రతి ఫైలుకు స్పష్టమైన పేర్లు ఇవ్వడం ద్వారా సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. అదే విధంగా, పత్రాల హార్డ్‌కాపీలు, స్కాన్ కాపీలు రెండూ విజయవాడలోని సంచాలకులు, రాష్ట్ర సమాచార -పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయం (మీడియా రిలేషన్స్ విభాగం) వద్ద సమర్పించవలసిందిగా తెలిపారు. మీడియా సంస్థలు సమర్పించిన పత్రాలు ఆమోదం పొందిన తర్వాత, ఆ సంస్థకు చెందిన జర్నలిస్టులు తమ వ్యక్తిగత అక్రెడిటేషన్ దరఖాస్తులను ఆన్ లైన్ ద్వారా సమర్పించవలసి ఉంటుందని వివరించారు. దీని వలన పత్రాల పునరావృత సమర్పణ అవసరం లేకుండా పరిశీలన వేగవంతం అవుతుందని తెలిపారు.

తదుపరి దశలో, జర్నలిస్టులు, మీడియా సంస్థలు ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్‌లో అందుబాటులో ఉన్న మీడియా అక్రెడిటేషన్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి తెలిపారు. సదరు ఆన్లైన్ లో అప్లోడ్ చేసిన పత్రాలు ప్రింట్ చేసిన హార్డ్ కాపీలను జిల్లా కేంద్రం లోని కార్యాలయానికి వ్యక్తిగతంగా అందజేయవలసి ఉంటుందన్నారు.

**మీడియా సంస్థలు సమర్పించవలసిన పత్రాలు..**

**న్యూస్ పేపర్లు / పత్రికల కోసం..**

భారత ప్రెస్ రిజిస్ట్రార్ జనరల్ (పీఆర్జీఐ) రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, అలాగే ఏబీసీ / పీఆర్జీఐ అప్రూవ్డ్ చార్టర్డ్ అకౌంటెంట్ సర్టిఫికెట్ (సర్టిఫైడ్ సర్క్యులేషన్ వివరాలతో), పీఆర్జీఐకి సమర్పించిన తాజా వార్షిక రిటర్న్ కాపీ, ప్రచురణకర్త సర్టిఫికెట్ (ప్రింట్, అమ్మకాల వివరాలతో).., పాన్ కార్డు, గత 2 సంవత్సరాల ఆదాయపు పన్ను రిటర్నులు.

**శాటిలైట్ న్యూస్ ఛానెల్స్ కోసం..**

భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ జారీ చేసిన లైసెన్స్-అనుమతి పత్రం, సమాచార- ప్రజా సంబంధాల శాఖ నుండి జారీ అయిన ఎంపానెల్‌మెంట్- రేట్ కార్డ్ ప్రతులు. సమాచార- ప్రసార మంత్రిత్వ శాఖకు సమర్పించిన తాజా వార్షిక రిటర్న్ కాపీ.

### పిఠాపురం రాజకీయాలు మర్రెడ్డి, వర్మల సన్నిహిత సంబంధాలపై
# సామాజిక మాధ్యమాలలో చర్చ





**పిఠాపురం, మనసులో మాట నవంబరు 13:** జనసేన పార్టీ పిఠాపురం ఇన్చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ స్థానిక తెలుగు దేశం పార్టీ ఇన్చార్జి ఎస్ వి ఎస్ ఎన్ వర్మతో సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారన్న వార్త నియోజకవర్గంలో తీవ్ర చర్చనియాంశంగా మారింది.

ఇటీవల కాలంలో మర్రెడ్డి శ్రీనివాసరావు వర్మలు సన్నిహితంగా మెలుగుతుండడం ఈ చర్చలకు దారి తీసింది. ఈ పరిణామాలు పిఠాపురం జనసేనలో అంతర్గత కలహాలకు దారి తీయవచ్చునని పిఠాపురం రాజకీయాలపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం అవుతుంది. మర్రెడ్డి వర్మ ల కలయికపై జనసేన అధినాయకత్వం ఎలా స్పందిస్తుందో పిఠాపురం రాజకీయాలు ఏమలుపు తిరుగుతాయో వేచి చూడాలి. పిఠాపురం జనసేన ఇన్చార్జి మర్రెడ్డి, తెలుగుదేశం శ్రేణులతో కలిసి కాకినాడలో వర్మ ఇంటిలో భోజనం చేస్తున్న ఫోటో సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతుంది. మర్రెడ్డి శ్రీనివాస్ తనపై అంతర్గతంగా జరుగుతున్న కుట్రలను తిప్పుకొట్టేందుకు వర్మతో సాన్నిహిత్యం గా మెలుగుతున్నారా? లేదా మరి ఏదైనా రాజకీయ కోణం ఉందా? అనేది తెలియాల్సి ఉంది.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలను
# రైతులు సద్వినియోగం చేసుకోవాలి
### - ఏవో నాగం సుధా మాధురి -



**కిర్లంపూడి (మనసులోమాట) నవంబరు 13..** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి పిలుపునిచ్చారు. గురువారం కిర్లంపూడి మండలం ముక్కోల్లు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో నాగం సుధామాధురి మాట్లాడుతూ ప్రస్తుతం కోతలు అవుతున్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి రైతులకు వివరించారు. కిర్లంపూడి మండలంలో మొత్తం 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, రైతులందరూ తమ ధాన్యాన్ని రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు తెచ్చిన ధాన్యానికి 17 తేమ శాతం ఉండేలా చూసుకోవాలని ఆమె సూచించారు. సాధారణ రకములు 75 కేజీలకు 1777 రూపాయలు, గ్రేడ్ ఏ రకమునకు 75 కేజీలకు 1792 ధర నిర్ణయించడం జరిగిందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ఆకుల సురేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు దేవి, పలువురు రైతులు పాల్గొన్నారు.



### కణుపూరు సాయిబాబా ఆలయం
# అన్నసమారాధన లో కంబాల
### అన్న సమారాధన కార్యక్రమానికి 300 కిలోల బియ్యం, 50 వేలు రూపాయలు విరాళం

**గోకవరం (మనసులో మాట), నవంబర్ 13 :** కోరుకొండ మండలం కణుపూరు గ్రామంలోని సాయిబాబా ఆలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తొలిత ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, మహిళలు బాణసంచా కాల్పులతో, పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికి, శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. ఆలయలో స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని, భక్తులకు తీర్థ ప్రసాదాలు వడ్డించారు. అన్న సమారాధన కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు 300 కిలోల బియ్యం, 50 వేలు రూపాయలు విరాళంగా అందజేశారు. గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకారం అందిస్తానని అన్నారు.

**ఆ గర్భిణి కి అండగా కంబాల..**

గ్రామానికి చెందిన ఓ యువతిని పెళ్లి చేసుకుని, ఆమె భర్త గర్భిణిగా ఉన్న ఆమెను వదిలి వెళ్లిపోయాడు. ఆమె పరిస్థితిని చూసి చలించి పోయిన కంబాల శ్రీనివాసరావు ఖర్చులకు ఆమెకు 2,000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి, డెలివరీ అయ్యేంతవరకు వైద్య ఖర్చులు తానే భరిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు

### సగర వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా
# మొగిలి అప్పారావు నియామకం
### జనసేన నాయకులు, గ్రామస్తులు ఘన సన్మానం



**గొల్లప్రోలు (మనసులో మాట) నవంబరు 13:** గొల్లప్రోలు మండల పరిధి చిన్న జగ్గంపేట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సగర వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన మొగిలి అప్పారావుకు బుధవారం గ్రామస్తులు ఘన సన్మానం అందించారు. పూలమాలలు, శాలువాలతో గ్రామ పెద్దలు, యువకులు, మహిళాలు పెద్ద ఎత్తున కలిసి ఆయనను ఆత్మీయంగా సత్కరించి తమ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మొగిలి అప్పారావు మాట్లాడుతూ... ఇంత గౌరవమైన పదవిని నాపై నమ్మకంతో అప్పగించిన కూటమి ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ బాధ్యత నా గ్రామం, నా నియోజకవర్గం మాత్రమే కాదు, మొత్తం సగర కమ్యూనిటీ అభివృద్ధికి అంకితం చేయడానికి అవకాశం లభించిందని,ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానుఅని తెలిపారు.అలాగే తమ నియామకానికి తోడ్పడిన నాయకులు, సంఘాల ప్రతినిధులు, మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.నా మీద నమ్మకం ఉంచిన ప్రతి ఒక్కరి అభిలాషలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని, సగర సమాజ అభివృద్ధికి ప్రత్యేక పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, యువతకు శిక్షణ అవకాశాలు, మహిళల సాధికారత వంటి అంశాలలో త్వరలోనే ప్రత్యేక కార్యక్రమాలు ప్రారంభిస్తాం అని తెలిపారు.

గ్రామస్తులు మాట్లాడుతూ... మొగిలి అప్పారావు వంటి సేవాభావం ఉన్న వ్యక్తి డైరెక్టర్‌గా నియమితులవడం తమ గ్రామానికి గొప్ప గౌరవమని, సగర కమ్యూనిటీ అభివృద్ధికి ఇది ఎంతో ప్రయోజనకరమని ఆనందం వ్యక్తం చేశారు.ఈ సత్కార కార్యక్రమంలో జనసేన నాయకులు, , కూటమి నాయకులు, గ్రామ యువత, గ్రామ పెద్దలు,బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### దశలవారీ ఉద్యమంతో జీతాలు పెంచుకున్న
# జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్

**కాకినాడ (మనసులో మాట), నవంబర్ 13:** సిఐటియు ఆధ్వర్యంలో దశల వారీగా ఉద్యమం నిర్వహించి జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ జీతాలు పెంచుకున్న సందర్భంగా సిఐటియు నాయకులు కార్మికులకు జేజేలు పలికారు.కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో 2025 అక్టోబర్ 1 నుండి శానిటేషన్ నిర్వహణ కొరకు క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ లిమిటెడ్ అనే సంస్థ కాంట్రాక్టు పొందినది. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ నెలలోనే కార్మికుల జీతాలు ఇతర సౌకర్యాలు గురించి చర్చలు జరిపి ఒప్పందం చేసుకోవాలని సిఐటియు అనుబంధ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులకు రాతపూర్వక నోటీసు ఇచ్చారు. అక్టోబర్ 16వ తేదీ నుండి పలు దఫాలు చర్చలు జరిగిన తరువాత కూడా జీతాలు పెంపుదల విషయంలో కాంట్రాక్ట్ సంస్థ ముందుకు రాకపోవడంతో కార్మికులు గత 10 రోజులుగా విధులు నిర్వహిస్తూ ఆందోళన చేపట్టారు. బుధవారం ఆందోళన తీవ్రతరం చేసిన నేపథ్యంలో కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ కమిటీ సభ్యులకు సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన చర్చలు ఫలప్రదంగా ముగిసాయి. శానిటేషన్ వర్కర్స్ ప్రస్తుతం అందుకుంటున్న జీతమునకు అదనంగా 1260 రూపాయలు చెల్లించడానికి ఒప్పందం కుదిరింది. పిఎఫ్, ఈఎస్ఐ చట్టప్రకారం చెల్లించాలని, క్యాజువల్ సెలవులు, ఇతర డిమాండ్స్లు కూడా రాతపూర్వక ఒప్పందం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఉద్యమంలో పాల్గొన్న కార్మికులకు సిఐటియు నాయకులు జేజేలు పలికారు. జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ ఉద్యమానికి సంఘీభావం తెలిపిన జిజిహెచ్ మెస్ వర్కర్స్ యూనియన్, సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్లు మరియు పరోక్షంగా సహకరించిన వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులకు సిఐటియు తరఫున పలివెల వీరబాబు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ చర్చ సమావేశం లో సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకటరమణలతోపాటు శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్ విజయకుమార్, జె లక్ష్మీ ప్రియ, ఆర్ రమేష్, ఎస్ వాసు, దళాయి దుర్గాప్రసాద్, జి రవిబాబు, బి కృష్ణవేణి, ఎం కుమారి, బి మంగతాయారు, ఎం రవి శంకర్, ఎం ఏసు, జె రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



## ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్ బ్రిడ్జ్ కోర్సు ప్రారంభం

**- వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఆధ్వర్యంలో "ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్" బ్రిడ్జ కోర్సు నిర్వహిస్తున్నారని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ తెలిపారు. గురువారం దీనికి సంబంధించిన బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలు తెలియజేశారు. విశ్వ విద్యాలయంలో రెండవ సంవత్సరం విద్యార్థులందరికీ "ప్రాబబిలిటీ - స్టాటిస్టిక్స్" అనే శీర్షికతో గణితంలో ఒక బ్రిడ్జ్ కోర్సును నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ నెల 14 నుండి 25వ తేదీ వరకు సాయంత్రం 4:30 నుండి 6:30 వరకు తరగతులు నిర్వహిస్తారన్నారు. ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఇది పీజీ ప్రోగ్రామ్‌లను బాగా అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని తెలిపారు. దీనిని పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీ హైమావతి, విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

## సాంకేతిక పురోగతి పై పట్టు సాధించాలి

**-వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** సాంకేతికతలో ఇటీవల పురోగతిపై యువతరం పట్టు సాధించాలని, తద్వారా చక్కని ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో "రీసెంట్ అడ్వాన్స్మెంట్ ఇన్ మోడరన్ ఎనలిటికల్ టెక్నాలజీ" అనే అంశంపై ఒక రోజు వర్క్ షాప్ ను నిర్వహించారు. గురువారం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో పెర్కిన్ ఎల్మెర్ సహకారంతో నిర్వహించిన ఈ వర్క్ షాప్ కు ముఖ్య అతిథులుగా వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ హాజరై ఉపన్యసించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యు.ఎస్.ఏ. లోని పెర్కిన్ ఎల్మెర్ విశ్లేషణాత్మక పరికరాలు, రోగ నిర్ధారణ, జీవ శాస్త్రాలు, పర్యావరణ పర్యవేక్షణలో ఆవిష్కరణలకు అంకితమైన ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన శాస్త్రీయ సాంకేతిక సంస్థ అని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయంలో శాస్త్రీయ పరిశోధన- విశ్లేషణాత్మక ఆవిష్కరణల పురోగతికి పెర్కిన్‌ఎల్మర్ చేసిన సహకారాన్ని అభినందిస్తున్నామన్నారు. వారి అత్యాధునిక సాధనాలు, సాంకేతికతలు లెక్కలేనన్ని పరిశోధకులను రసాయన, జీవ -పర్యావరణ శాస్త్రాలలో రాణించడానికి శక్తివంతం చేస్తాయని చెప్పారు. ఈ విద్యా-పరిశ్రమ సహకారం ద్వారా విశ్వ విద్యాలయం శాస్త్రీయ శిక్షణను బలోపేతం చేయడానికి, అంతర్ విభాగ పరిశోధనలను ప్రోత్సహించడానికి, ప్రపంచ సాంకేతిక సవాళ్లను ఎదుర్కోవడానికి విద్యార్థులను సిద్ధం చేయడానికి ఉపయోగపడుతుందన్నారు. పెర్కిన్‌ఎల్మెర్‌తో కలిసి సామాజిక పురోగతి కోసం విద్య, పరిశోధనలను ముందుకు తీసుకెళ్లాలనే దార్శనికతకు అనుగుణంగా ఆవిష్కరణ, స్థిరత్వం మరియు శ్రేష్ఠత యొక్క సంస్కృతిని నిర్మించాలని ఆకాంక్షించారు. పెర్కిన్ ఎల్మెర్ రిజినల్ సేల్స్ మేనేజర్ అచ్యుతరావు ఆర్ మాట్లాడుతూ 1937 లో స్థాపించబడిన ఈ పెర్కిన్‌ఎల్మెర్ సంస్థ ఎనిమిది దశాబ్దాలకు పైగా శాస్త్రీయ ఆవిష్కరణ, సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడంలో ముందంజలో ఉందన్నారు. ఈ కంపెనీ స్పెక్ట్రోస్కోపీ, క్రోమాటోగ్రఫీ, థర్మల్ అనాలిసిస్, మాలిక్యులర్ బయాలజీలో అత్యాధునిక పరిష్కారాలను అందిస్తుందని తెలిపారు. పెర్కిన్ ఎల్మర్ నిబద్ధత దానిని విద్యారంగంలో, పరిశ్రమలో విశ్వసనీయ భాగస్వామిగా మార్చిందన్నారు. అనంతరం అతిథులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఆచార్య బీ జగన్మోహన్ రెడ్డి, పెర్కిన్ ఎల్మెర్ రిజినల్ సేల్స్ మేనేజర్ అచ్యుతరావు ఆర్, అప్లికేషన్ అండ్ ప్రొడెక్ట్ సైంటిస్ట్ డాక్టర్ రవీంద్ర మల్లవరపు, రోహన్ శశికాంత్ ఎన్, డాక్టర్ ఆకాష్ కుమార్ సాహు, సతీష్ రావూరి, అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.



# పెట్టుబడుల హబ్‌గా రాష్ట్రం

**- నాడు జగన్ పరిశ్రమలను తరిమికొట్టాడు - నేడు చంద్రబాబుపై నమ్మకంతో తిరిగొస్తున్నాయి - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**

**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** పెట్టుబడుల హబ్‌గా మన రాష్ట్రం నిలుస్తోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఐదేళ్ల తర్వాత మళ్లీ రాష్ట్రంలో రీన్యూ పవర్ పెట్టుబడులు పెడుతోందని, రీన్యూ పవర్ రూ.82 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైనట్లు ప్రకటించడమే అందుకు నిదర్శనమన్నారు. కాగా.. 2019లో అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వం.. వచ్చీ రావడంతోనే పీపీఏలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుందని, దీనితో నాడు రెన్యూ ఎనర్జీ సంస్థ.. పీపీఏల రద్దు దుమారంతో రాష్ట్రానికి గుడ్ బై చెప్పేసిందన్నారు. టీడీపీ ప్రభుత్వం కుదుర్చుకున్న పీపీఏ ఒప్పందాలను కక్ష పూరితంగా, కుట్ర పూరితంగా నాడు జగన్ ప్రభుత్వం రద్దు చేసి రాష్ట్రం నుంచి పారిశ్రామిక వేత్తలను వెళ్లగొట్టేలా జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. పీపీఏల రద్దు వ్యవహారం నుంచే రాష్ట్రం ఇమేజ్ నాడు జాతీయంగా, అంతర్జాతీయంగా డామేజ్ అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. పీపీఏల రద్దు



విషయంలో నాడు జగన్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు సరికాదని... ఇదే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం చెప్పినా, హెచ్చరించినా పట్టించుకోని పరిస్థితి అన్నారు. అమర్ రాజా బ్యాటరీస్, కియా అనుబంద సంస్థలు, జాకీ, ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, లులూ, బిఆర్‌షెట్టి గ్రూప్, ట్రైటాన్ ఎలక్ట్రానిక్స్, వంటి పరిశ్రమలతో పాటు ఫార్చ్యూన్ వంటి 500 కంపెనీలను కూడా జగన్ బలవంతంగా పక్క రాష్ట్రాలకు తరిమేశారని మండిపడ్డారు. అలా నాడు వెళ్ళిపోయిన సంస్థను మళ్లీ కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి వచ్చేలా చేయడంతో పారిశ్రామిక వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోందన్నారు. నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని పారిశ్రామికీకరణ వైపు అడుగులు వేయిస్తున్నారని, అంతర్జాతీయంగా సీబీఎన్ అంటే ఒక బ్రాండ్ అని.. ఆయన సీఎంగా ఉన్నారంటే పారిశ్రామికవేత్తలకు ఒక నమ్మకం, గౌరవమని చెప్పుకొవచ్చన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన 16 నెలల్లోనే రూ.11.2 లక్షల కోట్ల పెట్టుబడులు రావడంతో 9.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయన్నారు. ప్రతి ఇంటికి ఒక పారిశ్రామికవేత్త లక్ష్యంతో చంద్రబాబు, లోకేష్ పని చేస్తున్నారని వెల్లడించారు. ఏపీ ఇండస్ట్రియల్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎంఎస్ ఎంఈ పాలసీ, ఏపీ ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్స్ పాలసీలతో పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోందని, రాష్ట్రం నుంచి జగన్ వల్ల నాడు వెళ్లిపోయిన పరిశ్రమలు తిరిగి వస్తుండడంతో బ్రాండ్ ఏపీ తిరిగి నిలబడిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు.

# పదవి అలంకారం కాదు.. ఒక బాధ్యత

**- ప్రజాసేవ లక్ష్యంగా ముందుకు సాగాలి**

**- అన్న ఎన్టీఆర్ ఆశయాలు.. సీఎం చంద్రబాబు స్ఫూర్తి మన లక్ష్యం**

**- రామచంద్రపురం నియోజకవర్గ మండల, క్లస్టర్, యూనిట్, డివిజన్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి సుభాష్**





**రామచంద్రపురం (మనసులో మాట) నవంబర్ 13**

పదవి ఒక అలంకారం కాదని.. దాన్ని బాధ్యతగా తీసుకుని తెలుగుదేశం పార్టీ ఆశయాలకు, పవిత్ర లక్ష్యాలకు, ప్రజాసేవా భావంతో క్రమశిక్షణతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. లయిన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో గురువారం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గం మండల, క్లస్టర్, యూనిట్, డివిజన్, బూత్ కమిటీల చేత ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రతిష్టను పరిరక్షించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త నిరంతరం కష్టపడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. నిత్య చైతన్యంతో పార్టీ భవిష్యత్తు కోసం కష్టపడిన వారికి తగిన విధంగా గుర్తింపు ఇస్తామన్నారు. పార్టీ బలం కార్యకర్తలేనని, గత పాలకులు ఎన్ని బెదిరింపులకు దౌర్జన్యాలకు గురిచేసినా కష్టసుఖాలను ఎదుర్కొని పార్టీ కోసం నిరంతరం శ్రమించిన కార్యకర్తలను తెలుగుదేశం పార్టీ గుర్తింపు ఇచ్చి ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. గడిచిన 17 నెలల కాలంలో నియోజవర్గాన్ని 140 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. సుమారు 40 జాబ్ మేళాలు నిర్వహించి వేలాది మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. రానున్న పుష్కరాలకు సుమారు రూ 150 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపమన్నారు. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజల సంక్షేమం దిశగా దూసుకుపోతుందన్నారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని, కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. అలాగే మహిళలకు కూడా తగు ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. ప్రతివారం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. నియోజకవర్గంలో ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని త్వరలో ఒక బస్సును ఏర్పాటు చేసి వారికి అన్ని రకాల వైద్య సేవలు అందేలా కషి చేస్తున్నామన్నారు. సభాధ్యక్షులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు తీసుకున్న మండల అధ్యక్షులు, అన్ని విభాగాల వారు ఐక్యంగా అందరినీ కలుపుకుని ముందుకు సాగాలన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ గ్రామాల్లో ఏకగ్రీవం అయ్యేలా కషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ గౌరవం కల్పిస్తుందని, నిస్వార్థంగా, దీక్ష దక్షతలతో, అంకితభావంతో, పని చేసే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీ అన్నారు. నియోజకవర్గ పరిశీలికులు కాకినాడ రామారావు, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు పెంకే సాంబశివరావులు మాట్లాడుతూ పండగ వాతావరణంలో నియోజకవర్గం మండల, క్లస్టర్, యూనిట్,బూత్ డివిజన్ కమిటీ చేత ప్రమాణస్వీకారం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం ముందు స్థానిక వెల్ల బ్రిడ్జి వద్ద నుంచి మంత్రి సుభాష్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా లయన్స్ క్లబ్ కళ్యాణ మండపం వరకు కొనసాగింది. అనంతరం తెలుగుదేశం పార్టీ జెండాను మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. ఆయా మండలాలకు ఎన్నికైన అధ్యక్షులకు భవిష్యత్తులో తీసుకోవాల్సిన కర్తవ్యాలపై నిర్దేశించారు. అనంతరం కేక కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, పార్లమెంట్ కోఆర్డినేటర్ పలివెల ప్రకాష్, పెద్ద ఎత్తున నియోజకవర్గం లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నూతన మండల అధ్యక్షులు వీరే**

రామచంద్రపురం టిడిపి పట్టణ అధ్యక్షుడిగా ఉండవల్లి రామ శివ సత్యనారాయణ(శివ,) రూరల్ మండల అధ్యక్షుడిగా కొత్తపల్లి శ్రీనుబాబు, కాజులూరు మండల అధ్యక్షుడిగా చవ్వా కుల నారాయణమూర్తి,( డాక్టర్ బాబు) కె గంగవరం మండల అధ్యక్షుడిగా మేడిశెట్టి రవికుమార్ లతో పాటు, క్లస్టర్,యూనిట్, బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు, వార్డు కమిటీలు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకారం ఆద్యాంతం పండుగ వాతావరణం లో నిర్వహించారు.

**బైక్ ర్యాలీతో ఉత్సాహం నింపిన మంత్రి సుభాష్**

రామచంద్రపురం నియోజవర్గంలోని మండలాల అధ్యక్షులు, క్లస్టర్,బూత్, గ్రామ కమిటీలు, వార్డు కమిటీలు ప్రమాణ స్వీకారోత్సవం పురస్కరించుకొని స్థానిక వెల్ల బ్రిడ్జి నుంచి లైన్స్ క్లబ్ కళ్యాణ మండపం వరకు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, నియోజవర్గ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. మంత్రి సుభాష్ స్వయంగా బైక్ నడుపుతూ పార్టీ క్యాడర్లో ఉత్సాహాన్ని నింపారు. ఈ బైక్ ర్యాలీలో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



## ఉత్సాహభరితంగా.. గిరిజన స్వాభిమాన ఉత్సవాలు

**ఆకట్టుకున్న సంప్రదాయ వస్త్రధారణలతో విద్యార్థినుల ఫ్యాషన్ షో**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** భగవాన్ బిర్సాముండా 150వ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న గిరిజన స్వాభిమాన్ ఉత్సవాలు వివిధ సాంస్కృతిక, అవగాహన కార్యక్రమాలతో ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. గురువారం రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో ఈ ఉత్సవాలలో భాగంగా సంప్రదాయ గిరిజన వస్త్రధారణల ఫ్యాషన్ షో నిర్వహించారు. విద్యార్థినులు వివిధ గిరిజన సమాజాల సంప్రదాయ వస్త్రధారణల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి మాట్లాడుతూ "గిరిజన సంప్రదాయాలు, సంస్కృతి, వారసత్వాన్ని యువతకు పరిచయం చేయడం గిరిజన స్వాభిమాన్ ఉత్సవాల ప్రధాన ఉద్దేశ్యం. విద్యార్థులచే నిర్వహించిన ఫ్యాషన్ షో గిరిజన సమాజ జీవన విధానాన్ని ప్రతిబింబించింది" అని తెలిపారు. పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన విద్యార్థినులకు ఈ నెల 15న రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న గిరిజన స్వాభిమాన్ ముగింపు ఉత్సవాలు, భగవాన్ బిర్సాముండా 150వ జయంతి ప్రధాన వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. గురువారం బొమ్మూరూ లో నిర్వహించిన సంప్రదాయ వేడుకలో పాఠశాల హెచ్‌ఎం ఎం ఇందిరా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో గిరిజన కళారూపాలు, నృత్యాలు, పాటలు ఆకట్టుకున్నాయి. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 15 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి. ఈ నెల 15న కలెక్టరేట్ లో భగవాన్ బిర్సాముండా జయంతి ప్రధాన వేడుకలు (గిరిజన ఆశ్రమ పాఠశాలలు, పీఎంఎస్ విద్యాసంస్థలు) ముగింపు వేడుకల సందర్భంగా గిరిజన స్టాల్స్, సంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, గిరిజన గౌరవ ర్యాలీ నిర్వహించబడనున్నాయి. నవంబరు 15న కలెక్టరేట్‌లో జరిగే ప్రధాన వేడుకలకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

## డీఎస్సీ 2000 బ్యాచ్ రజతోత్సవం..




**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** డీఎస్సీ 2000వ సంవత్సరంలో నగర పాలక సంస్థలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు అందరూ నేటికి 25 సంవత్సరాలు పూర్తి అయిందని రజతోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక నెహ్రూ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు.. ప్రధానోపాధ్యాయిని జీ ఆశాకిరణ్ కు శుభాకాంక్షలు తెలిపారు. 2000 సంవత్సరంలో నవంబరు 13న ఉద్యోగంలో జాయిన్ అయ్యామని సంతోషంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాన్సన్, వెంకటేశ్వరరావు, సూర్య శ్రీ, కన్నమనాయుడు, రోజా రమణి, పీవీ సత్యనారాయణ, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దుళ్ళ గ్రామంలో అట్టహాసంగా రచ్చ బండ కార్యక్రమం



**రాజమహేంద్రవరం (మనసులో మాట), నవంబరు 13:** రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం కడియం మండలంలోని దుళ్ళ గ్రామంలో గురువారం రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూర్పు గోదావరి జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, రూరల్ నియోజవర్గ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్ హాస్పిటల్స్ ప్రజలను దోచుకుని తింటున్నాయని, ఈ పరిస్థితిని చూసి తట్టుకోలేకనే వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి పార్లమెంట్ కి ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ ఉండాలని దృఢ సంకల్పంతో నిర్మాణం మొదలు పెట్టారన్నారు. కరోనా లాంటి కష్టకాలంలో కూడా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా చలించక 5 కాలేజీల నిర్మాణం పూర్తి చేశారని, ముఖ్యమంత్రి అంటే ప్రజల ఆస్తికి రక్షకుడని అలాంటిది చంద్రబాబు ప్రజల ప్రాణాలకు భక్షకుడిగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరంచేసి ప్రజలకు ఉచిత వైద్యాన్ని దూరం చేస్తున్నారని అన్నారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించిన చంద్రబాబు పేరు చెబితే రాష్ట్రంలో ఏ ఒక్క వ్యక్తి అయినా ఏ ఒక్క పథక%శీ% అయినా గుర్తు చేసుకోగలరా అని ఎద్దేవా చేశారు. గత ఐదు సంవత్సరల పరిపాలనలో జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రతి అప్పుకి, పేద ప్రజలకు అందించిన పథకాలకి ప్రతి ఒక్క దానికి తమ దగ్గర లెక్కలు ఉన్నాయన్నారు. ఈ రోజు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాల గడవక ముందే 2 లక్షల ఇరవై వేల కోట్ల రూపాయలు అప్పులు చేసి ఎవరికి పంచారు, ఏ పేదవాడికి ఇచ్చారో ప్రజలకు లెక్కలు చెప్పాలని చెల్లుబోయిన డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శులు నక్కా నగేష్, గిరజాల బాబు, తోకల వీర వెంకట్రావు, కొండపల్లి పట్టియ్య, టేకి శ్రీను, తోకల శ్రీను, తాతపూడి బాబి, ముసునూరి రాంబాబు, కట్టుంగ నాగరాజు, తాడాల చక్రవర్తి, ఈలి గోపాలం, కొత్తపల్లి శివాజీ, విప్పర్తి ఫణి, కట్టా జామిందర్,పితాని హరికృష్ణ, చింతపర్తి



రాంబాబు, సర్కార్ బాషా, ఊటికూరి శైలజ, ఆచంట మారుతీ దేవి, వీణం దేవి, దాసరి శేషగిరి, నామాల బాల సరోజిని, మార్గాని బలరామ్, చిలుకూరి రామకృష్ణ, కొప్పాక రమణ, ముద్దాల అను, ముత్యాల పోసి కుమార్, పున్నంరాజు వీర్రాజు, డాక్టర్ చోళ్లంగి సత్యగిరి, చాప రాజా, పరిమళ నాని, ఆరిగేల హరీష్, కొల్లి వెంకట రత్నం, శేఖర్, కొల్లి నాని బాబు, పట్టా ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం పట్టణం ఎన్డీఏ కార్యాలయంలో

# రేపు 'ప్రజా దర్బార్'

## ప్రజలకు ఆత్మీయ ఆహ్వానం!

ధర్మవరం, నవంబర్ 13 (మనసులో మాట) ధర్మవరం నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు, రేపు శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో "ప్రజా దర్బార్" కార్యక్రమం నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విశాఖపట్నంలో అధికార కార్యక్రమాల్లో పాల్గొంటున్న కారణంగా ఈ ప్రజా దర్బార్‌కు ధర్మవరం పట్టణానికి హాజరు కాలేకపోతున్నారు. అయితే ఈ కార్యక్రమంలో ప్రజలు సమర్పించే అన్ని వినతులు, సమస్యలను ఎన్డీఏ కార్యాలయంలో స్వీకరించి, అనంతరం వాటిని మంత్రి సత్యకుమార్ యాదవ్ కి అధికారికంగా పంపడం జరుగుతుంది. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు మరియు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు ఈ ప్రజా దర్బార్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయవలసిందిగా మనవి..

# కేతిరెడ్డి... ఇతరులపై మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడు

### - హరీష్ బాబు హెచ్చరిక

- "ఐదేళ్ల వైసీపీ చేయలేని అభివృద్ధి 16 నెలల్లో బీజేపీ చేసి చూపించింది":
- "జాగిలాలు అని ఎద్దేవా చేసిన కేతిరెడ్డికి ఘాటైన సమాధానం
- "అవును మేము జాగిలాలమే, కానీ విశ్వాసంతో ఉన్నవాళ్లం"
- "నడి బజార్లో బట్టలూడదీసి ప్రజలతోనే కొట్టిస్తాం" - కేతిరెడ్డిపై హరీష్ బాబు ఆగ్రహం
- "3.0 అంటున్నావు.. జీరోగా మిగిలిపోతావు"
- మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పై విరుచుకుపడ్డ హరీష్ బాబు



**ధర్మవరం, నవంబర్ 13 (మనసులో మాట)..** మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు వైసీపీ నేత కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం ఎన్డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేతిరెడ్డి. ఇతరులపై మాట్లాడేటప్పుడు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడు. ప్రజల జోలికొచ్చిన వారిపై కన్నెత్తి చూసినట్లు ఆధారాలు దొరికితే బట్టలూడదీసి వారితోనే కొట్టిస్తాను..జాగ్రత్త!" అంటూ హెచ్చరించారు. ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన 16 నెలల కాలంలోనే రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గారు కోట్లాది రూపాయల నిధులు తెచ్చి ధర్మవరానికి అభివృద్ధి పునాది వేశారు అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరగని అభివృద్ధి, కేవలం 16 నెలల్లోనే బీజేపీ చేసి చూపించింది" అని ఆయన గర్వంగా తెలిపారు. 29.30 కోట్లతో అమృత్ పథకం కింద పట్టణ నీటి సరఫరా మెరుగుదల పనులు, 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా పలు ప్రాజెక్టులు చేపట్టిన ఘనత సత్యకుమార్ గారిదేనని ఆయన పేర్కొన్నారు. సంస్కృతి సేవా సమితి ద్వారా రూ.10 లక్షలతో పోతుకుంట బీసీ కాలనీలో వాటర్ ప్లాంట్, రూ.35 లక్షలు ఖర్చుచేసి లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ ద్వారా 20 మంది యువతకు శిక్షణ ఇవ్వడం, జాబ్ మేళా ద్వారా 2400 మంది యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించడం, మరో 12 మంది యువతులకు ఉచిత బ్యాంకింగ్ కోచింగ్, అలాగే 75 మంది వృద్ధులకు ఉచిత మోకాలు ఆపరేషన్లు చేయించడం ఈ అభివృద్ధి కృషి సత్యకుమార్ యాదవ్ గారి సారథ్యంలోనే సాధ్యమైందన్నారు. అభివృద్ధిని ప్రోత్సహించాల్సిన కేతిరెడ్డి, బీజేపీ కార్యకర్తలను 'జాగిలాలు' అంటున్నాడు. కానీ ఆ జాగిలాలే ఈ దేశ భద్రత కోసం ప్రాణాలు అర్పించినవారు!" అని ఆయన ధాటిగా అన్నారు. అవును, మేము జాగిలాలమే. కానీ మాలో విశ్వాసం ఉంది! నీలాంటి వారిలో మాత్రం నమ్మకం లేదు. ధర్మవరం ప్రజల కోసం మేము వెంకయ్య నాయుడు వద్ద లాబీయింగ్ చేస్తున్నాం మీలాగా తిన్నింటి వాసాలు లెక్కపెట్టే పరిస్థితి మాకు లేదు," అంటూ హరీష్ బాబు ఘాటుగా వ్యాఖ్యానించారు. మీ గుట్టు విప్పితే ధర్మవరంలో తిరగలేవు. స్థలాలు, పొలాలతో చేస్తున్న అవినీతి ఆధారాలు బయటపెడితే నడిబజార్లో బట్టలూడదీసి ప్రజలతోనే కొట్టిస్తాం!" అని ఆయన హెచ్చరించారు. కేతిరెడ్డి "3.0" అంటూ చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన వెంగోక్తులు విసిరుతూ త్రీ అంటే కూటమి, కానీ జీరో అంటే మీరే! మళ్లీ కూడా జీరోగానే మిగిలిపోతారు!" అన్నారు. బీసీలపై విమర్శలు చేసిన వారు ఎప్పుడూ రాజకీయంగా బాగుపడిన దాఖలాలు లేవు. అందుకే మీరు కూడా ఎథిక్స్ లేని వ్యక్తిగా మిగిలిపోతున్నారు, అని హరీష్ బాబు ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజీల నిధుల విషయంలో రూ.700 కోట్లు దోచుకున్నారని చెప్పడం పూర్తిగా అబద్ధం. ఇప్పటికైనా మాట్లాడేటప్పుడు హుందాగా, ముందు వెనుక ఆలోచించి మాట్లాడడం నేర్చుకోండి," అని ఆయన కేతిరెడ్డికి సూచించారు.



సైన్స్ సెమినార్ నిర్వహణలో రాష్ట్రస్థాయిలో

## 3 స్థానం హెచ్ఎం ఉమాపతి

ధర్మవరం నవంబర్ 13 (మనసులో మాట) రాష్ట్రస్థాయిలో నిర్వహించిన సైన్స్ సెమినార్ పోటీలలో మూడవ స్థానమును ధర్మవరం పట్టణంలోని శాంతినగర్ లో గల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థి శంకరపు గణేష్ కైవసం చేసుకున్నారని హెడ్మాస్టర్ ఉమాపతి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ప్రాజెక్టు ద్వారా సైన్స్ టూర్ కి వారం రోజులు గుజరాత్ సైన్స్ టూరుకు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ 27వ తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు ఏడు రోజులు గుజరాత్కు వెళుతున్న సందర్భంగా హెడ్మాస్టర్ తో పాటు సైన్స్ ఉపాధ్యాయిని రేఖ, ప్రదీప్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యా కమిటీ, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

## 58వ జాతీయగ్రంథాలయ వారోత్సవాల ప్రారంభం



పలమనేరు నవంబర్ 13 (మనసులో మాట ) :స్థానిక శాఖ గ్రంథాలయంలో నవంబర్ 14 నుండి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలం ప్రారంభం కానున్నాయని స్థానిక గ్రంథాలయ అధికారి హేమ కుమార్ తెలిపారు. ఈ గ్రంథాలయ వారోత్సవాలు ముఖ్య ఉద్దేశం విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి ఇక్కడున్నటువంటి అనేక పుస్తకాలను చదివి జ్ఞానాన్ని సంపాదించడమే ముఖ్య లక్ష్యంగా ఉండాలని తెలిపారు. ఈ గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమాల లో భాగంగా బాలల దినోత్సవం, పుస్తక ప్రదర్శన, గ్రంథాల ఉద్యమ పితామహులను స్మరించుకోవడం, కవి సమ్మేళనం. విద్యార్థులు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు, మహిళా దినోత్సవం, డిజిటల్ గ్రంథాలయాల పై అవగాహన మొదలైన కార్యక్రమాలు. ఈ వారోత్సవాలలో విద్యార్థులు పాల్గొనాలని గ్రంథాలయ అధికారి హేమంత్ కుమార్ తెలిపారు.

## ఎరువుల దుకాణాలపై దాడి చేసిన వ్యవసాయ అధికారులు



**ధర్మవరం నవంబర్ 13 (మనసులో మాట)..** పట్టణంలోని ఎరువుల దుకాణాలపై సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మానాయక్ మండల వ్యవసాయ అధికారి ముస్తఫా ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బీసీ ఎంఎస్ ఎరువుల విక్రయ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, దుకాణము వద్ద ధరల పట్టిక ఏర్పాటు చేయాలని, ఎరువుల ధరలు, స్టాకు నిలువలు ప్రతిరోజు అప్డేట్ చేయాలని వారు ఆదేశించడం జరిగింది. ఎంఆర్పికి మించి విక్రయించకూడదని కూడా వారు హెచ్చరించారు. అలా విక్రయిస్తే కఠిన చర్యలతో పాటు కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఎరువుల అమ్మకాలు తప్పనిసరిగా ఐ ఎఫ్ ఎం ఎస్ నందు నమోదు చేయాలని తెలిపారు. నిబంధనలు పాటించని యెడల చట్టపరమైన చర్యలు తప్పక తీసుకోవడం జరుగుతుందని వారు హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా టీడీపీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం

### కొత్త కమిటీ మెంబర్లకు సన్మానాలు చేసి శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలు, నాయకులు



**పలమనేరు నవంబర్ 13 ( మనసులో మాట ):** పలమనేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాలు గురువారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఈనెల 13, 14 తేదీలలో నూతన కమిటీలను ప్రకటించాల్సిందిగా ఆదేశాలు రావడంతో ఈ కమిటీలను ప్రకటించారు. ఇప్పటికే వీ.కోట మండలంలో వారం క్రితం ఆ పార్టీ మండల కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. దీంతో పలమనేరు పట్టణం, మండలం తోపాటు గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి పాలకవర్గాల ప్రమాణ స్వీకారోత్సవం గురువారం జరిగింది. బైరెడ్డిపల్లి మండలానికి సంబంధించి అక్కడ మండల కేంద్రంలోని కళ్యాణ మండపంలో ఈ కార్యక్రమం జరగగా పలమనేరు టిడిపి కార్యాలయంలో గంగవరం, పెద్దపంజాణి, పలమనేరు రూరల్ పాలకవర్గాల ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఇక పట్టణ కమిటీ ప్రమాణ స్వీకారం స్థానిక మదనపల్లి రోడ్డు లోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో జరిగింది. పలమనేరు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఆర్బిసి కుట్టి, ప్రధాన కార్యదర్శిగా గిరిబాబు, ఉపాధ్యక్షులుగా రూపేష్ లు తమ కార్యవర్గంతో ప్రమాణ ప్రమాణ స్వీకారం చేశారు. గంగవరం మండల పార్టీ అధ్యక్షులుగా సోమశేఖర్ గౌడ్ ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్ రెడ్డి, బైరెడ్డిపల్లి మండల పార్టీ అధ్యక్షులుగా కిషోర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం శెట్టి, పలమనేరు మండల పార్టీ అధ్యక్షులుగా నాగరాజ్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా గణేషు, పెద్దపంజాణి మండలం పార్టీ అధ్యక్షులుగా ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా చలపతిలు తమ కార్యవర్గాలతో ప్రమాణ స్వీకారం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు కార్యకర్తలు నూతన పాలకవర్గ సభ్యులను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# కుష్టి వ్యాధిపై అవగాహన కార్యక్రమం..

### డాక్టర్ పుష్పలత, డాక్టర్ దిలీప్ కుమార్



**ధర్మవరం నవంబర్ 13 (మనసులో మాట)** మండల పరిధిలోని దర్శనమల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ కుష్టి నియంత్రణ కార్యక్రమములో భాగంగా డాక్టర్ పుష్పలత ,డాక్టర్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో కుష్టి వ్యాధి పై అవగాహనా కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సర్వే నిర్వహించడం జరుగుతుందని. ప్రతి ఆశా కార్యకర్త, మేల్ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి, ఇంటి అందు గల అందరికీ కుష్టి వ్యాధిపై అవగాహన కల్పించి, పరీక్షలు నిర్వహించవలెనని వారు తెలిపారు. ఎవరికైనా శరీరంపై స్పర్శ లేని మచ్చలు ఉన్నచో వారిని మెడికల్ ఆఫీసర్ కి రెఫర్ చేయాలని తెలిపారు. అదేవిధంగా ప్రతిరోజు ప్రతి ఆశా కార్యకర్త మేలు వాలంటీర్లు తమకు కేటాయించిన గృహములలో తప్పక, విధిగా సర్వే నిర్వహించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివమ్మ, హెల్త్ సూపర్వైజర్లు రాజశేఖర్ రెడ్డి, జై తుంబి, ఎం ఎల్ హెచ్ పి లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మేల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన..

### ఎల్ఎంఎస్ కంపెనీ ఎండి అస్లాం

### - షిరిడి సాయి సేవా సమితి అధ్యక్షులు.. వీరనారాయణ




**ధర్మవరం నవంబర్ 13 (మనసులో మాట)..** పట్టణంలోని సాయిబాబా దేవాలయంలోని కళ్యాణ మండపంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన రావడం జరిగిందని ఎల్ఎంఎస్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అస్లాం, ప్రొప్రైటర్ ముక్తియార్, షిరిడి సాయిబాబా సేవా సమితి అధ్యక్షులు వీరనారాయణ, కార్యదర్శి రామలింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆన్లైన్లో ఇంటర్మీడియట్ డిగ్రీ అర్హత కలిగిన వారు 65 మంది దరఖాస్తు చేసుకోగా, ఇంటర్వ్యూలో 54 మంది అభ్యర్థులు ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్ ఎం ఎస్ కంపెనీ నిరుద్యోగులకు చక్కటి అవకాశాన్ని కల్పించడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. ఈ ధర్మవరం లో సాయిబాబా సేవా సమితి వారి సహకారంతో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరిగిందన్నారు. 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాల లోపు మహిళలకు ప్రాధాన్యత కల్పించడం జరిగిందని తెలిపారు. ఎంపికైన వారికి హాస్టల్ వసతి తో పాటు రవాణా ఖర్చు కూడా కంపెనీ వారిచే ఇవ్వబడుతుందని తెలిపారు. అనంతరం షిరిడి సాయిబాబా సేవా సమితి వీరనారాయణ, కార్యదర్శి రామలింగయ్య మాట్లాడుతూ సేవా సమితి తరపున ఎన్నో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని అందులో భాగంగా నిరుద్యోగులకు ఉద్యోగం ఇవ్వాలన్న తపనతోనే ఈ జాబ్ మేళాను నిర్వహించడం జరిగిందన్నారు. ఆలయంలో ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నామని, ప్రతిరోజు భక్తాదుల కోరిక మేరకు వివిధ పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు ఒక చక్కటి అవకాశం లభించడం మాకెంతో సంతృప్తిని ఇచ్చిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి ,సహకార దర్శి నాయుడు, కోశాధికారి సూర్యనారాయణ, డైరెక్టర్లు సూర్య ప్రకాష్, హేమంత్ కుమార్, ఎల్ఎంఎస్ కంపెనీ హ్యూమన్ రిసోర్స్ శామీర్, ఇమ్రాన్, 15 మంది కంపెనీ సూపర్వైజర్స్ పాల్గొన్నారు.

పలువురు వైసీపీ నాయకులను పరామర్శించిన

# మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



**ధర్మవరం నవంబర్ 13 (మనసులో మాట)** పట్టణములోని పలువురు వైసీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి స్వయంగా వారి వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించడం జరిగింది. ఇందులో భాగంగా సంజయ్ నగర్ కు చెందిన అల్లాడి నాగభూషణం (బుగ్గ) ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అదేవిధంగా పదవ వార్డ్ లింగిశెట్టిపాళ్యం వీధికి చెందిన మాజీ వైస్ చైర్మన్ మాస్పల్లి సాయి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి స్వయంగా వెళ్లి పరామర్శించారు. తదుపరి 23వ వార్డు ఇన్చార్జ్ యాదవీరికి చెందిన ఎస్పీ బాషా అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం ఆ ముగ్గురికి ధైర్యాన్ని నింపి, ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో చేనేత కార్మికుడు ఆకస్మిక మృతి



**ధర్మవరం నవంబర్ 13 (మనసులో మాట)...** పట్టణములోని శాంతినగర్ కు చెందిన ఏ. నరేష్ (45 సంవత్సరాలు) అనే చేనేత కార్మికుడు గుండెపోటుతో మృతి చెందారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ గార్లదిన్నె మండలం మార్తాడుకు చెందిన ఏ నరేష్ సొంత మగ్గం వేస్తూ జీవనం కొనసాగించేవాడని. నేసిన చీరలకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో సొంత మగ్గాలను కూడా విక్రయించి కొద్దిగా అప్పులు తీర్చడం జరిగిందన్నారు. అంతేకాకుండా ఇంకను అప్పులు ఉండటంతో కూలిపో నేస్తూ కుటుంబాన్ని పోషించేవాడని తెలిపారు. తదుపరి నరేష్ చేసిన అప్పులు ఎలా తీర్చాలో అని ప్రతిరోజు మధన పడేవాడని తెలిపారు. క్షణికమైన ఆవేశంలో తీవ్రమనిస్థాపానికి గురికావడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం జాతిలో నొప్పి రావడంతో నరేష్ ఇంట్లోనే అక్కడికక్కడే స్పృహ లేకుండా పడిపోవడంతో గమనించిన భార్య భాగ్యమ్మ చుట్టుపక్కల వారి సహకారంతో ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తదుపరి మెరుగైన వైద్యం కోసం అనంతపురం కు తరలించగా అక్కడ వైద్యుల సలహా మేరకు బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే చనిపోవడం జరిగిందని వారు తెలిపారు. మృతునికి భార్య భాగ్యముతో పాటు కుమారుడు పార్థ, కుమార్తె లిఖిత కలరు. కుటుంబంలోని పెద్ద కుటుంబం చనిపోవడంతో కుటుంబ సభ్యులు దుఃఖముతో మునిగిపోయారు. ఈ కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని కుటుంబ సభ్యులు, స్థానికులు, బంధుమిత్రులు తెలుపుతున్నారు.

మనసులో మాట

KANCHARLA

సంచలన తెలుగు దిన పత్రిక

తెలంగాణ

హైదరాబాద్ | రంగారెడ్డి | మహబూబ్ నగర్ | మెదక్ | నల్గొండ
నిజామాబాద్ | ఆదిలాబాద్ | కరీంనగర్ | వరంగల్ | ఖమ్మం

శుక్రవారం 14 నవంబర్ 2025




# మళ్లీ పెరిగిన బంగారం ధరలు

- రూ. 3వేలకు పైగా హైక్

**హైదరాబాద్,నవంబర్13(మనసులో మాట):**

బంగారం, వెండి ధరలకు మళ్లీ రెక్కొలొచ్చాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల పసిడి ధర ఒక్కరోజే దాదాపు రూ.3 వేలకు పైగా పెరిగి రూ.1,31,500కు చేరుకుంది. 22 క్యారెట్ల పుత్తడి ధర ధర రూ.1,17,150 పలుకుతోంది. కిలో వెండి ధర ఒక్కరోజే రూ.10వేలకు పైగా పెరిగి రూ.1,71,300కు చేరింది. అంతర్జాతీయంగా మర్కెట్‌లో పసిడి ధర ఔన్సు మళ్లీ 4200 స్థాయిని దాటి 4,218 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ఔన్సు 54.10 డాలర్ల వద్ద కొనసాగుతోంది. దీన్ని అనుసరించి దేశీయంగా బంగారం, వెండి ధరలు పెరిగాయి. అమెరికా చరిత్రలో అత్యధిక కాలం పాటు కొనసాగిన ప్రభుత్వ షట్‌డౌన్ ఎట్టకేలకు ముగిసింది. దీంతో ఆర్థిక కార్యకలాపాలు ఎప్పటిలానే యథావిధిగా కొనసాగనున్నాయి. ముఖ్యంగా ఎకనామిక్ డేటా వెలువడనుంది. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోతకు మార్గం సుగమం కానుంది. ఈ కారణంతోనే బంగారం ధర పెరుగుతోందని విశ్లేషకులు చెబుతున్నారు. దీనికితోడు డాలర్ ఇండెక్స్ బలహీన పడడం, సెంట్రల్ బ్యాంకుల నుంచి కొనుగోళ్లు ఎప్పటిలానే కొనసాగుతుండడం కూడా పసిడి డిమాండ్‌కు కారణమని పేర్కొంటున్నారు.



# గజ..గజ

## తెలంగాణపై చలిపంజా



- సిర్పూర్‌లో అత్యంత కనిష్టంగా 7.1 డిగ్రీలు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల హెచ్చరిక



**హైదరాబాద్,నవంబర్13 (మనసులో మాట):**

రాష్ట్రంలో చలి తీవ్రత రోజురోజుకు పెరిగిపోతున్నది. రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో చలిలో ప్రజలు వణికిపోతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. గురువారం ఉదయం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్‌లో రాష్ట్రంలోనే అత్యంత కనిష్ఠంగా 7.1 డిగ్రీలుగా నమోదయింది. ఇక తిర్యాణిలో 8.2 డిగ్రీలు నమోదయింది. దీంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఉదయం 8 గంటలు దాటినప్పటికీ చలి తీవ్రత తగ్గకపోవడంతో స్కూళ్లు, కార్యాలయాలు, రోజువారీ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. ఇక హైదరాబాద్‌లో అతితక్కువగా హెచ్‌సీయూలో 11.8 డిగ్రీలు రికార్డయింది. రాజేంద్రనగర్‌లో 12.9, మారేడుపల్లిలో 13.6 డిగ్రీల రికార్డయింది. ఉదయం 6 గంటల సమయంలో నగర శివార్లలోని ఇబ్రహీంపట్నంలో 11.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కాగా, మరో నాలుగు ఐదు రోజుల్లో చలి తీవ్రత మరింత పరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రాష్ట్రంలో ఎన్నడూ లేనట్టుగా చలి తీవ్రత బాగా పెరిగింది. ఒక్కసారిగా కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోయాయి. మరికొన్ని రోజులూ ఇదే పరిస్థితి ఉంటుందని, చలి మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలంగాణ రాష్ట్రం తీవ్ర చలి ప్రభావిత జోన్‌లో ఉందని ఈసారి కూడా అదే పరిస్థితి ఉంటుందని వాతావరణ నిపుణులు తెలిపారు. కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల వరకు పడిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇక చలి వాతావరణంలో జాగ్రత్తగా ఉండాలని, లేకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా శ్వాసకోశ సమస్యలు, జలుబు, దగ్గు, జ్వరాలతో ఆస్పత్రులకు వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోందని చెబుతున్నారు.రాష్ట్రంలో మరో మూడు నాలుగు రోజుల పాటు చలి తీవ్రత మరింతగా పెరుగుతుందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రతలు 8.5 డిగ్రీల నుంచి 12.5 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. చలి తీవ్రతకు సంబంధించి మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపునకు పడిపోవచ్చని హెచ్చరించింది. మిగతా అన్ని జిల్లాల్లో 10-12.5 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయంటూ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. కాగా, చలి తీవ్రతతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏజెన్సీ గ్రామాలు వణికిపోతున్నాయి. ఉదయం 9 గంటల వరకు కూడా పొగ మంచు కమ్ముకుంటోంది. చలి తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్యశాఖ హెచ్చరించింది. రెస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ ఫ్లూ పెరిగే అవకాశం ఉండటంతో అలర్ట్‌గా ఉండాలని సూచించారు. జ్వరం, దగ్గు, గొంతు తడి ఆరిపోవడం, నొప్పులు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని తెలిపారు. గర్భిణులు, ఐదేండ్లలోపు చిన్నారులు, వృద్ధుల్లో సీజనల్ ఫ్లూ లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని దవాఖానలను సందర్శించాలని కోరారు. అధిక జ్వరం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఉంటే తక్షణమే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందాలని సూచించారు.

## పెట్టుబడిదారులకు గమ్యస్థానం

# హైదరాబాద్

## అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం

- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి
- వార్షిక సమ్మిట్‌లో 'తెలంగాణరైజింగ్ 2047' విజన్ ప్రదర్శన



**ఢిల్లీ, నవంబర్ 13 (మనసులో మాట):**

తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గ్లోబల్ ఇన్వెస్టర్ల ముందు 'తెలంగాణరైజింగ్ 2047' విజన్‌ను ప్రదర్శించారు. ఢిల్లీలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు-భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు వార్షిక సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు.

అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఢోకా లేని భౌగోళిక కేంద్ర స్థానంలో ఉన్న హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో తెలంగాణ రాష్ట్రం దూసుకుపోతోందని ఆయన తెలిపారు.

### హైదరాబాద్‌పై సీఎం విజన్, పెట్టుబడులకు ఆహ్వానం

మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధి, మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి తెలిపారు. గత 35 ఏళ్లుగా ఏ పార్టీ అధికారంలో ఉన్నా, పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు తెలంగాణ మద్దతుగా నిలిచిందని సీఎం వివరించారు. భారతదేశంలో పెట్టుబడుల కోసం హైదరాబాద్ ముఖ ద్వారం లాంటిదని, జీసీసీ (గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్)లకు గమ్యస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను సీఎం ఆహ్వానించారు.

### కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల పురోగతి

గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యంగా, భవిష్యత్తు తెలంగాణకు కీలకంగా మారే ప్రాజెక్టులను ప్రస్తావించారు: అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీ భారతదేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే, లండన్, టోక్యో, దుబాయ్, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరిగానే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని సీఎం అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్- ఆర్ఆర్ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించిన సీఎం, "చైనా ౦1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుంది" అని ధీమా వ్యక్తం చేశారు.

### విద్యా సంస్థలకు, టెక్ కంపెనీలకు అపూర్వ ఆహ్వానం

హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే, తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో గ్లోబల్ సౌత్ విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని సీఎం ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను ఆహ్వానించారు. హైదరాబాద్‌లో రోడ్లకు నేతల పేర్లు పెట్టే ట్రెండ్‌ను మార్చాలని తాము భావిస్తున్నామని సీఎం తెలిపారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీల పేర్లను పెడతామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

### టెక్ దిగ్గజాల ప్రశంసలు

ఢిల్లీలో జరిగిన ఈ యూఎస్ఐ ఎస్పీఎఫ్ సమావేశంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి లక్ష్యం విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన ఆయన ప్రసంగం అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది.




# నేడే జూబ్లిహిల్స్ ఫలితం

- రిజల్ట్స్ పై ఆధారపడ్డ రాజకీయ పార్టీల భవిష్యత్తు!
- విజయంపై ఎవరి ధీమా వారిదే
- పాజిటివ్ ఎగ్జిట్ పోల్స్ తో కాంగ్రెస్ లో జోష్




**హైదరాబాద్,నవంబర్13(మనసులో మాట):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం మరో శుక్రవారం తేలనుంది. అధికార, విపక్షాల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్, ఎలాగైనా జూబ్లీహిల్స్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి. సుమారు నెలరోజుల పాటు పార్టీలు తమ నాయకత్వాన్ని నియోజకవర్గంలో మోహరించాయి. విమర్శలు, ప్రతివిమర్శలు, సవాళ్లు, ప్రతిసవాళ్లతో రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపిన జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో గెలిచేదెవరో శుక్రవారం తేలనుంది. ఎగ్జిట్ పోల్ సర్వేతో కాంగ్రెస్‌లో ఉత్సాహం నెలకొంది. పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని ధీమాలో అధికార కాంగ్రెస్ ఉంది. అధికార, విపక్షాల మధ్య నువ్వా నేనా అన్నట్లు సాగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాజకీయ పార్టీల భవిష్యత్ తేల్చనుంది. సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్ , ఎలాగైనా జూబ్లీహిల్స్‌పై జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ సర్వశక్తులూ ఒడ్డి పోరాడాయి. బిజెపి కూడా గెలిచి తీరాలన్న పట్టుదలతో పోరాడింది. సుమారు నెలరోజుల పాటు పార్టీలు తమ నాయకత్వాన్ని నియోజకవర్గంలో మోహరించాయి. సాధారణంగా ఎక్కడైనా ఉప ఎన్నికలో భారీగా పోలింగ్ శాతం నమోదు అవుతుంటుంది. కానీ జూబ్లీహిల్స్‌లో మాత్రం ఒక్క శాతమే ఓటింగ్ పెరగడంతో.. గెలుపు ఎవరిని వరిస్తుందా అనేది తెలియని పరిస్థితి. తామే గెలుస్తామంటూ కాంగ్రెస్ పార్టీ, కాదు కాదు తామే గెలుస్తామంటూ బీఆర్ఎస్ పార్టీ ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సర్వేలు అన్నీ తమ వైపే ఉన్నాయని కాంగ్రెస్ నేతలు చెబుతుండగా.. సైలెంట్ ఓటింగ్ జరిగిందని.. తద్వారా తమ విజయం ఖాయమని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. మొత్తంగా శుక్రవారం మధ్యాహ్నం తుది ఫలితం వెల్లడయ్యే వరకు ఉత్కంఠ తప్పని పరిస్థితి. ఇప్పటికే అధికారులు ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో లెక్కింపు ప్రారంభం కానుంది. పది రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఉప ఎన్నికలో లక్షా 94 వేల 632 ఓట్లు పోలయ్యాయి. వీటిని పది రౌండ్లుగా 42 టేబుళ్లపై లెక్కింపు జరుపనున్నారు. తొలుత పోస్టల్ బ్యాలెట్, ఆ తర్వాత 103 హోం ఓటింగ్‌లను లెక్కించిన తర్వాత ఈవీఎంల్లోని ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. సాధారణంగా 14 టేబుళ్లపై కౌంటింగ్ జరుగుతుంది. ఉప ఎన్నిక కావడం, ఉద్యోగులు అందుబాటులో ఉండడంతో ఎక్కువ టేబుళ్లు ఏర్పాటు చేసి త్వరగా లెక్కింపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఉదయం 8.45 గంటలకల్లా తొలి రౌండ్ ఫలితం వెల్లడి కానుంది. మధ్యాహ్నం ఒంటి గంటలోపే తుది ఫలితాన్ని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని మొత్తం 10 రౌండ్లుగా కొనసాగించ నున్నారు. ఒక్కో రౌండ్ వారీగా ఫలితాలను వెల్లడించనున్నారు. ఎన్నికల బరిలో 58 అభ్యర్థులతో పాటు నోటాకు పోలైన ఓట్ల సంఖ్యను అధికారులు వెల్లడించనున్నారు. కాగా కౌంటింగ్ కేంద్రంలో పటిష్టమైన మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. దీనికితోడు సీసీ కెమెరాలతో పర్యవేక్షణ, సాయుధ బలగాలతో 24గంటల పహారా ఉండనుంది. స్టేడియానికి 100 మీటర్ల మేరలో ఆంక్షలు అమల్లో ఉంటాయని అధికారులు తెలిపారు. ఎన్నిక ఏదైనా మా వైఖరిలో తేడా ఏమీ ఉండదని జూబ్లీహిల్స్ ఓటర్ మరోసారి నిరూపించారు. ప్రతిసారీ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో పోలింగ్ 50 శాతానికి మించడం లేదు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 47.49 శాతం పోలింగ్ నమోదు కాగా.. తాజాగా ఉప ఎన్నికలో 48.49 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. ఇక్కడ కేవలం ఒక్కశాతం మాత్రమే పోలింగ్ శాతం పెరగడం గమనార్హం. ఉప ఎన్నిక సమయానికి నియోజకవర్గంలో మొత్తం 4.01 లక్షల ఓటర్లు ఉండగా.. లక్షా 94వేల 631 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 48.49 శాతం పోలింగ్ మాత్రమే నమోదు అయినట్లు జిల్లా ఎన్నికల అధికారులు బుధవారం అధికారికంగా ప్రకటించారు. 99,771 మంది పురుషులు ఓటు వేశారు. బస్తీల్లో ఉండే ఓటర్లు ఆసక్తి చూపగా, అపార్ట్‌మెంట్లలో ఉన్న ఓటర్లు చాలావరకు ఓట్లు వేయనట్లు తెలుస్తోంది. మరోవైపు కొత్తగా ఓటుహక్కు వచ్చిన యువత ఓటు వేసేందుకు ఉత్సాహం కనబర్చారు. అయితే పోలింగ్ శాతం తగ్గడానికి కారణాలు లేకపోలేదని విశ్లేషకుల అంచనా.. ప్రైవేట్ ఉద్యోగులకు సెలవులు లేకపోవడం, ఓటింగ్ శాతం పెంచడంలో అధికారుల ప్రచార లోపం, పోలింగ్ బూత్‌ల వరకు ఓటర్లను రప్పించడంలో రాజకీయ పార్టీలు విఫలం అయ్యాయనే ఆరోపణలున్నాయి.

## కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో లెక్కింపు
- పోస్టల్ బ్యాలెట్‌తో ప్రారంభం
- 42 టేబుళ్లు ఏర్పాటు

**హైదరాబాద్,నవంబర్13(మనసులో మాట):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆర్వో కర్ణన్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని డీఆర్సీ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లు లెక్కిస్తాం. మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నందున ప్రత్యేక అనుమతి తీసుకుని లెక్కింపునకు 42 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తిచేస్తామని తెలిపారు.. కౌంటింగ్‌కు మొత్తం 186 మంది సిబ్బందిని కేటాయించాం. ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. మీడియాకు ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ఫలితాలను వెల్లడిస్తాంఅని చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని నగర జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. 15 ప్లాటూన్ల సిబ్బందిని రప్పిస్తున్నామన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని.. అనుమతి ఉన్నవారు మాత్రమే లెక్కింపు కేంద్రం వద్దకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపోతే ఓట్ల లెక్కింపు సందర్భంగా సాయంత్రం 6 వరకు మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్,నవంబర్13(మనసులో మాట):

తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలయింది. నవంబర్ 15వ తేదీ నుంచి అభ్యర్థుల నుంచి ఈ దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ దరఖాస్తులు స్వీకరణకు తుది గడువు నవంబర్ 29వ తేదీతో ముగియనుంది. జనవరి 3 నుంచి 31వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. కాగా.. 2025 ఏడాదికి సంబంధించి తొలి విడత టెట్ నోటిఫికేషన్ గత జూన్‌లో విడుదల చేశారు. ఇప్పటికే పరీక్షలు పూర్తి చేయగా.. జులై 22న ఫలితాలు సైతం వెల్లడించారు. తాజాగా రెండో విడత టెట్ నోటిఫికేషన్ గురువారం విడుదల చేశారు. ఇక ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు సైతం టెట్‌లో అర్హత సాధించాలంటూ ఇప్పటికే సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ నేపథ్యంలో తమ ఉద్యోగాల్లో కొనసాగాలంటే.. టీచర్లంతా ఈ టెట్ పాస్ కావాల్సి ఉంది. ఈ పరీక్షకు శుక్రవారం ( నోటిఫికేషన్ విడుదల చేస్తారు. శనివారం నుంచి నవంబర్ 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏటా రెండుసార్లు టెట్ నిర్వహించాల్సి ఉండగా.. ఈ ఏడాది జూన్‌లో తొలి విడత పరీక్షలు నిర్వహించి.. జులై 22న ఫలితాలు వెల్లడించిన విషయం తెలిసిందే. రెండో విడత టెట్‌కు శనివారం నుంచి దరఖాస్తుల ప్రక్రియ మొదలుకానుంది.

# జూబ్లీహిల్స్‌లో ధర్మమే గెలుస్తుంది

## రియల్ ఎస్టేట్‌ను సర్వనాశనం చేశారు

## ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

హైదరాబాద్,నవంబర్13 (మనసులో మాట):



ఎన్ని అక్రమాలు చేసినా జూబ్లీహిల్స్‌లో ధర్మమే గెలుస్తుందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కీలక వ్యాఖ్యలు చేశారు. బైపోల్స్‌లో ఎంఐఎం కూడా అక్రమాలకు పాల్పడి కాంగ్రెస్‌కు సహకరించిందని ఆరోపించారు. పోలీసులు బోగస్ ఓటింగ్‌కు సహకరించటం ప్రత్యక్షంగా చూశామన్నారు. కాగ్ రిపోర్ట్ సీఎం రేవంత్ రెడ్డి బట్టలు విప్పేసిందన్నారు. అప్పులు భారీగా తెచ్చిన రేవంత్.. ఆర్థిక అత్యాచారానికి పాల్పడ్డారంటూ వ్యాఖ్యలు చేశారు. అనుభవం లేని ముఖ్యమంత్రి ఉంటే.. ఇంతకంటే ఏం జరుగుతుందన్నారు. రేవంత్ రెడ్డి.. రియల్ ఎస్టేట్‌ను సర్వనాశనం చేశారని మండిపడ్డారు. హైడ్రా పేరుతో ఆర్ఆర్ టాక్స్‌తో దోపిడీ జరుగుతుందని ఆరోపణలు గుప్పించారు. రెండేళ్ళల్లో రూ.3.48వేల కోట్ల అప్పులు తెచ్చారన్నారు. పార్టీ ఫిరాయింపుల విచారణ సందర్భంగా సందర్శకులు, మీడియాపై నిషేధం సరికాదని అన్నారు. ఇది అసెంబ్లీ స్పీకర్, ముఖ్యమంత్రి రేవంత్ సొంత వ్యవహారం కాదని చెప్పుకొచ్చారు. దొంగలు దొంగలు ఊర్లు పంచుకున్నట్లు ఉంది వ్యవహారం అంటూ కామెంట్స్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు , మాజీ ఎంపీలు మాజీ ఎమ్మెల్సీలకు ప్రవేశాన్ని నిషేధించడం ఏంటని ప్రశ్నించారు. కేసు వాదిస్తున్న అడ్వకేట్లను సెల్ ఫోన్‌లు తీసుకురావద్దని హుకుం జారీ చేయటం సరికాదన్నారు. స్పీకర్ కార్యాలయం విడుదల చేసిన బులెటిన్ రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టులో ఫుల్ బెంచ్ వాదనలు జరిగినప్పుడు కూడా సెల్ ఫోన్లు అనుమతిస్తారని తెలిపారు. తక్షణమే బులెటిన్ ఎత్తి వేయాలని స్పీకర్‌కు లేఖ రాసినట్లు చెప్పారు. ఫిరాయింపు విచారణను లైవ్ స్ట్రీమింగ్ ద్వారా ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించే అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల వాదనల గురించి ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరముందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వ్యాఖ్యలు చేశారు.

# సుప్రీం ఆదేశాలను పాటించని స్పీకర్

## ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో పూర్తికాని విచారణ

## మరోమారు సుప్రీంలో కేసు వేసిన బీఆర్ఎస్




హైదరాబాద్,నవంబర్13 (మనసులో మాట):

తెలంగాణ రాజకీయాల్లో మరోమారు ఉత్కంఠత మొదలయ్యింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ విచారణలో స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్డ్డారని బిఆర్ఎస్ సుప్రీంలో కేసు దాఖలు చేసింది. అయితే అంతకు ముందే ఎమ్మెల్యేల ఫిరాయింపు విచారణపై స్పీకర్ సుప్రీంను గడువు కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో పార్టీ మారిన ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుతో పాటు అన్నింటిపై సోమవారం విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసు రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును, శాసనసభ పటిష్టతను ప్రభావితం చేయనుంది అనడంలో సందేహం లేదు. గతంలో ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావన కూడా ఉండడం, ఈ విచారణకు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. సోమవారం విచారణకు రానున్న ఈ కేసులో.. ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పు.. భవిష్యత్తులో రాజకీయ నాయకులు పార్టీలు మారే విధానాన్ని, ఫిరాయింపులకు పాల్పడే ధోరణిని పూర్తిగా మార్చేసే అవకాశం ఉంది. కేసు ప్రాధాన్యత నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇవ్వబోయే తుది తీర్పు.. ఫిరాయింపులను ప్రోత్సహించే పార్టీలకు, ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు ఒక కఠినమైన హెచ్చరికగా మారుతుందో లేదో వేచి చూడాలి.

# విద్యార్థుల టెన్త్ పరీక్షా ఫీజు చెల్లిస్తా

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్,నవంబర్13 (మనసులో మాట):

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్ష ఫీజును తానే కడతానని ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఎంపీగా తనకు వచ్చే వేతనం నుంచి భరించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ అందించిన అంత్యోదయ స్ఫూర్తితోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. పదో తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఈ సందర్భంగా ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ అంశంపై హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందనకు రాసిన లేఖను ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. ఏ ఖాతాలో ఈ మొత్తాన్ని డిపాజిట్ చేయాలనే విషయాన్ని తనకు తెలియజేయాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే, పాఠశాలల వారీగా పదో తరగతి విద్యార్థుల వివరాలు, ఎంత మొత్తాన్ని జమ చేయాలనే వివరాలను కూడా తెలియజేయాలన్నారు. ఇదిలావుంటే కరీంనగర్‌లో ఇంతకుముందే ఇదే విధానాన్ని మరో కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రకటించారు.

# ఆర్టీసీలో అదనపు రెవెన్యూ అవకాశాల అన్వేషణ

- ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు
- నష్టాల్లోని డిపోలపై ప్రత్యేక కమిటీ
- నగరంలో కొత్త రూట్లు
- ఆరంఘర్‌లో ఆధునిక టెర్మినల్ నిర్మాణంపై
- మంత్రి పొన్నం ప్రభాకర్



హైదరాబాద్, నవంబర్ 13 (మనసులో మాట):

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ను పూర్తి స్థాయిలో లాభాల బాట పట్టించే దిశగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. బుధవారం సచివాలయంలో ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, 'మహాలక్ష్మి' పథకం అమలు ద్వారా ఆర్టీసీ క్రమక్రమంగా లాభాలు పొందుతున్నప్పటికీ, ప్రభుత్వ చెల్లింపులకే పరిమితం కాకుండా అదనపు టికెటేతర ఆదాయంపై దృష్టి సారించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### అదనపు ఆదాయంపై దృష్టి

మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు మహిళలు 237 కోట్ల జీరో టికెట్లను ఉపయోగించుకోగా, అందుకు ప్రతిగా ప్రభుత్వం ఆర్టీసీకి 7980 కోట్ల రూపాయలు చెల్లించింది. ఈ నేపథ్యంలో, బస్సులు, బస్ స్టేషన్లలో మరియు టీమ్ మిషన్ల ద్వారా వచ్చే టికెట్లపై అడ్వర్టైజ్‌మెంట్ల ద్వారా ఆదాయాన్ని మరింత పెంచాలని మంత్రి సూచించారు.

### నష్టాల్లోని డిపోలకు ప్రత్యేక కార్యాచరణ

ప్రస్తుతం నష్టాల్లో ఉన్న తాండూరు, వికారాబాద్, బీహెచ్ఈఎల్, మియాపూర్, కుషాయిగూడ, దిల్ సుఖ్ నగర్, హకీంపేట, రాణిగంజ్, మిధాని వంటి పలు డిపోలు నష్టపోవడానికి గల కారణాలను అధ్యయనం చేసి, వాటిని లాభాల బాట పట్టించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని మంత్రి ఆదేశించారు.

### నగరంలో కొత్త రూట్లు, మౌలిక వసతులు

నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభాకు, కొత్తగా ఏర్పడుతున్న కాలనీలకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచడానికి యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా, కొల్లూరు వద్ద డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివసిస్తున్న వేలాది మందితో సహా కొత్త కాలనీల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త రూట్లలో బస్సులు నడిపించేలా స్థానిక డీఎంలు ఇతర అధికారులతో కలిసి నివేదిక రూపొందించాలని సూచించారు. నగరానికి కేటాయించిన 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు విడతలవారీగా రానుండడంతో, వాటికి సంబంధించిన చార్జింగ్ స్టేషన్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలకు అనుగుణంగా ఫోర్త్ సిటీలో బస్ టెర్మినల్ నిర్మాణం, బస్సు సౌకర్యాలపై అధ్యయనం చేయాలని సూచించారు.

### కొత్త టెర్మినల్స్, స్థలాల అన్వేషణ

నగరంలో నలువైపులా జేబీఎస్ మాదిరి బస్ స్టేషన్లు ఉండేలా ఆరంఘర్‌లో అధునాతన బస్సు టెర్మినల్ నిర్మించడానికి ఆర్టీసీ, పోలీస్ శాఖకు సంబంధించిన భూ బదలాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే, ఉప్పల్‌లో కూడా టెర్మినల్ నిర్మాణానికి అధ్యయనం చేయాలని, నగరంలో కొత్త బస్సు డిపోలకు అవసరమైన స్థల పరిశీలన చేసి జిల్లా కలెక్టర్ సహకారంతో ప్రభుత్వానికి నివేదిక పంపాలని తెలిపారు.

### ఉద్యోగుల నియామకం, ప్రొవిజన్ పీరియడ్ తగ్గింపు

ప్రస్తుతం ఇంటర్వ్యూ దశలో ఉన్న 1000 డ్రైవర్లు, 743 శ్రామిక్ పోస్టుల నియామకాలు వేగంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కారుణ్య నియామకాల కింద చేరిన కండక్టర్ల ప్రొవిజన్ పీరియడ్‌ను మూడు సంవత్సరాల నుండి రెండు సంవత్సరాలకు తగ్గించేలా పరిశీలించాలని అధికారులకు సూచించారు. డిసెంబర్ చివరిలోపు 84 ట్రాఫిక్ సూపర్వైజర్ ట్రైనీ, 114 సూపర్వైజర్ ట్రైనీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుందని తెలిపారు.

### భద్రత, ప్రమాదాల నివారణ

బస్సు ప్రమాదాలను తగ్గించడానికి, తొలి దశలో లహరి, రాజధాని, గరుడ బస్సుల్లో అమలవుతున్న 'డ్రైవర్ మానిటరింగ్ సిస్టం' పనితీరుపై ఆరా తీశారు. డ్రైవర్ నిద్ర ఉపక్రమించినా, మొబైల్ వాడినా అప్రమత్తం చేసే ఈ వ్యవస్థను విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్సుల్లో అమలు చేయడానికి కార్యాచరణ తీసుకోవాలని ఆదేశించారు. హైర్ బస్సు డ్రైవర్లకు నిరంతర శిక్షణ, ప్రతి బస్సుకు ఇద్దరు డ్రైవర్లు తప్పనిసరి అనే నిబంధనను కఠినతరం చేయాలని పేర్కొన్నారు.

### మేడారం జాతర, బస్ స్టేషన్ల ఆధునీకరణ

మేడారం జాతర సమీపిస్తుండటంతో, ములుగు బస్ స్టేషన్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని, డిసెంబర్ లోపు స్లాబ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జాతరకు 3800 బస్సులు నడపడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పుష్కరాల లోపు మంథని బస్ స్టేషన్ ఆధునీకరణ పూర్తి కావాలని, మధిర బస్ స్టేషన్ పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశం ముగింపులో, రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, ఇతర ఉద్యోగులతో త్వరలో జూమ్ సమావేశం నిర్వహిస్తానని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ సమీక్షలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం

- సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో సడలింపులు ఇవ్వాలి
- కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్,నవంబర్13 (మనసులో మాట):

సోయాబీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో సమస్యలపై కేంద్రానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి లేఖ రాశారు. 'మొంథా' తుఫాను, అకాల వర్షాలతో పంటలకు తీవ్ర నష్టం జరిగిందని, రైతులకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని కేంద్రానికి ఆయన విజ్ఞప్తి చేశారు. అలానే సోయాబీన్ ఎఫ్ఏక్యూ ప్రమాణాల్లో సడలింపు ఇవ్వాలని మంత్రి తుమ్మల కోరారు. వర్షాల ప్రభావంతో గింజల్లో రంగు మారడం, ముడతలు వచ్చాయి. ఔంఈఇఆ, ఔఅఅఈ సంస్థలకు పంటల నాణ్యత సడలింపు ఆదేశాలు ఇవ్వాలని కేంద్రాన్ని మంత్రి తుమ్మల కోరారు. రాష్ట్రంలో 3.66 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశారని, ఎకరాకు 7.62 క్వింటాళ్ల సగటు దిగుబడి వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 48,757 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేయడంతో 14,519 మంది రైతులకు లాభం చేకూరిందని మంత్రి తెలిపారు. కనీస మద్దతు ధర కింద మొత్తం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు సంస్థలకు అనుమతి ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. పత్తి కొనుగోళ్లలో ఎకరాకు 7 క్వింటాళ్ల పరిమితి అనేది రైతులకు నష్టం చేకూరుస్తుందని, ఆ పరిమితిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి తేమ శాతం సడలించి, ఎకరాకు 11.74 క్వింటాళ్ల దిగుబడి ఆధారంగా కొనుగోలు కొనసాగించాలని కేంద్రానికి సూచించారు. పత్తి మొక్కజొన్న, సోయాబీన్ రైతులకు రక్షణ కల్పించేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు.



# అర్హులైన పేదలకే ప్రభుత్వ పథకాలు

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్, నవంబర్ 13 (మనసులో మాట):

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన పేదలందరికీ అందేలా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి ఖానాపూర్ నియోజకవర్గానికి సంబంధించి వివిధ అభివృద్ధి పనులు, పథకాల అమలుపై సంబంధిత అధికారులు అందరితో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అన్నిటిని అర్హులైన నిరుపేదలకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, ఇండ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులకు మార్గ నిర్దేశం చేస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల ఇంజనీరింగ్ ఏజెన్సీలో ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే గుత్తేదారును మార్చేందుకు వెనకడుగు వేయవద్దని పేర్కొన్నారు. ప్రజలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం, త్రాగునీరు, వంతెనలు, గృహాలు, విద్యుత్ అందించి, వారి జీవన ప్రమాణాలు పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఏ కారణాల చేతనైనా అభివృద్ధి పనులు ఆగితే, వెంటనే తమ దృష్టికి తేవాలని తెలిపారు.



### అభ్యున్నతే సాధించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసి పేదలకు అభ్యున్నతికి తోడ్పడటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. పథకాలన్నీ సమర్ధవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎట్టి పరిస్థితుల్లో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని చెప్పారు. ఇండ్లు లేని నిరుపేదలందరికీ సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించిందని అన్నారు. మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ వెంటనే పూర్తి చేయాలని అన్నారు. నియోజకవర్గంలోని మండలాలలో మంజూరైన ఇండ్లు, నిర్మాణంలో ఉన్న ఇండ్లకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ మండలాలలో అటవీశాఖ తో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇబ్బందులు ఉన్న సమాచారాన్ని అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. వివిధ ఇంజనీరింగ్ ఏజెన్సీల ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన పనులకు సంబంధించి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. నిర్మాణాలకు అనుమతులు లభించి, పనులు ప్రారంభించినట్లయితే వెంటనే పనులను ప్రారంభించి పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నిర్మాణంలో అలసత్వం వహించకూడదని హెచ్చరించారు. ఆయా నిర్మాణాలకు సంబంధించి అటవీ శాఖ పరిధిలో ఏవైనా ఇబ్బందులు ఉంటే పరిష్కరించాలని తెలిపారు. మదనపు నిధులు అవసరం ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేసేలా ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. సమావేశ అనంతరం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వారోత్సవాలకు సంబంధించి గోడప్రతులను కలెక్టర్, ఎమ్మెల్యే, అధికారులు ఆవిష్కరించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ నాగినిభాను, ఆర్డిఓ రత్నకళ్యాణి, మండల ప్రత్యేక అధికారి జీవరత్నం, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక



# సర్కారు కార్యాలయాలకు సౌర వెలుగులు

- సోలార్ మోడల్ గ్రామంగా నంచర్ల ఎంపిక



**మహమదాబాద్, నవంబర్ 13 (మనసులో మాట):**

సౌర విద్యుత్తును ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో వినియోగం అధికంగా ఉండే ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్తు సమ స్యలు తలెత్తకుండా.. పర్యావరణానికి హాని జరగకుండా.. బిల్లుల భారం నుంచి విముక్తి కలిగేలా.. సౌర విద్యు త్తును వినియోగంలోకి తెచ్చేందుకు కేంద్రం 'పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలీ యోజన'ను అమలులోకి తెచ్చింది. ఈ మేరకు జిల్లాకు ఒక గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసి పథకం అమలు చేస్తారు. ఈ క్రమంలో మహబూబ్ నగర్ జిల్లాలో మహమ్మదాబాద్ మండలం లోని నంచర్ల గ్రామం ను ఎంపిక చేశారు.

### కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు ఎంపిక

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 5 వేల కంటే ఎక్కువ జనాభా కలిగిన గ్రామాల్లో అధిక సౌర విద్యు చ్ఛక్తి కలిగిన ఒక గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేస్తారు. జిల్లా మొత్తంలో 16 గ్రామాల్లో 5 వేల కంటే ఎక్కువ జనాభా ఉంది. ఆరు నెలల కిందట జిల్లాస్థాయి కమిటీ ఈ గ్రామాల మధ్యపోటీ నిర్వహించింది. ఇందులో నంచర్ల అత్యధిక సౌర విద్యుచ్ఛక్తి కలిగిన గ్రామంగా నిలిచింది. దీంతో నంచర్ల మోడల్ గ్రామంగా ఎంపికైనట్లు అధికారులు ప్రకటించారు.

### తగ్గనున్న బిల్లుల భారం

ఈ పథకం కింద గ్రామంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయ భవనంపై కేంద్ర ప్రభుత్వ నిధులతో సౌర విద్యుత్తు ప్లాంట్లు నిర్మిస్తారు. దీంతో కార్యా లయాలకు బిల్లుల భారం తగ్గడంతో పాటు అంతరాయం లేని సరఫరా జరుగుతుంది. ప్రభుత్వ కార్యాలయాలపై సౌర పలకల ఏర్పాటుకు అనువైన భవనాల గుర్తింపు, పరి మాణాలు తదితర అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తారు. త్వరలోనే ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు రెడ్కో' మేనేజర్ కె.మనోహర్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎల్ఆర్ఎస్. దరఖాస్తులను వేగవంతంగా పూర్తి చేయండి

**నగరంలో అనధికారిక లేఅవుట్లను గుర్తించండి**

**పెండింగ్‌లోని 17 వేల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి**

**టౌన్ ప్లానింగ్ అధికారులకు మేయర్ గుండు సుధారాణి ఆదేశం**



**వరంగల్, నవంబర్ 13 (మనసులో మాట):**

పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ దరఖాస్తులను త్వరితగతిన మంజూరు చేయాలని వరంగల్ నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా, నగరంలో అనధికారిక (అనధరైజ్డ్) లేఅవుట్లను గుర్తించి వాటిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మేయర్ కాన్ఫరెన్స్ హాలులో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన అధికారులతో మేయర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు సమర్థవంతంగా పనులు చేపట్టడానికి తగు సూచనలు చేశారు. ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షిస్తూ మేయర్ కీలక ఆదేశాలు ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న ఎల్.ఆర్.ఎస్.కు చెందిన ఎల్1 లాగిన్‌లో సుమారు 15 వేలు, ఎల్2 లాగిన్‌లో 2 వేలు చొప్పున మొత్తం 17 వేల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అంతర్ విభాగ సమన్వయం: ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో లింక్ అయి ఉన్న దరఖాస్తులను కాకుండా మిగతా దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అనంతరం, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు త్వరితగతిన మంజూరు ఇవ్వాలని సూచించారు. బల్దియాకు సంబంధించిన సుమారు 11 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని నెల రోజులలోగా పరిష్కరించాలని మేయర్ గడువు విధించారు.

### అనధికారిక లేఅవుట్లపై ఉక్కుపాదం

నగర పరిధిలో ఉన్న అనధరైజ్డ్ లేఅవుట్లను గుర్తించాలని అధికారులను మేయర్ ఆదేశించారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ అధికారులు చైన్‌మెన్‌లతో సహా ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి, అక్రమ లేఅవుట్లను గుర్తించి సమాచారం అందజేయాలని సూచించారు. వెంటనే టీపీఆర్ (టౌన్ ప్లానింగ్ రిమూవల్) నోటీసులు అందజేసి, అక్రమ నిర్మాణాల తొలగింపు చేపట్టాలని మేయర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రవీందర్, ఏ.సి.పి.లు ఖలీల్, రజిత, ప్రశాంత్ తో పాటు టి.పి.ఎస్.లు, టి.పి.బి.ఓ.లు, చైన్‌మెన్‌లు తదితరులు పాల్గొన్నారు.

# తడి, పొడి చెత్త వేరుగా సేకరించాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్
- శివనగర్‌లో శానిటేషన్ తనిఖీలు
- సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించేలా చూడాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశం.



**వరంగల్ కార్పొరేషన్, నవంబర్ 13 (మనసులో మాట):**

వరంగల్ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరిచేందుకు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శానిటేషన్ తనిఖీలలో భాగంగా గురువారం బల్దియా పరిధిలోని 34వ డివిజన్ శివనగర్‌లో కమిషనర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. దీంతోపాటు, పోతన నగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను కూడా ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, స్వచ్ఛ ఆటోల 'రూట్ ఆప్టిమైజేషన్' ప్రకారం తిరుగుతున్నాయా లేదా అని తనిఖీ చేయాలన్నారు. ప్రతి స్వచ్ఛ ఆటో పరిధిలో ఉండే 600 గృహాలకు 4 సిబ్బందిని నియమించి, వారు తమ విధులు సక్రమంగా నిర్వహిస్తూ స్వచ్ఛ ఆటోకు చెత్తను అందజేస్తున్నారా? లేదా? అనే విషయాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరుగా అందించేలా చూడాలని సూచించారు. నగరంలో స్మార్ట్ గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (చెత్తాచెదారం పేరుకుపోయే సున్నిత ప్రాంతాలు) లేకుండా చూసుకోవాలని, ప్రతి ఇంటి నుండి చెత్తను తప్పనిసరిగా సేకరించాలని కమిషనర్ అన్నారు.

### సెట్‌బ్యాక్ నిబంధనల అమలు:

బిల్డింగ్ అనుమతులు మంజూరు చేసే క్రమంలో సెట్‌బ్యాక్ నిబంధనలు పాటిస్తున్నారా లేదా అని క్షుణ్ణంగా పరిశీలించాలని కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం, పోతన నగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను సందర్శించి, స్వచ్ఛ ఆటోల పనితీరు, కంపోస్ట్ తయారీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పాటు చేయబోయే బయో కంపోస్ట్ షెడ్‌ను కూడా కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ డా. రాజేష్, ఏసీపీ ఖలీల్, శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను, ఏఈ హబీబ్, టీపీబీఓ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- హుజూర్‌నగర్‌లో గృహ నిర్మాణం, ధాన్యం కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణ
- 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ



**సూర్యాపేట, నవంబర్ 13 (మనసులో మాట):**

పేదవారి సొంతింటి కలను నెరవేర్చేందుకు ఉద్దేశించిన సింగిల్ బెడ్ రూమ్ ఇంటి నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న సింగిల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ పనులను పర్యవేక్షించారు. కలెక్టర్ ఇందిరమ్మ కాలనీ మొత్తం తిరుగుతూ గృహ నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. రోడ్లు, నిర్మాణంలో ఉన్న నీటి సంపు, సెప్టిక్ ట్యాంక్, హాస్పిటల్ పనులు, విద్యుత్ సరఫరా వంటి ఇతర మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ పట్టణంలో మొత్తం 2160 సింగిల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరయ్యాయి. 135 బ్లాక్‌లలో నిర్మాణం జరుగుతుండగా, ఇప్పటికే 124 బ్లాక్‌లలో 1984 ఇండ్లు పూర్తయ్యాయి. మిగిలిన 11 బ్లాక్‌లలో స్లాబ్ పూర్తయి గోడల పనులు జరుగుతున్నాయని, వాటిని త్వరగా పూర్తి చేస్తామని కలెక్టర్ వివరించారు. సెప్టిక్ ట్యాంక్, రెండు నీటి సంపులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఇతర నిర్మాణాల సమీక్ష: డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, ఆర్ %డ్% బి అతిథి గృహం నిర్మాణ పనుల పురోగతిపై కూడా కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ:

వేపలసింగారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీరియల్ రిజిస్టర్‌ను పరిశీలించి, ఇప్పటివరకు 14 మంది రైతులు ధాన్యం తెచ్చారని, తేమ శాతం 17 రాగానే తుకపరిచి కాంటా వేసి మిల్లులకు తరలిస్తున్నామని నిర్వాహకులు వివరించారు. అనంతరం హుజూర్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... జిల్లాలో మొత్తం 338 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఇప్పటి వరకు 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని, రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధరతో పాటు సన్నాలకు బోనస్ పొందాలని కోరారు. ట్యాబ్ ఎంట్రీ చేసిన 48 గంటల లోపు రైతుల అకౌంట్లలో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### నైపుణ్యాభివృద్ధి కేంద్రం సందర్శన:

హుజూర్‌నగర్‌లోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ను కూడా కలెక్టర్ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడుతూ, ఏటీసీ ద్వారా మంచి నైపుణ్యాలు నేర్చుకొని ఉపాధి కల్పన పొంది జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. భూ భారతి దరఖాస్తులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని, ప్రతిరోజూ భూ భారతి, ధాన్యం కొనుగోలు అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్‌తో పాటు ఆర్డీఓ శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఎంపీడీఓ సుమంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, డీఈ జంగయ్య, డీటీ నాగేందర్, ఏఈ సాయిరాం రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా, పీఏసీఎస్ సీఈఓ వీరబాబు, సెంటర్ ఇన్‌ఛార్జ్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ సజావుగా జరిగేలా చర్యలు

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**సింగరేణి పెండింగ్ అంశాలపై సమీక్ష**

**జాతీయ రహదారుల పరిహార చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం**



**రామగిరి, నవంబర్ 13 (మనసులో మాట):**

జిల్లాలో భూ సేకరణ ప్రక్రియ సజావుగా, సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రామగిరి మండల తహసిల్దార్ కార్యాలయంలో సింగరేణి సంస్థకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ అంశంపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బుధవారం పేట, రామయ్య పల్లి, ఆదివారం పేట గ్రామాలలో సింగరేణి సంస్థకు అవసరమైన భూ సేకరణ వివరాలు అందాయని తెలిపారు. ఎస్.డి.సి. (స్పెషల్ డిప్యూటీ కలెక్టర్), ఎంపీడీవో, తహసిల్దార్ మరియు సింగరేణి సంస్థ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, భూ సేకరణ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా చూడాలని అన్నారు. అదేవిధంగా, రామగిరి మండలంలో జాతీయ రహదారికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పరిహార చెల్లింపులను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, రామగిరి తహసిల్దార్ సుమన్, ఎంపీడీవో, ఎంపీఓ, సింగరేణి అధికారులు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్, నవంబర్ 13 (మనసులో మాట):**

క్రీడా రంగంలో రాణించడం ద్వారా అనేక ఉపాధి అవకాశాలు దక్కించుకోవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం స్థానిక న్యూ హౌసింగ్ బోర్డులోని మహాత్మా జ్యోతి బాపులే పాఠశాల, కళాశాలలో జరిగిన క్రీడా వార్షిక ముగింపు వేడుకల్లో పాల్గొని, జిల్లా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ చూపాలని సూచించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి క్రీడా విశ్వవిద్యాలయం ప్రారంభమవుతోందని, ఆదిలాబాద్, జాతర్ల, ఉట్నూర్‌లలో ఇప్పటికే క్రీడా పాఠశాలలు ఉన్నాయని గుర్తుచేశారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడల్లో రాణించడం ద్వారా స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తుంచుకుని ఉన్నత లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. అలాగే ఐఐటి, నీట్, జెఈఈ వంటి పోటీ పరీక్షల్లో రాణించేందుకు ప్రత్యేకంగా కోచింగ్ అందుబాటులో ఉందని తెలిపారు. అదనంగా, వసతి గృహాల్లో మెనూ, కాస్మొటిక్ చార్జీలను పెంచినట్లు కలెక్టర్ వివరించారు. వృద్ధులను ఓల్డ్ ఏజ్ హోమ్స్‌లో ఉంచకుండా గౌరవంగా చూసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీడల్లో ఓడిన విద్యార్థులు నిరుత్సాహపడకుండా, వచ్చే పోటీల్లో విజయానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గణేష్ జాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు భోజన సౌకర్యం

**ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే**



**ఆదిలాబాద్, నవంబర్ 13 (మనసులో మాట):**

రైతుల సౌకర్యార్థం మార్కెట్ యార్డులో భోజన వసతి కల్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. గురువారం ఆదిలాబాదు మార్కెట్ యార్డ్ లో ఇస్కాన్ ట్రస్ట్ సహకారముతో రైతులకు 10 రూపాయల కు అందించే మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని స్థానిక శాసన సభ్యులు పాయల శంకర్ తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్, ఎమ్మెల్యే, డిసిసిబి అడ్డి భోజారెడ్డి రైతులకు వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల సౌకర్యార్థం ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఇస్కాన్ వారి సహకారంతో పది రూపాయలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు బయట మార్కెట్ లో ఎక్కువ ధర ఉన్నందున తక్కువ ధరతో నాణ్యత, హైజీన్ గా ఇక్కడ భోజనం అందించడం జరుగుతుందన్నారు. అమ్మకాల కొరకు మార్కెట్ కు వచ్చిన రైతులకు, వారి వాహనాల డ్రైవర్ లకు ఉపయోగకరంగా ఉ ంటుందన్నారు. ఒక్కో పూట భోజనానికి 35 రూపాయలు ఖర్చు అవుతున్నట్లు అంచనా వేసి, 15 రూ. మార్కెటింగ్ శాఖ కాంట్రిబ్యూషన్ తో, 10 రూ. ఇస్కాన్ ట్రస్ట్ కాంట్రిబ్యూషన్ తో, 10 రూ. రైతుల కాంట్రిబ్యూషన్ తో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి అనుమతి ఇచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారికి కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇస్కాన్ ట్రస్ట్ సహకారంతో ఈ రోజు ఆదిలాబాద్ మార్కెట్లో మధ్యాహ్న భోజనం కార్యక్రమం ప్రారంభించడం శుభపరిణామమని, దేశానికి అన్నం పెట్టే రైతన్నకు ఒకపూట భోజనం పెట్టే అవకాశం దొరికిందన్నారు. జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, ఇతర అధికారులు, ఇస్కాన్ ట్రస్ట్ ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండాసురేఖపై పరువునష్టం దావా ఉపసంహరణ

### క్షమాపణల నేపథ్యంలో నాగార్జున నిర్ణయం



**హైదరాబాద్,నవంబర్13(మనసులో మాట):** తెలంగాణ మంత్రి కొండా సురేఖపై వేసిన పరువు నష్టం దావా కేసును ప్రముఖ సినీ హీరో నాగార్జున వెనక్కి తీసుకున్నారు. తమ కుటుంబంపై సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వేసిన పరువు నష్టం దావా కేసును ఉపసంహరించుకున్నట్లు నాగార్జున వెల్లడించారు. గతంలో నాగచైతన్య- సమంత విడాకులపై మంత్రి కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2 అక్టోబరు 2024న హైదరాబాద్ మీడియాతో మాట్లాడిన మంత్రి సురేఖ.. నాగచైతన్య-సమంత విడాకులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆరే కారణమంటూ సంచలన కామెంట్స్ చేశారు. తెలంగాణ రాజకీయాల్లో ఈ కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. మంత్రి వ్యాఖ్యలపై సీరియస్ అయిన నటుడు నాగార్జున పరువు నష్టం దావా కేసు వేశారు. క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పిటిషన్ వేశారు. కేసుపై నాంపల్లి స్పెషల్ కోర్టు గురువారం విచారణ చేపట్టింది. అయితే, కొండా సురేఖ బహిరంగ క్షమాపణ చెప్పడంతో కేసును విత్ డ్రా చేసుకున్నారు నాగార్జున. కాగా, ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా అక్కినేని కుటుంబానికి రెండుసార్లు క్షమాపణ చెప్పారు మంత్రి కొండా సురేఖ. ఈ క్రమంలో మంత్రి కొండా సురేఖపై వేసిన క్రిమినల్ దావాను ప్రముఖ నటుడు నాగార్జున ఉపసంహరించుకున్నారు. నాగార్జున కుటుంబంపై తాను గతంలో చేసిన వ్యాఖ్యలపై చింతిస్తున్నానని మంత్రి కొండా సురేఖ ఎక్స్‌లో పోస్టు చేశారు. నాగార్జున, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనే ఉద్దేశంతో నేను ఆ వ్యాఖ్యలు చేయలేదు. వారిని ఇబ్బందిపెట్టాలని కాని, వారి పరువు-ప్రతిష్టలకు భంగం కలిగించాలన్నది కాని నా ఉద్దేశం కాదు. నాగార్జున కుటుంబంపై నేను చేసిన వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా. నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నానని పేర్కొన్నారు. ఈ క్రమంలో మంత్రిపై దాఖలు చేసిన పరువునష్టం కేసును ఉప సంహరించుకుంటున్నట్టు నాగార్జున తెలిపారు.

## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**పరిగి, నవంబర్ 13 (మనసులో మాట):** పరిగి పట్టణ కేంద్రంలోని పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మార్క్ ఫెడ్ ద్వారా ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ఆర్.ఆర్. మాట్లాడుతూ, రైతులు ఏమాత్రం ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారమే కొనుగోలు జరుగుతుందని హామీ ఇచ్చారు. రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. దళారులను నమ్మి మోసపోవద్దని రైతులకు సూచించారు. రైతులందరూ తాము పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని, ఈ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## నగర అభివృద్ధి ప్రణాళికలపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష

### ఒక్కో డివిజన్ వారీగా పురోగతిని సమీక్షిస్తూ అధికారులకు దిశానిర్దేశం

### ఖాళీ స్థలాల పరిరక్షణ, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



**నిజామాబాద్, నవంబర్ 13 (మనసులో మాట):** నిజామాబాద్ నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో, నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి హోదాలో జిల్లా కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నగర పాలక సంస్థ పనితీరుపై కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్, ఒక్కో డివిజన్ వారీగా నెలకొని ఉన్న క్షేత్రస్థాయి పరిస్థితులను, సమస్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగతం చేసుకుంటూ, అభివృద్ధి ప్రణాళికలపై కీలక సూచనలు చేశారు. ఖాళీ స్థలాలను గుర్తించి, వాటి సంరక్షణ కోసం తక్షణమే కంచె ఏర్పాటు చేయాలని, ఖాళీ స్థలాలు కబ్జాకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించేలా ఖాళీ స్థలాల్లో విరివిరిగా మొక్కలు నాటించాలని అన్నారు. మీడియన్, అవెన్యూ ప్లాంటేషన్ల నిర్వహణ సమర్థవంతంగా జరగాలని, ప్రతి మొక్క సంరక్షించబడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తడి, పొడి చెత్త సేకరణ: పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ప్రతి రోజు చెత్త సేకరణ ఆటో ట్రాలీలు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. అవకాశం ఉన్న చోట డ్రైనేజీలను శుభ్రపరచేందుకు జె.సి.బి.లను వినియోగించాలని సూచించారు. శానిటేషన్ సిబ్బంది అందరూ విధులకు హాజరయ్యేలా, అన్ని డివిజన్లలో శానిటేషన్ పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రతి నివాస ప్రాంతంలో పచ్చదనం, పరిశుభ్రత ఉట్టిపడేలా చొరవ చూపాలని అన్నారు. త్వరితగతిన పూర్తి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చొరవ చూపాలని అన్నారు. అర్హులైన కొత్త లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఇప్పటికే మంజూరీలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసుకునేలా పర్యవేక్షణ జరపాలని, అవసరమైన వారికి మెప్మా ద్వారా విరివిరిగా రుణాలు ఇప్పించాలని సూచించారు. తదుపరి సమీక్ష నాటికి స్పష్టమైన ప్రగతి కనిపించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ పి.డి. పవన్ కుమార్, ఈ.ఈ. నివర్తి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవిబాబు, వివిధ విభాగాల అధికారులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో హై అలర్ట్

- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ముమ్మర తనిఖీలు
- పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్‌లోనూ సోదాలు




**హైదరాబాద్,నవంబర్13 (మనసులో మాట):** భాగ్యనగరంలో హైఅలర్ట్ కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన బాంబు పేలుళ్ల నేపథ్యంలో మెట్రో నగరాల్లో హై అలర్ట్ కొనసాగుతోంది. బస్టాండ్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు , శంషాబాద్ ఎయిర్ పోర్టులలో విస్తృత తనిఖీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అధికారులు తనిఖీలు నిర్వహించారు. మతపరమైన ప్రాంతాలు, పర్యాటక ప్రాంతాలు, షాపింగ్ మాల్స్‌లోనూ సోదాలు జరుగుతున్నాయి. అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిటీ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. హోటల్స్‌పై పోలీసులు నిఘా పెంచారు. ఇక.. దేశంలో ఎక్కడ, ఏ ప్రాంతంలో పేలుళ్లు జరిగినా వాటి మూలాలు హైదరాబాద్‌లో ఉండటం తీవ్ర కలకలం రేపుతున్న విషయం. ఎన్ఐఏ, వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసులు రాష్ట్రంలో తనిఖీలు చేయగా.. అనుమానిత వ్యక్తులు పట్టుబడటం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల రాజేంద్రనగర్‌లో ఉగ్రవాద ఆరోపణలతో డాక్టర్ అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌ను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. గత అర్ధరాత్రి సయ్యద్ ఇంట్లో సోదాలు జరిపిన గుజరాత్ పోలీసులు.. పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం ఢిల్లీలో భారీ పేలుడు ఘటన దేశాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఎర్రకోట మెట్రోస్టేషన్ సిగ్నల్ వద్ద నిలిచిన ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీ బ్లాస్ట్‌తో దేశవ్యాప్తంగా మెట్రో నగరాల్లో హైఅలర్ట్ కొనసాగుతోంది.

## చిట్లపల్లిలో వరి పంట పరిశీలన



**కొడంగల్, నవంబర్ 13 (మనసులో మాట):** వికారాబాద్ జిల్లా, కొడంగల్ మండలంలోని చిట్లపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి (ఏ.ఓ.) శ్రీలత ఈరోజు పంట పరిశీలన కార్యక్రమం సందర్భంగా వరి పంట స్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడి పంట వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు: రైతులు ప్రభుత్వం దృష్టికి తమ పంట వివరాలు చేరేందుకు పంట నమోదు ప్రక్రియను తప్పనిసరిగా సమయానికి పూర్తి చేసుకోవాలని సూచించారు. పంట మరింత మెరుగ్గా అభివృద్ధి చెందడానికి, ఎరువుల వినియోగం మరియు ముఖ్యంగా నీటి వినియోగం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చిట్లపల్లి క్లస్టర్ ఏఈఓ ఇస్సాక్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.



## జిల్లా సరిహద్దులో నాకాబందీ

### అక్రమ రవాణాపై ఉక్కుపాదం

### నిషేధిత వస్తువులు, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా 367 వాహనాల తనిఖీ

**నారాయణపేట, నవంబర్ 13 (మనసులో మాట):** నారాయణపేట జిల్లా ప్రజల శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఆధ్వర్యంలో కర్ణాటక సరిహద్దులోని కృష్ణ బోర్డర్ చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రాత్రి ప్రత్యేక నాకాబందీ చేపట్టారు. బుధవారం రాత్రి 10:00 గంటల నుండి అర్ధరాత్రి 3:30 గంటల వరకు కొనసాగిన ఈ విస్తృత తనిఖీల్లో 367 వాహనాలను పరిశీలించారు. ఈ ఆపరేషన్‌లో ఇద్దరు డీఎస్పీలు, ఇద్దరు సీఐలు, 8 మంది ఎస్సైలు సహా మొత్తం 65 మంది పోలీసులు, సిబ్బంది మరియు పోలీసు జాగిలాలను ఉపయోగించారు. ఈ తనిఖీలలో భాగంగా అక్రమంగా తరలిస్తున్న రెండు వరి ధాన్యంతో కూడిన లారీలు, ఒక ఇసుక లారీ, 200 లీటర్ల డీజిల్ ...ను స్వాధీనం చేసుకొని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ... జిల్లా ఇతర రాష్ట్రాల సరిహద్దులు కలిగి ఉండటం వలన, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే నిషేధించబడిన డ్రగ్స్, గంజాయి, గుట్కా, అక్రమ మద్యం, ఇసుక, పీడీఎస్ రైస్ వంటి ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే వస్తువుల అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు తెలియజేశారు. "రాత్రి వేళల్లో అక్రమ వ్యాపారాలు, చట్ట విరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు మరియు దొంగతనాల నివారణకు నిరంతరం తనిఖీలు కొనసాగిస్తున్నాము. ఎవరు అక్రమ రవాణా లేదా చట్టానికి విరుద్ధంగా వ్యవహరించినా కఠిన చర్యలు తప్పవు," అని ఎస్పీ హెచ్చరించారు. సరిహద్దు ప్రాంతాల్లో పహారాను మరింత బలోపేతం చేయాలని పోలీసు అధికారులకు ఆయన సూచించారు. ఈ తనిఖీల్లో అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హూల్ హక్, డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్, సీఐలు రామ్ లాల్, రాజేందర్ రెడ్డి, ఎస్సైలు, పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుపై రైతులను మళ్లించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- 20 లక్షల ఎకరాల లక్ష్యంలో భాగంగా 3 వేల ఎకరాలు సాగు చేయాలని టార్గెట్
- ఎకరానికి రూ. 50,918 సబ్సిడీ



**సూర్యాపేట, నవంబర్ 13 (మనసులో మాట):** వరి వంటి సాంప్రదాయ పంటల కంటే అధిక లాభాలు చేకూర్చే ప్రత్యామ్నాయ వాణిజ్య పంట అయిన ఆయిల్ పామ్ (పామాయిల్) సాగు వైపు రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని పీఏసీఎస్ అధ్యక్షులు, కార్యదర్శులు, ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ, సహకార శాఖ అధికారులతో ఆయన ఆయిల్ పామ్ సాగుపై సమీక్షా సమావేశం నిర్వహించారు.

**ఆయిల్ పామ్ సాగు ఆవశ్యకత**

భారతదేశం మలేషియా, ఇండోనేషియా వంటి ఆగ్నేయాసియా దేశాల నుండి లక్ష కోట్లు ఖర్చుపెట్టి ఎడిబుల్ ఆయిల్ (వంట నూనె)ను దిగుమతి చేసుకుంటున్నదని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని 31 జిల్లాల భూములు ఆయిల్ పామ్‌కు సానుకూలంగా ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఏకంగా 20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. జిల్లాలో ఇప్పటికే 5,560 ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేయడం జరిగిందని తెలిపారు. 2025-26 సంవత్సరానికి 3,000 ఎకరాలు లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 2,011 ఎకరాలను గుర్తించి, 1,139 ఎకరాలకు సబ్సిడీ మంజూరు చేయగా, 696 ఎకరాలలో మొక్కలు నాటడం పూర్తయిందని స్పష్టం చేశారు.

**రైతులను ప్రోత్సహించే చర్యలు:**

ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల వైపు రైతులను మళ్లించేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని కలెక్టర్ వివరించారు. ఆయిల్ పామ్ సాగు చేసేందుకు ఎకరానికి రూ. 50,918 సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందిస్తోంది. ఒక్కసారి మొక్క నాటితే మూడు నుంచి నాలుగు సంవత్సరాల నుండే పంట దిగుబడి వస్తుందని తెలిపారు. అలాగే, అంతర పంటగా కూరగాయలు, పూలు, కంది, పెసర లాంటి పంటలు సాగు చేసి అదనపు లాభాలు పొందవచ్చని సూచించారు. తక్కువ శ్రమతో, తక్కువ నీటి వనరులతో ఎక్కువ కాలం లాభాలు చేకూర్చే పామాయిల్ సాగుపై రైతులను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

**అధికారులకు కీలక ఆదేశాలు:**

ఆసక్తి ఉన్న రైతులను క్షేత్రస్థాయిలో ఆయిల్ పామ్ తోటలకు తీసుకొని వెళ్లి, సాగుకు అయ్యే ఖర్చు, శ్రమ, వచ్చే లాభాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యాపారం, ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాలలో నివసించే వారికి తమ స్వగ్రామంలో భూములు ఉంటే పామాయిల్ సాగు అనుకూలంగా ఉంటుందని, అలాంటి వారిని గుర్తించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సంవత్సరం నుండి ప్రతి సహకార సొసైటీ పరిధిలో వెయ్యి ఎకరాల చొప్పున, మొత్తం 47 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేసేలా రైతులను అవగాహన పరచాలని సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులకు కలెక్టర్ సూచించారు. రైతులు పండించిన పంటను నిల్వ చేసేందుకు స్థలం ఉన్న పీఏసీఎస్‌లు నాబార్డ్ ద్వారా రుణాలు తీసుకొని గోదాములు, షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించుకొని, వాటిని అద్దె ప్రాతిపదికన లీజుకి ఇచ్చి రుణాలు చెల్లించుకోవాలని సూచించారు. అనంతరం హార్టికల్చర్ టెక్నికల్ అధికారి మహేష్ పీపీటీ ద్వారా ఆయిల్ పామ్ సాగుకు సంబంధించిన అంశాలను వివరించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి ప్రవీణ్, ఉద్యానవన అధికారి నాగయ్య, వ్యవసాయ అధికారి నివేదిత, నాబార్డ్ డీడీఎం వినయ్ కుమార్, అసిస్టెంట్ రిజిస్టర్ అంజయ్య, పీఏసీఎస్ అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై షీ టీమ్ ప్రత్యేక దృష్టి

- విద్యార్థులకు అవగాహన సదస్సు



**పూడూర్, నవంబర్ 13 (మనసులో మాట):**

మహిళలు, బాలికల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ 'షీ' టీమ్ ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. వికారాబాద్ జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మే-రకు, పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు ఆధ్వర్యంలో గురువారం పూడూర్ మండలం చెంగ్యముల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంచన్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సింహులు మాట్లాడుతూ, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లైన వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, లేదా ఫోన్ మెసేజ్‌ల ద్వారా ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే ఏమాత్రం వెనుకాడకుండా వెంటనే "షీ" టీమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. "షీ" టీమ్‌ను ఆశ్రయిస్తే మహిళలు సురక్షితంగా ఉండవచ్చని భరోసా ఇచ్చారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలు పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్లు 100 మరియు 181 లను సంప్రదించాలని ఆయన తెలిపారు. అలాగే, సైబర్ నేరాల ద్వారా మోసపోయినట్లు గుర్తించిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో మహిళలపై జరుగుతున్న నేరాలు, నిర్భయ చట్టం, పోక్సో చట్టం, సీసీ కెమెరాల వినియోగం, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం వంటి అనేక ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా, మహిళలు మరియు బాలికలు తమ మొబైల్స్‌లో భద్రత కోసం టీ-సేఫ్ (%u-ఝటవ%) యాప్ను ప్లే స్టోర్ ద్వారా యాక్టివేట్ చేసుకోవాలని సూచించారు. "షీ" టీమ్ బృందం పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, ఆసుపత్రులు, కూడళ్లు, మార్కెట్‌లు వంటి జనసమ్మర్ధం ఉండే ప్రాంతాలలో నిరంతరం నిఘా ఉంచుతుందని ఆయన తెలిపారు. యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్ యాక్ట్, రోడ్ సేఫ్టీ, ట్రాఫిక్ సేఫ్టీ వంటి అంశాల గురించి కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ కృష్ణమాచారి, ఉపాధ్యాయులు, "షీ" టీమ్ సభ్యులు బి. సావిత్రి పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరాల పిల్లలకు సమాన అవకాశాలు

కలెక్టర్ పి. ప్రావీణ్య



**సంగారెడ్డి, నవంబర్ 13 (మనసులో మాట):**

మానసిక వికలాంగతతో బాధపడుతున్న పిల్లలు మన సమాజంలో అంతర్భాగమని, వారికి సమాన అవకాశాలు కల్పించడం మనందరి సామాజిక బాధ్యత అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని హాస్టల్ గడ్డలో ఉన్న సహారా ప్రాథమిక పునరావాస కేంద్రం లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు.

**సమగ్ర పునరావాస కేంద్రాల ఆవశ్యకత**

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సహారా వంటి సమగ్ర పునరావాస కేంద్రాల ఏర్పాటు వల్ల ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. పిల్లల అభివృద్ధికి సంస్థ అందిస్తున్న ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ వంటి సేవలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమాజంలోని అంచున ఉన్న ఈ పిల్లలకు ప్రేమ, శ్రద్ధ, విద్య, ఆరోగ్యం అందించాలనే సంకల్పాన్ని సహారా కేంద్రం బలోపేతం చేస్తోందని, ఇది నిజంగా ఆదర్శప్రాయమని ఆమె కొనియాడారు. ఈ సేవలు వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నాయని కలెక్టర్ అభిప్రాయపడ్డారు.

**'ఇన్‌క్లూజివ్ స్కూల్' ఏర్పాటుకు సన్నాహాలు**

సహారా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రతిమా రెడ్డి, డైరెక్టర్ శంకర్లు కేంద్రం కార్యకలాపాలను కలెక్టర్‌కు వివరించారు. వారు మాట్లాడుతూ, త్వరలో ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ఒక ఇన్‌క్లూజివ్ స్కూల్ (సమ్మిళిత పాఠశాల) ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని వెల్లడించారు. సాధారణ విద్యార్థులు మరియు ప్రత్యేక అవసరాలున్న పిల్లలు కలిసి చదువుకునే విధంగా ఈ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ పద్ధతిని అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ కేంద్రంలో 50 మందికి పైగా పిల్లలు వివిధ థెరపీలను పొందుతున్నారని వారు తెలియజేశారు. సహారా సంస్థ పిల్లలు, పెద్దలు వైద్య, మానసిక, శారీరక పునరావాస సేవలు పొందే విధంగా ఒక ఇన్‌క్లూజివ్ ఆసుపత్రిని కూడా నిర్వహిస్తోంది.



## కస్తూర్బా బాలికల అడ్వెంచర్ క్యాంప్.. కలెక్టర్ అభినందనలు

- సాహసం, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసానికి ఇలాంటి కార్యక్రమాలు కీలకం
- కలెక్టర్ పి.ప్రావీణ్య

**పుల్కల్, నవంబర్ 13 (మనసులో మాట):**

సంగారెడ్డి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులు సాహస స్ఫూర్తిని ప్రదర్శించారు. పుల్కల్ మండలం కస్తూర్బా పాఠశాల విద్యార్థినులు సంగారెడ్డి మండలంలో ఉన్న సుందరమైన మంజీరా పర్యాటక కేంద్రంలో నిర్వహించిన ఒక రోజు 'అడ్వెంచర్ హంట్' కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతి సోయగాల మధ్య గుడారాలు వేసుకుని విద్యార్థినులు ఒక రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య స్వయంగా అడ్వెంచర్ క్యాంప్‌ను సందర్శించి, బాలికలతో స్నేహపూర్వకంగా మాట్లాడారు. కార్యక్రమాలు విద్యార్థుల్లో ధైర్యసాహసాలు, ఆత్మవిశ్వాసం, బృందస్ఫూర్తిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని అభినందించారు. జీవితంలో ఎదు-రయ్యే ఎలాంటి సవాళ్లకైనా భయపడకుండా, ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగడానికి ఈ తరహా అనుభవాలు ఎంతో తోడ్పడతాయని విద్యార్థినులకు సూచించారు. "అమ్మాయిల శక్తి, ధైర్యం, సాహసానికి పరిమితులు లేవు. నేటి సమాజంలో ఆడబిడ్డలు అంకితభావంతో ముందుకు సాగి, విద్య, ఉద్యోగం, వ్యాపారం వంటి ప్రతి రంగంలో తమ ప్రతిభను నిరూపిస్తున్నారు" అని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళలు స్వయం ఉపాధి లేదా ఉద్యోగాల ద్వారా ఆర్థికంగా ఎదగడం దేశాభివృద్ధికి కూడా దోహదపడుతుందని తెలిపారు. ప్రకృతి వాతావరణంలో జరిగిన ఈ అడ్వెంచర్ హంట్ కార్యక్రమం విద్యార్థినుల్లో ఉత్సాహం, మానసిక ప్రశాంతత, సృజనాత్మకతను పెంచిందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు దీపిక, ప్రతిభ, ఎంఈఓ శంకర్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సృజనాత్మకతను వెలికితీసేందుకే యువజనోత్సవాలు

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, నవంబర్ 13 (మనసులో మాట):**

విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీయడానికి యువజన ఉత్సవాలు దోహదపడతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌టిఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాల ప్రారంభోత్సవంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ కు ఎన్‌సిసి విద్యార్థులు బ్యాండ్ మేళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి మనిషి జీవితంలో యవ్వన దశ ఎంతో కీలకమైనదని, ఈ దశలో ఎటువంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా, జీవితంలో స్పష్టమైన లక్ష్యం పెట్టుకుని దానిని సాధించడానికి కృషి చేయాలన్నారు. స్వామి వివేకానంద వంటి మహనీయుల ఆలోచనలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువజన ఉత్సవాల ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, నాయకత్వ గుణాలు, బృందాత్మకత పెంపొందుతాయని తెలిపారు. గత ఏడాది రాష్ట్రస్థాయిలో నిర్మల్ జిల్లాకు రెండో స్థానం రావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈసారి మరింత ప్రతిభ కనబరచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తెచ్చేలా విద్యార్థులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రతి విద్యార్థి పాల్గొనే అవకాశాన్ని కల్పించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు.



**గెలవడం కంటే పాల్గొనడమే ముఖ్యం%-% అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, క్రీడలు, సాంస్కృతిక పోటీలలో గెలవడం కంటే పాల్గొనడమే ముఖ్యమైందని తెలిపారు. ఇలాంటి ఉత్సవాలు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించడంలో, ఆత్మవిశ్వాసం పెంచడంలో దోహదపడతాయని అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవాన్ని జరుపుకుంటామని, అదే స్ఫూర్తితో ఈ యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నామని వివరించారు. వివేకానంద భారత యువతకు ప్రేరణ. ఆయన చూపిన మార్గంలో నడిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. అనంతరం కలెక్టర్ వైజ్ఞానిక ప్రదర్శనలను ప్రారంభించి, విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. విద్యార్థులు తమ ఆవిష్కరణలను కలెక్టర్, అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెం ఉత్పత్తులకు విశేష ఆదరణ

కలెక్టర్ చొరవతో సీఎస్ఆర్ సమ్మిట్‌లో స్టాల్ ఏర్పాటు



**హైదరాబాద్, నవంబర్ 13 (మనసులో మాట):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా శక్తికి, గిరిజన ఉత్పత్తుల గొప్పదనానికి హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక సీఎస్ఆర్ సమ్మిట్ వేదికైంది. జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ గారి ప్రత్యేక చొరవతో, శిల్ప కళా వేదిక, శిల్పారామంలో జరుగుతున్న 'భారత్ సమ్మిట్'లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌కి సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ స్టాల్‌లో గిరిజన మహిళలు, స్వయం సహాయక సంఘాల గ్రూప్ మహిళలు, మరియు ఎంఎస్ఎంఈ యూనిట్లు తయారు చేసిన అటవీ ఉత్పత్తులు, రుచికరమైన పిండివంటలు, ఆకర్షణీయమైన హస్తకళా వస్తువులు, ఫుడ్ క్రాఫ్ట్స్ వంటి ఉత్పత్తులు ప్రదర్శించబడ్డాయి. ముఖ్యంగా, జిల్లా మహిళలు స్వయంగా రూపొందించిన ఇప్పపువ్వు లడ్డులు, బర్ఫీ, టీ పొడి, పొంగర్ పచ్చళ్ళు, కరక్కాయ పొడి వంటి ఆరోగ్యకరమైన, సంప్రదాయ ఉత్పత్తులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, ఈ ఉత్పత్తులకు లభిస్తున్న ఆదరణ పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమ్మిట్‌లో పాల్గొన్న పలువురు ప్రముఖులు, సినీ ప్రముఖులు సైతం ఈ స్టాల్‌ను సందర్శించి, మహిళల కృషిని, ఉత్పత్తుల నాణ్యతను ప్రశంసించడం విశేషం. ఇలాంటి కార్యక్రమాలు గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి, వారి నైపుణ్యాలను ప్రపంచానికి చాటిచెప్పడానికి ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ అభినందించారు. ఈ స్టాల్ ఏర్పాట్లను డీఆర్‌డీఏ ఏపీఎం ప్రసాదరెడ్డి సమన్వయం చేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



**మద్దూరు, నవంబర్ 13 (మనసులో మాట):**

మద్దూరు మున్సిపాలిటీ పరిధిలో 'ఇందిరమ్మ ఇండ్ల' నిర్మాణం వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ లబ్ధిదారులను కోరారు. గురువారం ఉదయం మార్నింగ్ వాక్‌లో భాగంగా, కమిషనర్ శ్రీకాంత్ స్వయంగా రేణివాట్ల మరియు రాళ్లబై గ్రామాలలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. త్వరితగతిన తమ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని, ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన లబ్ధిదారులకు తెలియజేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయితే పేదలకు సొంతింటి కల నెరవేరుతుందని, ఈ విషయంలో లబ్ధిదారులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతిభావంతులైన క్రీడాకారులకు నెలవు మెదక్

అదనపు కలెక్టర్ నగేష్

నల్లగొండలో జరిగే రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలకు కిట్స్ అందజేత

దాత హర్ష సేవలను అభినందించిన అదనపు కలెక్టర్



**మెదక్, నవంబర్ 13 (మనసులో మాట):**

మెదక్ జిల్లా ప్రతిభావంతులైన క్రీడాకారులకు నెలవు అని అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. పాఠశాల క్రీడా సమాఖ్య మెదక్ జిల్లా ఆధ్వర్యంలో ఈ నెల 14 నుండి 16వ తేదీ వరకు నల్లగొండలో జరగనున్న ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో పాల్గొనేందుకు సిద్ధమైన 17 సంవత్సరాలలోపు బాలబాలికల ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన ఫుట్‌బాల్ కిట్స్ ను అందజేశారు.

**దాతృత్వంపై ప్రశంసలు:**

క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్‌ను అందజేసిన దాత, ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ సర్వీసెస్ ఎం.డి. శ్రీ హర్ష సేవా దృక్పథాన్ని అదనపు కలెక్టర్ నగేష్ కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. "ఫుట్‌బాల్ పట్ల మీకున్న మక్కువ మైదానాన్ని మరింత ఉత్తేజపరుస్తూనే ఉండనివ్వండి! చివరి నిమిషంలో గెలిచిన గోల్‌తో ఉత్సాహంగా గడపాలని కోరుకుంటున్నాను! ఈ సంవత్సరం ఆనందం, విజయం మరియు ప్రేమతో హ్యాట్రిక్ సాధించండి!" అని క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా విద్యాధికారి విజయ, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్. నాగరాజు, పీడీలు జి. మాధవరెడ్డి, జట్టు కోచ్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

మనసులో మాట
KANCHARLA సంచలన తెలుగు దిన పత్రిక

# భూ భారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచండి

**కలెక్టర్ రాహుల్ రాజ్**



**శివంపేట, నవంబర్ 13 (మనసులో మాట):**

భూ భారతి సాదాబైనామా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం శివంపేట మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూ భారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిశీలన పురోగతిని సమీక్షించారు. భూ భారతి, సాదాబైనామా దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించాలని సూచించారు. ప్రతి దరఖాస్తుపై స్పష్టమైన పరిశీలన నివేదిక ఉండాలని ఆదేశించారు. దరఖాస్తులు తిరస్కరణకు గురైతే, సవివరమైన కారణాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. పౌరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, భూ సంబంధిత ప్రజా సేవలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ తెలిపారు.

**నవాబ్‌పేట భూ సమస్యపై దృష్టి:**

అనంతరం, నవాబ్‌పేట గ్రామంలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ సమస్యను కలెక్టర్ స్వయంగా క్షేత్రస్థాయిలో రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే విధంగా రెవెన్యూ సర్వే రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను పంపాలని రెవెన్యూ సర్వే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, నాయబ్ తహశీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



**పరిగి, నవంబర్ 13 (మనసులో మాట):**

వికారాబాద్ జిల్లా, పరిగి నియోజకవర్గంలో పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించే లక్ష్యంతో అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి పంపిణీ చేశారు. గురువారం పరిగి పట్టణంలోని ప్రజా భవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో నిర్వహించిన కార్యక్రమంలో పరిగి మండలానికి చెందిన 42 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 42,04,872 విలువైన చెక్కులను ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లా విద్యా రంగంలో వినూత్న కార్యక్రమాలు భేష్

**రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి**



**కరీంనగర్, నవంబర్ 13 (సమయం న్యూస్):**

కరీంనగర్ జిల్లాలో కలెక్టర్ పమేలా సత్పతి నేతృత్వంలో విద్యారంగ అభివృద్ధికి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు అద్భుతంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి ప్రశంసించారు. దాదాపు 20 అంశాలపైగా వినూతన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొంటూ, కలెక్టర్‌కు ప్రత్యేకంగా 'కితాబు' (ప్రశంస) ఇచ్చారు. గురువారం సాయంత్రం కరీంనగర్‌లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో విద్యా కమిషన్ చైర్మన్ జిల్లా కలెక్టర్ మరియు విద్యాశాఖ అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు.సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన వినూత్న కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆకునూరు మురళికి వివరించారు. ఈ ప్రజెంటేషన్ ఆద్యాంతం ఆకట్టుకుంది.వివిధ కార్యక్రమాలు, వాటి ద్వారా సాధిస్తున్న మంచి ఫలితాల పట్ల విద్యా కమిషన్ చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల పనితీరు, విద్యార్థుల హాజరు, ఫలితాలు, ఉపాధ్యాయుల వివరాలను సమగ్రంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి కీలక విషయాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లాలో చేపడుతున్న వినూత్న కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి, ఈ కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలయ్యేలా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని, ఇందులో భాగంగా విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారుజిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, కరీంనగర్ జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి పకడ్బందీగా పనిచేస్తున్నామని, మంచి ఫలితాల సాధనకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి సమిష్టిగా కృషి చేస్తున్నామని తెలిపారు. "కరీంనగర్ జిల్లాకు విద్యారంగంలో మంచి పేరు వచ్చేలా కష్టపడి పని చేస్తున్నాం," అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని వివరించారు. సమీక్ష అనంతరం విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి వీణవంక మండలం చల్లూరు గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించారు. అక్కడ విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, బోధన నాణ్యత బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు చక్కని ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ సమీక్ష కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీఈఓ మొండయ్య, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- ఉదయం 8 గంటలకు ప్రారంభం
- 59 మంది అభ్యర్థులకు 42 టేబుళ్ల ఏర్పాటు
- గరిష్టంగా 10 రౌండ్లు
- జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్



**హైదరాబాద్, నవంబర్ 13 (మనసులో మాట):**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. నవంబర్ 14వ తేదీన జరగనున్న కౌంటింగ్ నేపథ్యంలో, గురువారం యూసఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌లో ఆయన ఏర్పాట్లను పాత్రికేయులకు వివరించారు.

**కౌంటింగ్ ఏర్పాట్లు, కీలక వివరాలు:**

నవంబర్ 14వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుంది. మొదట పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ చేపట్టామని, నోటాతో కలిపి మొత్తం 59 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున, ఈసీఐ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకుని ఈసారి 42 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కౌంటింగ్ గరిష్టంగా 10 రౌండ్లు ఉంటుందని ఆయన చెప్పారు.

కౌంటింగ్ ప్రక్రియ కోసం మొత్తం 186 మంది సిబ్బందిని నియమించారు. వీరిలో కౌంటింగ్ సూపర్‌వైజర్‌లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, కౌంటింగ్ మైక్రో అబ్జర్వర్స్ ఉంటారు. ఈ ప్రక్రియను ఈసీఐ సాధారణ పరిశీలకులు మరియు ఈసీఐ బృందం పర్యవేక్షిస్తాయి. కౌంటింగ్ అప్‌డేట్‌లను ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా, అలాగే ఈసీ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు అందిస్తామని కర్ణన్ తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలోకి అభ్యర్థులు, వారి ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంటుందని, ఇతరులకు ప్రవేశం ఉండదని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.

**భద్రతా ఏర్పాట్లు:**

జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ మాట్లాడుతూ, కౌంటింగ్ కోసం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అన్ని విభాగాల పోలీసు బృందాలు అందుబాటులో ఉంటాయని, కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, రిటర్నింగ్ అధికారి పి. సాయిరాం, విజిలెన్స్ అదనపు ఎస్పీ నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆత్మగౌరవానికి చిహ్నం ఇందిరమ్మ ఇండ్లు



- ప్రతి సోమవారం లబ్ధిదారులకు బిల్లులు జమ
- ర్రాబోయే ఎన్నికల లోపు మరో మూడు విడతల్లో ఇండ్లు మంజూరు
- మ్రంత్రి శ్రీధర్ బాబు

**పెద్దపల్లి, నవంబర్ 13 (మనసులో మాట):**

పేద ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం రాత్రి మంథని మండలం అడవి సోమనపల్లి గ్రామంలో పర్యటించిన మంత్రి, అక్కడ పూర్తయిన 40 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం, మొదటి దఫాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 చొప్పున మొత్తం 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. ఇండ్లు నిర్మించుకునే పేదలు ఎక్కడా ఇబ్బంది పడకుండా, ప్రతి సోమవారం వారికి బిల్లుల డబ్బులు విడుదల చేస్తున్నామని స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల లోపు మరో మూడు విడతలలో అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. పెద్దపల్లి జిల్లాలోని మంథని నియోజకవర్గంలో గృహ ప్రవేశాలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

**సంక్షేమ పథకాలు, రైతు సంక్షేమం**

ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర సంక్షేమ పథకాలను మంత్రి ఈ సందర్భంగా వివరించారు: పేద ప్రజల ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఉగాది నుంచి నిరుపేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీతో పాటు, 11 లక్షల నూతన రేషన్ కార్డుల పంపిణీ పూర్తయిందన్నారు. 25 లక్షల 65 వేల మంది రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ పూర్తి చేశామని, దీని కోసం 20,681 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. గత ప్రభుత్వంలో 'తాళ్ళ కట్టింగ్'తో ఇబ్బంది పడిన రైతులకు స్వస్తి పలికి, సన్నరకం వడ్లకు క్వింటాలుకు 500ల బోనస్ అందించామన్నారు. వానాకాలం పంటలో సన్నరకం పండించిన ధాన్యానికి 1,800 కోట్ల బోనస్ అందించామని చెప్పారు. సోమనపల్లి వద్ద 200 కోట్లతో చేపట్టిన యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. అడవి సోమనపల్లి గ్రామంలో 3 కోట్ల 5 లక్షలతో నిర్మించనున్న సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, అడవి సోమనపల్లి గ్రామంలో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమంలో నేడు 40 గృహ ప్రవేశాలు జరపడం సంతోషకరమన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతికి అనుగుణంగా ప్రతి సోమవారం నిధులు చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.డి. హౌసింగ్ రాజేశ్వరరావు, మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగం బలోపేతానికి కృషి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**భీమవరం, నవంబర్ 13 (మనసులో మాట):**

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి గుణాత్మక విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ నేపథ్యంలో విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయడంతో పాటు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పాఠశాలలో చేపట్టిన అదనపు గదుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు సిబ్బంది విధుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఎం పి డి ఓ మధుసూదన్ తో కలిసి సందర్శించి రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి వివరాలను తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, నిరుపేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులు నిర్దేశిత విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునే విధంగా అధికారులు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకున్నట్లయితే సకాలంలో నిర్మాణ దశల వారీగా బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలో త్రాగునీరు, పారిశుద్ధ్యం, అభివృద్ధి పనుల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఏకాగ్రతతో చదివి మెరుగైన వైద్య సేవలందించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, నవంబర్ 13 (మనసులో మాట):**

వైద్య కళాశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేటలో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025 సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సులేమాన్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులు ఏకాగ్రతతో చదివి సమాజానికి మంచి వైద్య నైపుణ్యం, విలువలతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరుగుతుందని, వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 31 నాటికి గుడిపేటలో నిర్మించిన ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని మెడికల్ హబ్ గా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో జిల్లా కేంద్రంలో 300 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, జిల్లాలోని లక్షెట్టిపేట, చెన్నూర్, బెల్లంపల్లి ప్రాంతాలలో సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటుచేసి ప్రతిరోజు దాదాపు 500 మంది ప్రజలకు వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. మంచిర్యాల జిల్లాలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆసుపత్రులు, వైద్య కళాశాల ద్వారా సమీప జిల్లాల నుండే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి ప్రజలు వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల నుండి ప్రజలు మెరుగైన వైద్య సేవలు ఆశిస్తారని, తదనగుణంగా విద్యార్థులు విద్యలో నైపుణ్యం పొందాలని తెలిపారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, నర్సులు, సిబ్బందిని నియమించడం జరుగుతుందని, పీడియాట్రిషియన్, అనస్తీసియా, ఇతర వైద్య నిపుణులను తయారు చేసి ప్రజలకు సేవలు అందించడం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు.

# నేటినుంచి సౌతాఫ్రికాతో తొలిటెస్ట్




## జట్టులోకి తిరిగి వచ్చిన పంత్

న్యూఢిల్లీ : దాదాపు నాలుగు నెలల విరామం అనంతరం టీమ్‌ఇండియా వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ తిరిగి అంతర్జాతీయ క్రికెట్‌లోకి పునరాగమనం చేస్తున్నాడు. ఇంగ్లాండ్ సిరీస్‌లో భాగంగా మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్టులో పంత్ కాలికి గాయమైన విషయం తెలిసిందే. ఎముక విరగడంతో అతడు క్రికెట్‌కు దూరమయ్యాడు. ఇటీవలే పంత్ బెంగళూరు వేదికగా సౌతాఫ్రికా ఏ జట్టుతో భారత్ ఏ జట్టు తలపడిన మ్యాచ్ ద్వారా తిరిగి మైదానంలోకి అడుగుపెట్టాడు. అలాగే శుక్రవారం నుంచి దక్షిణాఫ్రికాతో జరగనున్న మొదటి టెస్ట్ మ్యాచ్‌లో ఆడనున్నాడు. ఈ నేపథ్యంలో గాయం తర్వాత తిరిగి మైదానంలోకి రావడం అనుకున్నంత తేలిక కాదని రిషబ్ పంత్ అన్నాడు. ఆ వీడియోను బీసీసీఐ పోస్ట్ చేసింది. 'గాయం తర్వాత పునరాగమనం చేయడం అంత తేలిక కాదు. కానీ దేవుడు చాలా దయగలవాడు. ఆయన చాలాసార్లు నన్ను ఆశీర్వదించాడు. అలాగే ఈసారి కూడా దేవుడు నన్ను కరుణించాడు. తిరిగి రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. గాయం నుంచి కోలుకొనే సమయంలో నా తల్లిదండ్రులు, కుటుంబం, అందరూ నాకు మద్దతుగా నిలిచారు' అని పంత్ అన్నాడు. 'నేను నా నియంత్రణలో ఉన్న విషయాల మీదే దృష్టిపెట్టగలను. అదృష్టం అనేది మన చేతుల్లో ఉండదు. కాబట్టి నేను దాని గురించి ఆలోచించకుండా ఉండేందుకు ప్రయత్నిస్తాను. మనకు నచ్చే పనులనే చేస్తూ ఉండాలి. ఏ పని చేసినా ఆస్వాదిస్తూ చేయాలి. దానికోసం 100 శాతం ఎఫర్ట్స్ పెట్టాలి' అని రిషబ్ పంత్ పేర్కొన్నాడు.

## కోల్‌కతా వేదికగా దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్

### సత్తా చాటుతామన్న స్పిన్నర్ కేశవమహరాజ్




**న్యూఢిల్లీ :** ప్రస్తుతం దక్షిణాఫ్రికా జట్టు భారత్‌లో పర్యటిస్తోంది. ఇందులోభాగంగా రెండు టెస్టులు, మూడు వన్డేలు, అయిదు టీ20లు ఆడనుంది. కోల్‌కతా వేదికగా భారత్, దక్షిణాఫ్రికాల మధ్య తొలి టెస్ట్ నవంబర్ 14న, గువాహటి వేదికగా రెండో టెస్ట్ నవంబర్ 22న ప్రారంభం కానున్నాయి. దక్షిణాఫ్రికా గత 15 సంవత్సరాలుగా భారత గడ్డపై టెస్ట్ మ్యాచ్ గెలవలేదు. ఇటీవల ఆ జట్టు పాకిస్థాన్‌లో పర్యటించింది. టెస్ట్ సిరీస్‌ను 1-1తో డ్రా చేసుకుంది. ఈనేపథ్యంలో భారత్‌లో ఎలాగైనా సత్తా చాటాలని సౌతాఫ్రికా ఉవ్విళ్లూరుతోందని, ఆ జట్టు కీలక స్పిన్నర్ కేశవ్ మహరాజ్ అంటున్నాడు. 'భారత్‌లో భారత్‌ను ఓడించాలని మేమంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. మాకు తెలుసు.. ఈ టూర్ చాలా కఠినమైనదని. భారత్‌లో ఆడటం మాకు పెద్ద పరీక్షే. అయినా మమ్మల్ని మేం నిరూపించుకోవడానికి ఇదో అద్భుత అవకాశం. పాకిస్థాన్‌లో ఉన్నట్లుగా ఇక్కడ పూర్తి స్పిన్ ఫ్రెండ్లీ పిచ్ ఉంటుందని నేను అనుకోవడం లేదు. భారత్‌లో మంచి పిచ్‌లుంటాయి. ఆట సాగుతున్నకొద్దీ వాటి స్వభావాలు మారుతుండొచ్చు' అని కేశవ్ మహరాజ్ అన్నాడు. 'వెస్టిండీస్ సిరీస్‌లో కూడా మంచి పిచ్‌ల మీదే మ్యాచ్‌లు జరిగాయి. ఆట నాలుగు నుంచి అయిదు రోజుల వరకు సాగింది. అలాగే టీమ్‌ఇండియా అద్భుతమైన జట్టు. వారు క్రికెట్‌లో ఎంతో దూరం ప్రయాణించారు. వెస్టిండీస్ సిరీస్‌ను చూసి.. ఇప్పుడు కూడా మంచి పిచ్‌లే ఉంటాయనుకుంటున్నా' అని అతడు ఆశాభావం వ్యక్తంచేశాడు. 'అలాగే మేం పాకిస్థాన్‌తో జరిగిన రెండో టెస్ట్ స్ఫూర్తితో భారత్‌లో అడుగుపెట్టాం. టాస్‌తో సంబంధం లేకుండా మేం విజయం కోసం పోరాడాం. గత డబ్ల్యూటీసీ సైకిల్‌లో ఎలాంటి పోరాటపటిమ కనబరిచామో.. ఇప్పుడు కూడా అదే తోవలో ముందుకుసాగుతున్నాం' అని కేశవ్ మహరాజ్ పేర్కొన్నాడు.

## ఐపీఎల్ వేలంపై ఉత్కంఠకు తెర

### అబుదాబి వేదికగా డిసెంబర్ 16న వేలం




ఇండియన్ ప్రీమియర్ లీగ్ వేలంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. రిటెన్షన్ గడువుకు ముందే వేలం తేదీ, వేదికలు ఖరారయ్యాయి. ఊహించినట్టుగానే ఈసారి కూడా గల్ఫ్ దేశంలోనే యాక్షన్‌కు ఐపీఎల్ పాలక మండలి ఆమోదం తెలిపింది. గత రెండు సీజన్లకు విదేశాల్లోనే వేలం పాట నిర్వహించారు. ఈసారి కూడా అదే ఆనవాయితీని కొనసాగించింది ఐపీఎల్ కార్యవర్గం. ఫ్రాంచైజీ యజమానులు సైతం ఓకే అనడంతో అబుదాబీలో డిసెంబర్ 16వ తేదిన క్రికెటర్లపై నోట్ల వర్షం కురువనుంది. పదిహేడో సీజన్ వేలం దుబాయ్‌లో, 18వ సీజన్ మెగా వేలం సౌదీ అరేబియాలోని జెడ్డా నగరంలో జరిగాయి. 19వ సీజన్ మినీ వేలం అబుధాబీలో నిర్వహిస్తారనే వార్తలు వినిపించాయి. ఇదే వేదికను ఖరారు చేసిన విషయాన్నిముందుగానే ఫ్రాంచైజీ యజమానులకు నిర్వాహకులు చెప్పారు. అయితే.. ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ లేదా బీసీసీఐ అధికారికంగా ప్రకటన చేయడమే తరువాయి అనుకుంటుండా.. డేట్, వెన్యూ ఫిక్స్ అనే వార్త వచ్చేసింది. నవంబర్ 15 సాయంత్ర వరకూ రిటెన్షన్ జాబితాను ఫ్రాంచైజీలు ప్రకటించాల్సి ఉంది. ఐపీఎల్ వేలం తేదీ రావడంతో రికార్డు ధర పలికేదుఎవరు? ఏ జట్టు ఎవరిని కొటుంది? ఎవరిని వదిలేస్తుంది? అనే చర్చలు జోరందుకోనున్నాయి. ప్రతిభావంతులపై కోట్లు కుమ్మరించేందుకు ఫ్రాంచైజీలు కసరత్తు షురూ చేయనున్నాయి. గత సీజన్‌లో రిషభ్ పంత్ రూ.27 కోట్లతో అత్యధిక ధర పలుకగా.. శ్రేయాస్ అయ్యర్ రూ.26.75 కోట్లతో రెండో స్థానంలో నిలిచాడు. పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్, అయ్యర్‌ను పంజాబ్ కింగ్స్ కొనగా.. వెంకటేశ్ అయ్యర్‌ను రూ.23.75 కోట్లకు కోల్‌కతా నైట్ రైడర్స్ అట్టిపెట్టుకుంది. ఈసారి వెంకటేశ్‌ను కోల్‌కతా వదులుకోవడం ఖాయమని తెలుస్తోంది. అలానే.. పలువురు స్టార్ ఆటగాళ్లు కూడా వేలంలోకి వచ్చే అవకాశముంది.

## కేకేఆర్ అసిస్టెంట్ కోచ్‌గా షేన్ వాట్సన్

### జట్టుతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడి



**కోల్‌కతా :** ఐపీఎల్ 2026 మినీ వేలానికి ముందు కోల్‌కతా నైట్‌రైడర్స్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు షేన్ వాట్సన్‌ను కేకేఆర్ జట్టులోకి తీసుకుంది. మాజీ ఆల్‌రౌండర్ కేకేఆర్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరిస్తాడని గురువారం వెల్లడించింది. ఆస్ట్రేలియా తరఫున 59 టెస్టులు, 190 వన్డేలు, 58 టీ20 ఇంటర్నేషనల్ మ్యాచులు ఆడిన వాట్సన్.. ఇంటర్నేషనల్ కెరీర్‌లో 10వేలకుపైగా పరుగులు చేశాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 280 కంటే ఎక్కువ వికెట్ల పడగొట్టాడు. వాట్సన్ 2007, 2015లో ప్రపంచకప్ గెలిచి ఆస్ట్రేలియా జట్టులో కీలకపాత్ర పోషించాడు. 2008 నుంచి 2020 వరకు ఐపీఎల్‌లో పలు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ఐపీఎల్‌లో 145 మ్యాచ్‌లు ఆడాడు. రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ తరఫున బరిలోకి దిగాడు. క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాక వాట్సన్ ప్రపంచవ్యాప్తంగా టీ20 లీగ్‌లో కోచ్, మెటర్ పాత్రలు పోషించాడు. కేకేఆర్ అసిస్టెంట్ కోచ్‌గా అవతారమెత్తిన వాట్సన్.. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేకేఆర్ కోచింగ్ గ్రూప్, ప్లేయర్స్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. కోల్‌కతాకు మరో టైటిల్‌ను తీసుకువచ్చేందుకు తాను ఎదురుచూస్తున్నానని చెప్పాడు. కేకేఆర్ సీఈవో వెంకీ మైసూర్ మాట్లాడుతూ వాట్సన్‌ను కేకేఆర్ ఫ్యామిలీలోకి స్వాగతించడానికి సంతోషిస్తున్నామన్నారు. ఆటగాడిగా, కోచ్‌గా అతనికున్న అనుభవం జట్టుకు ఎంతో దోహదపడుతుందని చెప్పాడు. అభిషేక్ నాయర్‌ను కేకేఆర్ ఇటీవల హెడ్‌కోచ్‌గా నియమించింది. ముంబయి మాజీ ఆల్ రౌండర్ అయిన నాయర్‌కు కేకేఆర్‌తో చాలా రోజులుగా అనుబంధం ఉన్నది. అయితే, ఐపీఎల్ 2025లో జట్టు ప్రదర్శన పేలవంగా ఉండగా.. కేకేఆర్ జట్టును బలోపేతం చేయాలని భావిస్తుంది. కేకేఆర్ గత సీజన్‌లో ఆడిన 14 లీగ్ మ్యాచుల్లో కేవలం ఐదింట్లో గెలిచింది. ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది.

## టెస్ట్ ఫార్మాట్ అంటేనూ ఇష్టం

### మహిళా క్రికెట్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్



**చెన్నై :** తొలిసారిగా.. మహిళల వన్డే ప్రపంచకప్‌ను టీమ్‌ఇండియా ఇటీవలే సొంతం చేసుకున్నది. విశ్వవిజేతగా నిలిచిన భారత జట్టుకు హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యం వహించింది. ఈ నేపథ్యంలో హర్మన్‌ప్రీత్ కౌర్‌ను చెన్నైలోని ఓ స్కూలు యాజమాన్యం సత్కరించింది. ఈ సందర్భంగా ఆ పాఠశాల విద్యార్థులు ఆమెతో కాసేపు ముచ్చటించారు. ఈ క్రమంలో వారు ఆమెను 'విరాట్ కోహ్లీ .. ఎంఎస్ ధోని .. వీరిలో మీ ఫేవరెట్ ఎవరు?' అని ప్రశ్నించారు. దానికి ఆమె 'ఎంఎస్ ధోని నా ఫేవరెట్ క్రికెటర్' అని బదులిచ్చింది. అలాగే తనకు టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ స్ఫూర్తిదాయకమని వెల్లడించింది. 'ఏ ఫార్మాట్ క్రికెట్ అంటే ఇష్టం?' అని విద్యార్థులు మరో ప్రశ్న సంధించారు. 'నాకు టెస్ట్ ఫార్మాట్ అంటే ఇష్టం' అని హర్మన్ సమధానమిచ్చింది. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జీవితంలో ఎదగడానికి, బాలికలు కష్టపడాలని సూచించింది. ఉమెన్స్ క్రికెట్ పురోగతిపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు. 'ప్రస్తుతం ప్రజలు క్రికెట్ గురించే మాట్లాడుతున్నారు. వారు మహిళల క్రికెట్, పురుషుల క్రికెట్ అంటూ.. లింగభేదం చూపించడం లేదు. ఇది ఎంతో ఆనందదాయకమైన పరిణామం. అలాగే క్రికెట్ చూస్తున్నవారి సంఖ్య కూడా పెరుగుతోంది. స్టేడియాలు కూడా జనాలతో నిండిపోతున్నాయి. ఇది గర్వించదగ్గ విషయం' అని హర్మన్ ప్రీత్‌కౌర్ ఆనందం వ్యక్తంచేశారు. మహిళల వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై టీమ్‌ఇండియా 52 పరుగులతో గెలిచిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో షెఫాలీవర్మ అటు బ్యాట్‌తోనూ, ఇటు బాల్‌తోనూ రాణించింది. బ్యాటింగ్‌లో 78 బంతుల్లో 87 పరుగులు చేసిన ఆమె, బౌలింగ్‌లో కీలకమైన సమయంలో 2 వికెట్లు తీసి టీమ్‌ఇండియా విజయంలో కీలకపాత్ర పోషించింది. అనూహ్యంగా షెఫాలీ వర్మను బౌలింగ్‌కు దింపిన హర్మన్ ప్రీత్ కౌర్.. కెప్టెన్సీలో తన అభిమాన క్రికెటర్ ఎంఎస్ ధోని బాటలోనే నడిచి ప్రత్యర్థులను విస్మయానికి గురి చేసింది. ఈ టోర్నీలో హర్మన్ అటు బ్యాటర్‌గానూ, ఇటు కెప్టెన్‌గానూ రాణించింది.

## సౌతాఫ్రికాతో అనధికార వన్డే

### భారత్ ముందు 286 పరుగుల లక్ష్యం

దక్షిణాఫ్రికా ఏ జట్టుతో రాజ్‌కోట్ వేదికగా జరుగుతున్న మొదటి అనధికార వన్డేలో భారత్ ఇన్నింగ్స్ కొనసాగుతోంది. 286 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన భారత్-ఏ 10 ఓవర్లు ముగిసే సరికి ఒక వికెట్ కోల్పోయి.. 64 పరుగులు చేసింది. ఫోర్టన్ బౌలింగ్‌లో షాట్‌కు ప్రయత్నించి అభిషేక్ శర్మ (33; 32 బంతుల్లో పెవిలియన్‌కు చేరాడు. రుతురాజ్ గైక్వాడ్ (31), రియాన్ పరాగ్ (0) ఇన్నింగ్స్ నిర్మిస్తున్నారు. భారత్-ఏ జట్టుతో రాజ్‌కోట్ వేదికగా జరుగుతున్న అనధికార వన్డేలో దక్షిణాఫ్రికా-ఏ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 285 పరుగులు చేసింది. డెలానో (90; 105 బంతుల్లో డియాన్ ఫారెస్టర్ (77; 83 బంతుల్లో ఫోర్టన్ (59; 56 బంతుల్లో అర్ధశతకాలు సాధించారు. మ్యాచ్ ప్రారంభంలో టాప్ ఆర్డర్‌ను భారత్ బౌలర్లు కుప్పకూల్చారు. కేవలం 11.2 ఓవర్లలోనే 5 వికెట్లు పడగొట్టారు. అప్పటికి దక్షిణాఫ్రికా స్కోరు 53 పరుగులు మాత్రమే. అయితే డయాన్, డెలానో, బ్జోర్న్ అద్భుత ఇన్నింగ్స్ ఆడారు. దీంతో ఆ జట్టు మంచి స్కోరే చేసింది. భారత్ బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా చెరో 2 వికెట్లు పడగొట్టగా.. ప్రసిద్ధ కృష్ణ, నిషాంత్, రియాన్ పరాగ్, నీతశ్ రెడ్డి తలో వికెట్ తీశారు.

## చెలరేగిపోతున్న లక్ష్యసేన్

### సింగపూర్ షట్లర్ జియా హెంగ్ జాసన్‌ను చిత్తు




టోక్యో : ఈ సీజన్‌లో చెలరేగిపోతున్న లక్ష్యసేన్ జపాన్‌లో తనఫామ్ చూపిస్తున్నాడు. కుమమొటో మాస్టర్స్ లో క్వార్టర్స్ ÷నైల్‌కు దూసుకెళ్లాడు. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో అతడు సింగపూర్ షట్లర్ జియా హెంగ్ జాసన్‌ను చిత్తు చేశాడు. మరో భారత ఆటగాడు హెచ్‌ఎస్ ప్రణయ్ కథ రెండో రౌండ్‌లోనే ముగిసింది. వరుస సెట్లలో విఫలమైన అతడు చేతిలో కంగుతిన్నాడు. క్వార్టర్స్‌లో అడుగుపెట్టడం ద్వారా పురుషుల సింగిల్స్‌లో భారత పతకం ఆశలను లక్ష్యసేన్ సజీవంగా ఉంచాడు. ఏడోసీడ్ అయిన లక్ష్యసేన్ కుమమొటో మాస్టర్స్‌లో తన తడాఖా చూపించాడు. తొలి రౌండ్ నుంచి దుమ్ము రేపుతున్న భారత షట్లర్ ప్రీ క్వార్టర్స్‌లో జియా హెంగ్ జాసన్( సింగపూర్)ను మట్టికరిపించాడు. 39 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వలేదు సేన్. తొలి సెట్‌ను 21-13తో అలవోకగా గెలుచుకున్న అతడు.. రెండో సెట్‌ను సైతం 21-11తో సొంతం చేసుకున్నాడు. సెమీస్ బెర్తు కోసం 2021 వరల్డ్ ఛాంపియన్ లేహ్ కీన్ యెవ్‌తో లక్ష్యసేన్ తలపడనున్నాడు.

## ఫైట్స్ చేస్తున్న మన
# శంకర వర ప్రసాద్‌గారు

చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు 'పండగకు వస్తున్నారు' అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ మూవీని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తిక వార్త ఒకటి బయటకు వచ్చింది. ప్రస్తుతం అనిల్ రావిపూడి టీం చిరంజీవిపై వచ్చే ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఈ సీక్వెన్స్ ఫిలింనగర్ గోల్ఫ్ కోర్ట్ వల్ల షురూ కాగా.. మరో రెండు రోజుల పాటు షూటింగ్ కొనసాగనుందట. ఈ షెడ్యూల్‌తో చిరంజీవికి సంబంధించిన టాకీ పార్ట్ పూర్తి కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విడుదల చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుస్మిత కొణిదెల-విష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.




# దేశంలో సగం మంది నన్ను చంపాలని చూశారు

### దకేరళ స్టోరీపై ఆదాశర్మ తాజా కామెంట్స్

వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తుంటారు నటి అదా శర్మ. ఆమె ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ది కేరళ స్టోరీ 2023లో విడుదలైన ఈ సినిమా సినీ, రాజకీయ రంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ చిత్రం విడుదలైనప్పుడు దేశంలో సగం మంది తనను చంపాలని చూశారని అదా శర్మ తాజాగా వెల్లడించారు. రిస్క్ ఉన్న పాత్రలు చేసినప్పుడే కెరీర్‌కు మరింత విలువ పెరుగుతుంది. '1920' సినిమాతో నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. నా తొలి చిత్రమే పెద్ద సాహోసోపేతమని నేను భావిస్తాను. 'ది కేరళ స్టోరీ' విడుదలయ్యే వరకూ నాకు మంచి స్క్రిప్ట్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేదాన్ని. ఆ చిత్రం తర్వాత నా కెరీర్ మారిపోయింది. దాని తర్వాత 'బస్తర్: ది నక్సల్ స్టోరీ' చేశాను. ఈ రెండు చిత్రాలు విడుదలైనప్పుడు బెదిరింపులు ఎదుర్కొన్నాను. దేశంలో సగం మంది నన్ను చంపాలని కోరుకున్నారు. మిగతా సగం మంది నాపై ప్రశంసలు కురిపించారు. వారంతా నన్ను రక్షించారు' అని అదా తెలిపారు. స్క్రిప్ట్ ఎంపిక గురించి అదా మాట్లాడుతూ సవాలుతో కూడినవి మాత్రమే ఇష్టపడతానన్నారు. 'పాత్రలో భావోద్వేగం లేకపోతే నాకు నచ్చదు. యాక్షన్ సన్నివేశాలు ఉండాలి. నేను చేసే పాత్రలో ఎమోషన్ టచ్ ఉండాలి. అది చూసి నా కుటుంబం ఒకింత ఆందోళన చెందాలి. అవన్నీ లేకపోతే ఇక ఆ పాత్ర చేయడం ఎందుకు అని నాకు అనిపిస్తుందని అదా శర్మ చెప్పారు.









# నాని, రామ్‌చరణ్‌లతో దుల్కర్ పోటీ

### ముగ్గురు సినిమాలు వచ్చే ఏడాదికి విడుదల

ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీలోని వివిధ భాషల్లో తమకంటూ సెఫరేటు ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న స్టార్ యాక్టర్లలో టాప్‌లో ఉంటారు టాలీవుడ్ యాక్టర్లు రాంచరణ్, నాని, మాలీవుడ్ యాక్టర్ దుల్కర్ సల్మాన్. యాక్టింగ్‌కు సంబంధించి ఈ ముగ్గురిలో ఎవరి స్టైల్ వారిదే.. ఈ స్టార్ హీరోల సినిమాలు ఒకేసారి బరిలోకి దిగితే ఎలా ఉంటుంది. అవును ఇప్పుడు ఆ వార్తే ఒకటి ఫిలింనగర్ సర్కిల్ లో రౌండప్ చేస్తోంది. దుల్కర్ సల్మాన్ నటించిన కాంత 14న ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిసిందే. దుల్కర్ సల్మాన్ మరోవైపు పవన్ సాదినేని డైరెక్షన్‌లో ఆకాశంలో ఒక తార సినిమాలో నటిస్తున్నాడు. అయితే ఈ సినిమా రాంచరణ్, నాని ప్రాజెక్టులతో కలిసి 2026లో విడుదల కానుందంటూ వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తుంది. నాని నటిస్తోన్న చిత్రం ది ప్యారడైజ్. ఈ మూవీ శ్రీరామ నవమి కానుకగా 2026 మార్చి 26న థియేటర్లలోకి రానుంది. రాంచరణ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం పెద్ది. ఈ మూవీ 2026 మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తాజా టాక్ ప్రకారం దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న ఆకాశంలో ఒక తార కూడా ఇదే సీజన్‌లో విడుదలకు రెడీ అవుతుందట. ఒకవేళ ఇదే నిజమైతే రాంచరణ్, నాని నుంచి దుల్కర్ సల్మాన్‌కు గట్టి పోటీ ఉండబోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆకాశంలో ఒక తార చిత్రంలో సాత్విక వీరవల్లి హీరోయిన్‌గా నటిస్తుండగా.. శృతిహాసన్ కీలక పాత్రలో నటిస్తోంది. లైట్ బాక్స్, స్వప్నా సినిమాస్, వైజయంతీ మూవీస్, గీతా ఆర్ట్స్ లాంటి లీడింగ్ బ్యానర్లపై తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# దర్శకత్వం చేస్తానంటున్న రానా

నటుడు రానా తన చిరకాల కోరికను తీర్చుకోబోతున్నాడు. చిన్న వయసు నుండే రానా దర్శకత్వం మీద దృష్టి పెట్టాడు. కొన్ని డాక్యుమెంటరీలనూ తీశాడు. దాంతో ఎప్పటికైనా రానా మంచి దర్శకుడు అవుతాడని రామానాయుడు భావించారు. కానీ చిత్రంగా 'లీడర్' మూవీతో రానా హీరో అయిపోయాడు. ఆ తర్వాత నిర్మాతగా మారాడు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ తనకు నచ్చిన పనిని చేస్తూ ముందుకు సాగుతున్నాడు. అలానే రానా తమ్ముడు అభిరామ్ 'అహింస' మూవీతో హీరో అయ్యాడు. తాజాగా దుల్కర్ సల్మాన్ తో కలిసి రానా 'కాంత' సినిమాలో నటించాడు. అంతే కాదు దుల్కర్ తో పాటు దీనిని నిర్మించాడు. ఇందులో రానా నటుడిగా కొన్ని సినిమాలను వదులు కున్నాడు కూడా. ఈ నెల 14న 'కాంత' తెలుగు, తమిళ భాషల్లో విడుదల అవుతోంది. ఈ సందర్భంగా రానా దర్శకుడు కావాలనే తన కోరిక గురించి అభిప్రయాలు పంచుకున్నాడు. వచ్చే నెల 14న తాను దర్శకత్వం వహించే సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను తెలియచేస్తానని చెప్పాడు. నటుడిగా, నిర్మాతగా, పంపిణీదారుడిగా సినిమా రంగం గురించి పూర్తి అవగాహన ఉన్న రానా మెగాఫోన్ పడితే చిరకాల కోరికను నెరవేర్చుకున్నవాడు అవుతాడు. రానా దర్శకత్వం వహించే సినిమాను ఓన్ బ్యానర్ లో చేస్తాడా? బయటి నిర్మాణ సంస్థలో చేస్తాడా అనేది తెలియాల్సి ఉంది. అలానే తాను డైరెక్ట్ చేసే సినిమాలో రానా నటిస్తాడా? లేకపోతే కేవలం దర్శకత్వానికే పరిమితం అవుతాడా? అన్నది చూడాలి.





# పిల్లలు, వృద్ధులకు నో ఎంట్రీ

### దర్శకుడు రాజమౌళి వీడియో ప్రకటన

ప్రిన్స్ మహేశ్ బాబు, దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్ లో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న ఎసెస్ఎంబి సినిమాకు సంబంధించిన ఈవెంట్ ఉంటుందా ఉండదా? అనే చర్చ రెండు రోజులుగా జరుగుతోంది. వరల్డ్ వైడ్ ఆడియెన్స్ ను దృష్టిలో పెట్టుకుని జియో హాట్ స్టార్ తో ఈ ఈవెంట్ ను రాజమౌళి బృందం ఎలాన్ చేసింది. నవంబర్ 15వ తేదీకి ఈ మూవీపై హైప్ పెంచుతూ ఒక్కో పాత్రను పరిచయం చేస్తూ వస్తోంది. ఇప్పటికే శ్రుతీహాసన్ పాడిన పాటను రివీల్ చేసిన టీమ్, తాజాగా ప్రియాంక చోప్రా లుక్ ను సైతం విడుదల చేసింది. ఇదిలా ఉంటే... ఢిల్లీలో జరిగిన బాంబ్ బ్లాస్ నేపథ్యంలో గ్లోబ్ ట్రాటర్ ఈవెంట్ ఉండకపోవచ్చుననే ప్రచారం రెండు రోజులుగా జరుగుతోంది. దీనికి రాజమౌళి తెర దించారు. ఖచ్చితంగా ఈ వేడుక ఉంటుందని హామీ ఇచ్చారు. కాకపోతే... ఇది పబ్లిక్ ఫంక్షన్ కాదని, కేవలం ఆహ్వానితులకు మాత్రమే అక్కడ ప్రవేశం ఉంటుందని, రామోజీ ఫిల్మ్ సిటీకి ఎవరు ఏ మార్గం గుండా రావాల్సి ఉంటుందనే విషయంలో రాజమౌళి ఓ వీడియో ద్వారా వివరించారు. పోలీసు శాఖ విధించిన ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని తాము కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు రాజమౌళి తెలిపారు. 18 సంవత్సరాల లోపు పిల్లలకు, పెద్ద వారికి ఈ ఈవెంట్ లో పాల్గొనే అవకాశం లేదని స్పష్టం చేశారు. వారంతా జియో హాట్ స్టార్ లో చూసి ఆనందించవచ్చని చెప్పారు. రామోజీ ఫిల్మ్ సిటీ మెయిన్ గెట్ ను నవంబర్ 15వ తేదీ మూసి వేస్తున్నారని, దానికి ముందు, దాని తర్వాత ఉన్న మార్గాల ద్వారా ఈవెంట్ కు ఆహ్వానితులు రావాల్సి ఉంటుందని, వీలైనంత ముందుగా వస్తే మంచిదని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారు క్రమశిక్షణతో మెలగకపోతే కార్యక్రమం రద్దు అయ్యే ఛాన్స్ కూడా ఉందని రాజమౌళి పరోక్షంగా హెచ్చరించారు. సో... మహేశ్ బాబు అభిమానులు, సినిమాను ప్రేమించే వారు ఏ రీతిన ఈ కార్యక్రమంలో పాల్గొని, ఏ స్థాయిలో దీనిని విజయ వంతం చేస్తారో చూడాలి.

CHIEF EDITOR BY **KANCHARLA ATCHUTA RAO** PUBLISHED AND OWNED BY KANCHARLA UPENDRA. D.NO. 1-86-3/LIG-230/5, SECTOR 5, MVP COLONY, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 530017. RNI.Title.Code:-APTEL/25/42169.
PRINTED BY **CHAITANYAVARADHI** PRINTERS D.NO. 3-39, BHARNIKAM VILLAGE & POST, PARAVADA MANDAL, VISAKHAPATNAM, ANDHRA PRADESH - 531021. E-MAIL: kancharlamediaprint@gmail.com CELL: 8374758861